శ్రీ

చింతామణి.

ఇదిమాసమునకొకసారి ప్రకటింపఁబడును.

సంపుటము ౮.] రాజమహేంద్రవరము. [సంచిక. ౮౧.
మన్మథసంవత్సర వైశాఖమాసము.

కాశ్మీరరాజ్యము,(Cashmere.)

కాశ్మీరరాజ్యముత్తరహిందూస్థానములోనున్న స్వతంత్రరాష్ట్రములలో ముఖ్యమయినది. దేశముయొక్క వైశాల్యము ౮౦౯౦౦ చదరపుమైళ్లు. ౧౮౯౧వ సంవత్సరములో జనులు ౨౫౪౩౯౫౨. ఆదాయము ౮౦౭౬౦౦౦ రూపాయలు. ఈదేశము పర్వతప్రదేశము; పర్వతములు సంవత్సరములో నెనిమిదినెలలు మంచుతోఁగప్పఁబడియుండును. కొన్నిచోట్లమంచు కరఁగి నదులుగా ప్రవహించును. అడవులలో మంచి కలపపెరుగును. ఈదేశములో భూకంపములప్పుడప్పుడు కలుగుచుండును. ౧౮౮౫వ సంవత్సరములో భూకంపముగలిగి వేలకొలఁది జనులు మృతినొందిరి. కాశ్మీరదేశము శాలువులకు మిక్కిలిప్రసిద్ధి. ౧౭౫౨వ సంవత్సరము మొదలుకొని ౧౮౧౯వ సంవత్సరమువఱకును దేశము అఫ్ఘన్ దేశస్థులక్రిందనుండినది. ౧౮౧౯వ సంవత్సరమునందు సీకులు దేశమునుజయించి, ౧౮౪౬వ సంవత్సరమున సీకుయుద్ధముజరగువఱకును పాలించిరి. మహారాజారణజిత్ సింగు తనవద్దగుఱ్ఱపుదళవాయియయిన గులాబిసింగునకీదేశమునిచ్చెను. ౧౮౪౬వ సంవత్సరమునందు డెబ్బదియైదులక్షలరూపాయలిచ్చిన మీఁదట రాజ్యమాతనికి విడిచిపెట్టఁబడినది. ౧౮౫౭వ సంవత్సరమునందు గులాబిసింగు మృతినొందఁగా, జ్యేష్ఠపుత్రుఁడయిరణబీరసింగు రాజ్యమునకువచ్చెను. అతఁడు ౧౮౮౫వ సంవత్సరమువఱకును ప్రభుత్వముచేసి పరలోకగతుఁడుకాఁగా, అతనిపుత్రుఁడు ప్రతాపసింగురాజ్యమునకువచ్చెను. ఈతఁడురాజ్యము తిన్నగాపాలించలేదని కొంతకాలము రాజ్యమొకసభకొప్పగింపఁబడినదిగాని యిప్పుడుమరల మహారాజుగారికియ్యఁబడినది. ఈదేశమునకు శ్రీనగరమురాజధాని. ౧౮౯౧వ సంవత్సరమున శ్రీనగరములో ౧౨౦౦౦౦జనులుండిరి. వీరిలోనిరువదివేలు మాత్రముహిందువులు, తక్కినజనులందరును మహమ్మదీయులు. దేశమంతయు నించుమించుగా మహమ్మదీయులతో నిండియున్నను, వెనుకటి మహారాజులలోనొకరు తనతండ్రి చేఁపజన్మమెత్తెనన్న నమ్మకముచేత దేశములోనెవ్వరును చేఁపలనుతినఁగూడదని యుత్తరువుచేసిరి. ఇప్పటిమహా

రాజా గారగు ప్రతాపసింగు బహదూరు గారి పటమిా క్రింద వేయఁబడినది. ఈయన రాజపుత్రవంశజుఁడు. వయస్సిప్పుడు ౬౨ సంవత్సరములు.



From a Photo by Bourne and Shepherd, Calcutta.

౪౯. నీకారుణ్యముగల్గునట్టినరుఁ డేనీచాలయంబుల్ చొరం
డేకార్పణ్యపు మాటలాడఁ డడుగం డెవ్వాని నేవేషమున్
గైకోఁ డేమతముల్ భజింపఁడిల నేకష్టప్రకారంబులన్
జీకాకై చెడిపోఁడు జీవనదశన్ శ్రీకాళహ.

౫౦. నీపైకావ్యముఁజెప్పుమన్న యతఁడున్, నీపద్యముల్ వ్రాసియి
మ్మా పాఠంబొనరింతునన్నయతఁడున్, మంజుప్రబంధంబు ని
ష్టాపూర్తిన్ రచియింతునన్న యతఁడున్ సద్బాంధవుల్ గాక చే
చే స్వస్త్రాగతబాంధవంబు నిజమా శ్రీకాళహ.

౫౧. నీరూపంబుదలంపఁగాఁ దుదమొదల్ నేఁగాన నీవైనచో
రారాయంచుమునాకుఁ జెప్పవు వృథారంభంబు లింకేటికిన్
నీరన్ముంచుము పాలముంచుమికనిన్నే నమ్మి నాఁడం జుమీ
శ్రీరామార్చితపాదపద్మయుగళా శ్రీకాళహ.

౫౨. నిన్నే నమ్మినరీతి నమ్మనొరులన్, నీకన్న నాకెన్నలే
రన్నల్, దమ్ములు, తల్లిదండ్రులు, గురుండాపత్సహాయుండు నా
యన్నా! యెన్నఁడు నన్ను సంసృతి వికారాంభోధి దాఁటించి య
చ్ఛిన్నానందసుఖాబ్ధిఁ దేల్చెదిఁకనో శ్రీకాళహ.

౫౩. మాయాజాండక దండకోటిఁబొడిగా మర్దించిరో? విక్రమా
జేయుంగాయజుఁ జంపిరో? కపటలక్ష్మీమోహముల్ బాసిరో?
యాయుర్వాయుభుజంగ మృత్యువు ననాయాసంబుగా గెల్చిరో
శ్రేయోదాయకులౌదు రెట్టులితరుల్ శ్రీకాళహ.

౫౪. అమ్మాయయ్యయటంచు నొప్పిపడి నేనన్నన్, శివా! నిన్ను నే
నమ్మీనీమదిఁదల్లిదండ్రులనటంచుం జూడఁగాఁబోకు నా
కిమ్మైతల్లియుదండ్రియున్ గురుఁడునీవే కాన సంసారపుం
జిమ్మంజీఁకటి గప్పినంగడపునన్ శ్రీకాళహ.

౫౫. వెనుకన్ జేసిన ఘోరదుష్కృతులు భావింపంగరోఁతయ్యెడున్
వెనకన్ ముంగలవచ్చు దుర్మరణముల్ వీక్షింపభీతయ్యెడున్
ననునేఁజూచిన నావిధుల్ తలఁచినన్ నాకే భయంబయ్యెడున్
చినుకుంజీఁకటినాయె కాలమునకున్ శ్రీకాళహ.

౫౬. రోసిన్ రోయదు కామినీజనుల తారుణ్యోరుసౌఖ్యంబులన్
బాసెన్ బాయదు పుత్రమిత్ర ధనసంపద్భ్రాంతి వాంఛాలతల్

గోసింగోయను నామసంబకట నీకున్బ్రీతిగా సత్క్రియల్
జేసింజేయుదు దీనిఁదుల్యపడవే శ్రీకాళహ.

౫౭. తాతల్ తల్లియుఁ దండ్రియున్ మఱియుఁ బెద్దల్ చావఁగాఁ జూడరో
భీతిన్బొందఁగ నేల చావునకుఁ గాఁ బెండ్లాము బిడ్డల్ హిత
వ్రాతంబుల్ బలవింపజంతువులకున్ వాలాయమైయుండఁగా
చేతోవీధినరుల్ మిముంగొలువరో శ్రీకాళహ.

౫౮. సంపద్గర్వముఁ బాఱఁద్రోలి రిపులన్ జంకించి, యాకాంతలన్
తాపుల్ పెట్టి, కళంకముల్నఱికి, బంధక్లేశదోషాదులన్
జింపుల్చేసి, వయోవిలాసములనాఱేపించి, భూతంబులన్
జెంపల్ వేయఁగనిన్నుఁగానఁగలనా శ్రీకాళహ.

౫౯. తమనేత్రద్యుతిఁ దామెచూడ సుఖమై తాదాత్మ్యమున్గాంపఁగా
విమలంబుల్ కమలాభముల్, జితలసద్విద్యుల్లతాలాసముల్
సుమనోబాణజయప్రదంబులనుచున్ జూచున్ జనంబాని వా
రమ్యన్గాక్షీవహంబు కన్నుఁగవలన్ శ్రీకాళహ.

౬౦. పటువద్రజ్జుభుజంగవద్రజత విభ్రాంతిస్ఫురద్భుక్తివ
ద్ఘటవచ్చంద్రశిలా జపాకుసుమరుక్కాంగత్వ వత్త్వంబు వా
క్పటిమంజేతురు చిత్సుఖంబనుభవింపన్ లేకదుర్మేధసుల్
ఘటుకన్నంతనఁబోవఁ జూతురధముల్ శ్రీకాళహ.

౬౧. శ్రీశైలేశుభజింతునో యభవుఁగాంచీనాథు సేవింతునో
కాశీవల్లభుఁగొల్వఁబోదునొ మహాకాళేశుఁబూజింతునో
నాశీలంబణువైన మేరువనుచున్ రక్షింపవే నీకృపా
శ్రీశృంగారవిలాసహాసములచే శ్రీకాళహ.

౬౨. భసితోద్ధూళన ధూసరాంగులు, జటాభారోత్తమాంగుల్ తపో
వ్యసనుల్, సాధితపంచవర్ణరసనుల్ వైరాగ్యవంతుల్, నితాం
తసుఖస్వాంతులు సత్యభాషణసముద్యద్రత్నరుద్రాక్షరా
జిసమేతుల్, తుదినెవ్వరైనఁగొలుతున్ శ్రీకాళహ.

౬౩. వినుఁడెందాఁక ధరిత్రినుండుదననునందాకన్ మహారోగదీ
పనదుఃఖాదులఁ బొందకుండ ననుకంపాదృష్టివీక్షించి యా
వెనుకన్ మీపదపద్మముల్ దలఁచుచున్ విశ్వప్రపంచంబు పా
సిన చిత్తంబుననుండఁజేయఁగదవే శ్రీకాళహ.

భాస్కరవిలాసము.(౫౪౦-పుట శేషము)

నేనవి పట్టుకొని యగసాలెవానియింటికిఁబోయి యమ్మఁజూపఁగా నాయీ సాలెవాని చేతనే దండతాయెత్తులు చేయించుకొనుచుఁ గూరుచున్న, వైదికవృత్తి నాశ్రయించి యున్నవానివలెఁ గనఁబడిన, యొక బ్రాహ్మణుఁడు నాలుగయిదు నిమిషములు నావంకఁ దేరిచూచి నాచేయిపట్టుకొని యగసాలెవాని చేతిలోనుండి కడియము లెక్కలాగుకొని చేరువనున్న తనయింటికి నన్నుఁ దీసికొనిపోయి తివాసిమీఁదఁ గూర్చుండఁబెట్టియు, భార్యనుబిలిచి "ఇదుగో నీవుస్తె నిలబెట్టిన పుణ్యాత్ముఁడు," అని చెప్పెను. ఆమె తన "నాయనా! ఇదంతా మీచలవ. మీరుచేసిన వుపకారం యీతనువుండగా మరిచిపోను." అనెను. అంతట బ్రాహ్మణుఁ డందుకొని, "బాబూ! యీ రెండేళ్లనుంచీ మీరిక్కడే వున్నారా? బస యేవీధిని?" అని యడిగెను. నేను దానికుత్తరముచెప్పి యాతని వృత్తాంతమడిగితిని. ఆబ్రాహ్మణుఁ డిట్లుచెప్పెను:—

"నేను యీవూరువచ్చినతరువాత నాలుగురోజులవరకూ నీరసంచేత యెక్కడికీ వెళ్లలేక యింట్లోనే కూర్చున్నాను. మీరు దయచేసిన రూపాయే అప్పడు నాకు పథ్యపానాదుల కుపయోగించి నన్ను మళ్లీ యెప్పటివాణ్ణిచేసింది. వీధిలోకి వెళ్లడానికి దారుఢ్యం కలగగానే నేను బసచేసిన వీధినున్న బ్రాహ్మణభక్తిగల కోమటి నొకణ్ణి చూడగా అతడు నామీఁద జాలిపడి నాకు నెల్లాళ్లవరకూ అన్నవస్త్రాలకు లోపం లేకుండా గడపినాడు. యీవూరి కోమట్ల బ్రాహ్మణభక్తివంటి బ్రాహ్మణభక్తి యెక్కడా చూడబోము. ఆకోమటివల్లనే క్రమంగా నాకు మరి పదిమంది కోమట్లతో పరిచయం కలిగింది. మోటతనమూ కఠూర్తీ లేకుండా వాళ్లయిళ్లల్లో హవ్యకవ్యాలు చేయిస్తూ రావడంచేత అయిదారునెలలలో పూటమయిన పదిహేనుకోమటిళ్ల పౌరోహిత్యము నాకు దొరికింది. యీ రెండేళ్లలోనూ యీ యిల్లూ పాత్రసామానూకాక తగుమాత్రం గుల్లా గుడ్డా సంపాదించుకున్నాను. చేతులోనూ యెప్పుడూ పాతికా ముప్ఫయి వుంటూనేవున్నాయి. ఇదంతా మీరు పెట్టినభిక్ష. మీచేతిచలవ."

అని యొకనిమిష మూరకుండి, "మీకు సొమ్మవసరమున్నది గాబోలు, యీ రూపాయలు పట్టించుకువెళ్లండి" అని పదిరూపాయలు నాచేతికిచ్చెను. "ఈరాత్రి బయలుదేరి మేము యింటికి వెళతాము. మీరూపాయలు మీకు పంపిందాకా యీ కడియాలు మీదగ్గరవుంచండి." అని నేను కడియాలతనిచేతిలోఁ బడవేసితిని. అతఁడవి తనయొద్దనుంచ నక్కరలేదనిచెప్పి యవి నామీఁద మరలఁ బడవేసెను. కాని నేను గట్టిగా పట్టుపట్టితిని. అంతలో నతనిభార్య అడ్డమువచ్చి, "అవి పట్టుకువెళ్లకుంటే నన్ను చంపుకుతిన్నట్టు. అమ్మాయి మొండికాళ్లతో యింటికివెళ్ళ వల్లగాదు. అని

కడియాలు నేనిమిటిమొద్దనుండి పుచ్చుకొని నాచేతిలోఁ బడవేసి నన్ను మాఱుమాటాడ నీయదయ్యెను.

షష్ఠాశ్వాసము.

నే నెలమంచిలిలో దిగునప్పటికి నామనస్సును గింకర్తవ్యతా మూఢత యావేశించియుండెను. ఎలమంచిలిలో నుందునా? ఉండి యేమిచేయుదును? లింగరాజుపాలెము వెళ్లుదునా? అప్పటి నాస్థితిలో మామగారియొక్కయు నత్తగారియొక్కయు మొగము లెట్లుచూతును? మఱెక్కడనుందును? ఏమిచేయుదును?

ఇట్లు డోలాయమాన మానసుఁడనయి యుండఁగా టపాబంట్రౌతు నాకొక జాబుతెచ్చియిచ్చెను. అది విప్పిచూడఁగా నీక్రిందియర్థమిచ్చెడిమాట లందుండెను:— 'ఇక్కడ శ్రీకాకుళమున మీకు కొంతదూరజ్ఞాతియైన ప్రబల వెంకమ్మగారు మొన్ననే కాలధర్మము నొందెను. ఆమెకు ఈచుట్టుపట్ల జ్ఞాతులెవ్వరును లేరు. ఆమె భూముల వలన సంవత్సరమునకు ఏఁబదిగరిసెల ధాన్యము భాగమువచ్చును ఈయాస్తియంతయు ఆమె పినతండ్రికొడుకు లపహరింపవలయునని చూచుచున్నారు. మీరు వెంటనేవచ్చిన యెడ ఈచెప్పినయాస్తియేకాక రెండుమూఁడువేల రూపాయల విలువగల చరరూపకమయిన యాస్తికూడ మీకు స్వాధీనము కాఁగలదు.'

నాఁటి సాయంకాలమే బయలుదేరి శ్రీకాకుళమునకు వెళ్లితిని. పైజాబులో నున్న మాటలన్నియు జరగెను. ఆ యాస్తియంతయు నాకు స్వాధీనమయ్యెను.

పిమ్మట నావాదుకప్రకారము జాలముచేయక నేనుచేసిన తొలిపని యేదనఁగా, నాభార్యయొక్క శిష్యురాలయిన రెడ్డమువారి బొట్టెకు నూటయేఁబది రూపాయల బరంపరపుఁ బట్టుచీర యొకటియు, నాకు బదులిచ్చిన బ్రాహ్మణునికి పదిరూపాయలును పంచెలచాపొకటియుఁ, గాకినాడకుఁ బంపుటయే.

తరువాత నిర్విచారముగా, ఈపనిచేయక తప్పదన్న నిర్బంధము లేనివాఁడనయి, సుఖముగాఁ గాలము గడపుచుంటిని. ఇట్లు పదునెనిమిదిమాసము లయిన పిమ్మట నొకనాఁ డొక ఒడ్డెవాఁడువచ్చి నాకుమారునికిఁ దనచేత ఒడ్డెటీకాలు వేయింపుమని కోరెను. నాభార్యయు అప్పుడాయూర నక్కడక్కడ స్ఫోటకము కనఁబడుచుండెనని తనకుఁ దెలిసెననియు కాఁబట్టి పిల్లవానికి శీఘ్రముగా టీకాలు వేయింపుమనియుఁ జెప్పెను. ఆలోచించి చెప్పెదనని యా యొడ్డెవానిని బంపివేసి నాభార్యతో ఒడ్డెటీకాలే మంచివో యింగ్లీషుటీకాలే మంచివో జిల్లాడాక్టరుగా రక్కడనుఁ బది

దినములలో రానయియుండెను గనుక వచ్చినప్పుడాయనతోఁ జర్చించి సిద్ధాంతము చేసినపిమ్మట నేది మంచిదని యేర్పడునో యా టీకాలు వేయింపవచ్చునని చెప్పితిని.

ఏమికారణమువలననో కాని డాక్టరు అనుకొన్నట్లు పదిదినములలో రాలేదు. మరుసటినెలలో రావచ్చునని చెప్పిరి. నేనంతవఱకును నిరీక్షింప నెంచితినిగాని నాభార్య మావీధినే యొకయింట స్ఫోటకము కనఁబడినందున నన్ను తొందరపెట్ట నారంభించెను. నేను ఇంగ్లీషు టీకాలు వేయింతునా, ఒడ్డె టీకాలు వేయింతునా, యని యయిదాఱుదినములు గడపితిని. అంతట నొకనాఁడు నా కుమారునికిఁ గఠినమయిన జ్వరమువచ్చెను. ఆ జ్వరము మఱునాఁడును విడువలేదు. మూఁడవనాఁటికి శరీరమునఁ జిన్నచిన్న పొక్కులు కనఁబడెను. అప్పుడది స్ఫోటకమని గ్రహించితిమి. ఏమిలాభము? మఱి రెండుదినములలో పిల్లడు ప్రాణమువిడిచెను!

ఇది నా మాంద్యమువలన సంభవిల్లిన యాపదయని నేనును నాభార్యయు నెఱిఁగినను నామనసు నొప్పింపనొల్లక నాభార్యయు, ఏమిచెప్పుటకును దోఁచక నేనును, ఆ ప్రస్తావ మొండొరులతోఁ దేనొల్లమయితిమి.

కాని నాభార్య, నాకొఱకయి, తన మనస్స్థితి బయికిఁ గనఁబడకుండఁ బ్రవర్తింప నెంత యత్నముచేసినను ఒకనాఁటి కొకనాఁడు లోలోపలనే కృశింప నారంభించెను. నేనది కనుఁగొని, అది తన తల్లిదండ్రులను జూచుచున్నయెడనయినను గొంత యూరటను పొందఁగలదేమోయని యెంచి రాయవరమునందే కాపురముండ నిశ్చయించుకొని శ్రీకాకుళమునందలి భూములను ముప్పదివేలకు విక్రయించి యక్కడనుండి బయలుదేరి నాభార్యతో రాయవరమువచ్చితిని.

అక్కడ కోరుమిల్లివారి భూములు అమ్మకమునకు రాఁగా వెంటనే నేను ముప్పదివేలరూపాయలను ఇచ్చి ప్రతిసంవత్సరమును పదునైదువందల రూపాయల ఫలమురాఁగల భూములను కొని వారివలనఁ గ్రయపత్రము వ్రాయించుకొంటిని. సొమ్మిచ్చి ముట్టినట్లు రసీదును వ్రాయించి పుచ్చుకొంటిని.

నాలుగు నెలలు వ్యవధికలదుగదాయని వెంటనే యెలమంచిలివెళ్లి యచటి కచేరీలో రిజిష్టరుచేయింపక యెండలకు భయపడి చల్లని తోటలచేఁ జుట్టఁబడియున్న రాయవరమునందే వేసంగి గడప నిశ్చయించుకొని, యక్కడనేయుంటిని. ఇట్లుండఁగా నిరువది దినములయినతరువాత నూరిలో నగ్నిపుట్టి మాయిల్లును పరశురామప్రీతియయ్యెను. అప్పుడు కాగితము లన్నిటితోను పూర్వోక్తపత్రమును రసీదునుగూడ కాలిపోయెను. దుర్మార్గులయిన యా భూవిక్రేతలు మరల పత్రము వ్రాయరైరి. నా ముప్పదివేలును, నాకున్న సమస్తధనమును, దగ్ధమయ్యెను.

కాని యింతట మఱియొక యవితర్కితకార్యము సంభవించి నాస్థితినంతను మఱియొకవిధముగా మార్చెను.

*　　　*　　　*　　　*

(ఆ యవితర్కితకార్యమేమో భాస్కరరాయఁడు "శేషు" వ్రాయవచ్చునని నిల్పి యుంచినందున అదేదో మనమెన్నఁటికిని దెలియఁజాలము. ప్రకాశకుఁడు.)

ఆధునికకవులు. (౫౬౩-పుట శేషము)

ఈయన యనంతరమునందు పింగళసంవత్సరాశ్వయుజ శుద్ధ సప్తమినాఁడు జన్మించిన యీయనపుత్రుఁడు సార్వభౌమ తిమ్మరాజుగారు సింహాసనమునకు వచ్చి ముప్పదితొమ్మిదిసంవత్సరములు ప్రజాపరిపాలనముచేసి డెబ్బదవయేట ౧౭౪౮ వ సంవత్సరమునకు సరియైన విభవసంవత్సర ఫాల్గుణ బహుళ త్రయోదశినాఁడు దేహనియోగము నొందిరి. మనకవి తాతయైన యేనుఁగు లక్ష్మణకవిగారీయనకాలమునందే యుండి యీ మహారాజునకుఁ దాను రచించిన ద్రౌపదీపరిణయము నంకితముచేసినట్లీక్రింది పద్యములవలనఁ దెల్లమగుచున్నది—

సీ. రాజులు మెచ్చఁ బల్లాకోటసాధించి నరహరిదేవు దర్పమణంచెఁ
గుదురైనభాషిణికోటలగ్గలుపట్టి యొందుకోటంతయు నుర్విఁగలపెఁ
దుగరాజుమొదలైన దొరలనుభంగించె విశ్వంభరునియుద్ధ విహతుఁజేసెఁ
జగఁబూసపాటి సీతారామ భూపాలుఁ డభినుతింపఁగ విజయంబుగాంచె
నరిసమరు యవనాధీశు నురగపతిని । గయ్యమున గెల్చె లోకవిఖ్యాతిచెందె
వత్సవాయాన్వయమునకు వన్నెతెచ్చె । రాయపన్నపాలు శ్రీతిమ్మరాజనృపాళి.

చ. హరిహరపద్మజాంశభవుఁడై తగు నేనుఁగు లక్ష్మణార్యుచే
సురుచిరశబ్దభావరసశుంభదలంకృతిమాధురీ మనో
హరమగు ద్రౌపదీపరిణయంబను నుత్తమకావ్యమందె సు
స్థిరమగు కీర్తిసొంపెసఁగఁ దిమ్మనృపాలుఁడు ధర్మపద్ధతిన్.

ఈ యేనుఁగు లక్ష్మణకవియే ధ్రువచరిత్రమును వేంకటరాజపుత్రుఁడగు గ్గరాజునకును, తుల్యామాహాత్మ్యమును కస్తురి రంగరాజ పుత్రుఁడగు జగన్నాథరాజునకును, వత్సవాయ కులజులయిన రాజబంధువుల కంకితముచేసినట్లీ పద్యములవలనఁ దెలియుచున్నవి—

చ. కవికులసార్వభౌముఁడనఁగాఁదగు నేనుఁగు లక్ష్మణార్యుచే
ధ్రువచరితప్రబంధము బుధుల్వినుతింపఁగనంది యోగభు
గ్భవన మహాసుఖానుభవ కారణమైన యశంబుగాంచె వా
సవవిభవుండు వత్సవయ జగ్గనృపాలుఁడు సద్గుణోన్నతిన్.

ఉ. హేమనగేంద్రధీరుఁడగు నేనుఁగు లక్ష్మణసత్కవీంద్రుఁ డు
ద్దామసుధామయోక్తి వితతంబగునట్లు రచించినట్టి తు
ల్యామహిమప్రబంధము గుణాఢ్యులు మెచ్చఁ బరిగ్రహించెఁ బ్ర
జ్ఞామహితుండు జగ్గనృపచంద్రుఁడు శాశ్వతకీర్తిసంధిలన్.

ఈ తిమ్మరాజుగారి యనంతరమునం దాయనతమ్ములైన బలభద్రరాజుగారి కుమారులు

రాయపరాజుగారు ౧౮౦౯ వ సంవత్సరమునందు రాజ్యమునకువచ్చి యిరువదియాఱు సంవత్సరములు క్షమాపతిపాలనను చేసి నలువదేండ్ల ప్రాయమున ౧౮౩౫ వ సంవత్సరమునకు సరియైన మన్మథ సంవత్సర జ్యేష్ఠశుద్ధ చతుర్థినాఁడు పరమపదమునొందిరి. ఈయన తండ్రియగు బలభద్రరాజుగారు తాము కవులయి రామశతకమును జెప్పుటయే కాక కిరాతార్జునీయకృతినందినట్లీపద్యము తెలుపుడుచేయుచున్నది—

చ. అమితఖ్యాతికి మూలమైనకృతిఁ దానందెన్ గిరాతార్జునీ
యము శ్రీరాములపేరఁ బద్యశతకం బారూఢినిర్మించె భో
జమహీజానిగతిన్ బ్రసిద్ధిగనియె న్సాహిత్యపారజ్ఞుఁడై
రమణన్ శ్రీ బలభద్రరాజు ప్రజలన్ రక్షించె ధర్మస్థితిన్.

తరువాత రాయపరాజుగారికుమారుఁడు తిమ్మరాజుగారురాజ్యమునకువచ్చి దాదాపుగా నిరువదిసంవత్సరములు పాలనముచేసి నుప్పదిసంవత్సరముల ప్రాయముననే ౧౮౫౫ వ సంవత్సరమునకు సరియైన రాక్షస సంవత్సర చైత్రశుద్ధ ద్వాదశినాఁడు పరమపదము నొందిరి. తదనంతర మాయన పుత్త్రుఁడు శ్రీరాయజగపతిరాజుగారు రాజుగాఁజేయఁబడి యిరువదిసంవత్సరముల యెనిమిదినెలలు రాజ్యపాలనముచేసి యుండూరువద్ద శ్రీపూసపాటి యానందగజపతిరాజుగారితో జరగిన యుద్ధములో నిరువదియైదుసంవత్సరముల యీడుననే ౧౮౫౯ వ సంవత్సరమునకు సరియైన ప్రమాదిసంవత్సర పుష్య శుద్ధ నవమినాఁడు రణనిహతులయిరి. ఈయన పిమ్మట వే యేనుఁగు లక్ష్మణకవిగారి కాశ్రయుఁడయియుండిన (రాయ జగపతిరాజుగారి పుత్త్రుఁడయిన) తిమ్మజగపతిగారు రాజ్యమునకువచ్చి ౧౮౯౮ వ సంవత్సరమువఱకును ప్రభుత్వముచేసి స్వర్గస్థులయిరి. పయిని వివరించిన చరిత్రమునుబట్టి పెద్దాపుర సంస్థానాధిపతులందఱు నించుమించుగాఁ దాము కవులయ్యును కవుల నాదరించి కృతులందినవారయ్యును ఉండిరని తెలియవచ్చుచున్నది. ఏనుఁగు లక్ష్మణకవి తిమ్మజగపతిరాజు తండ్రియగు రాయజగపతి మహారాజుగారి కాలములో సహితముండినట్లు తద్రచితమైన యీచాటుపద్యము పలుకుచున్నది—

ఉ. ఆయతవత్సవాయ సుకులాంబుధి పూర్ణనిశాపతీ జగ
ద్గేయ శుభాకృతీ విదితకీర్తిసతీ కమనీయ యౌవన
ప్రాయనలాకృతీ సతతవైభవ నిర్జిత పూర్వదిక్పతీ
ధీయుతవాక్పతీ జగపతీ నృపతీ సుకృతీ మహోన్నతీ.

ఈ జగపతిరాజుగారు కవిత్వమునందు నిపుణులయి పెక్కుపదములు శతకములు దండకములు మొదలయినవి భద్రాద్రిరామునిమీఁదఁ జెప్పినట్లు రామవిలాసములోని యీ పద్యము ఘోషించుచున్నది—

చ. పదములు కీర్తనల్ రుచిరపద్యశతంబులు రాగమాలికల్
మృదుపదదండకంబులు సమిద్ధగతిన్ రచియించి కామిత
ప్రదునకు భద్రశైల రఘుభర్తకుఁ గానుకగా నొసంగె నా
త్రిదశులు మెచ్చఁగా జగపతి ప్రభుచంద్రుఁడు భక్తిపెంపునన్.

ఏనుఁగు లక్ష్మణకవికృతములయిన గ్రంథములలో సుభాషిత రత్నావళియు రామవిలాసమునుమాత్రము నాకు లభించినవి. ఇందు మొదటిపుస్తకము భర్తృహరియొక్క సంస్కృతగ్రంథమునుండి తెనిఁగింపఁబడినను, గొంచెమయినను విరసముగా నుండక మూలానుసారముగాను నిర్దుష్టముగాను రసవంతముగాను హృదయరంజకముగాను ఉన్నది. స్వస్థలమయిన పెద్దాడగ్రామమునందలి సోమశంకరస్వామి తన హృదయమున సాక్షాత్కరించి సుభాషిత రత్నావళిని దెలిఁగింపుమన్నట్లు కవి యీపద్యమునఁ జెప్పుకొన్నాఁడు—

సీ. కలధౌతగిరియును గలధౌతగిరియును విల్లుగాఁ బొడవైన యిల్లుగాఁగఁ
గమలాహితుండును గమలాహితుండును శరముగా లలిత శేఖరము గాఁగఁ
బద్మోద్భవుండును బద్మోద్భవుండును సాదిగా మెయిఁదాల్చు బూదిగాఁగఁ
బవనప్రియుండును బవనప్రియుండును సొమ్ముగా ఫాలనేత్రమ్ముగాఁగఁ
గ్రాలుపెనువేల్పు మమ్మేలువాలు దాల్పు। జగములకుఱేఁడు ధనదుని సంగడీఁడు
హరుఁడు పెద్దాడ సోమశంకరుఁడు హృదయ। సరసిజంబున నాకు సాక్షాత్కరించె.

రామవిలాసములోని యవతారికనుండి యన్ని పద్యముల నుదాహరించినతరువాతఁ గవిత్వము నిర్దుష్టము గాను మృదుమధుర వాగ్గుంభనలు కలదిగాను ఉండునని వేఱుగఁ జెప్పనక్కఱ లేదు. పూర్వోక్తములయిన గ్రంథద్వయమునుండియుఁ గొన్ని పద్యముల నుదాహరించి కవిచరిత్రము నింతటితో ముగించుచున్నాను—

సుభాషితరత్నావళి.

చ. నతులగుచున్న హీనుల నుతిఁదనర్చుచు నన్యగుణోక్తిచే గుణో
న్నతిఁ బ్రకటించుచున్ బరజనప్రియకార్య సమర్థతన్ సమం
చిత నిజకార్యసంగ్రహము చేయుచు నిష్ఠురవాదులన్ క్షమా
ధృతి నిరసించుచున్ బరఁగుధీరులు పూజ్యులు గారె యేరికిన్. —నీతిశతకము.

చ. అతివలఁ జూచి పీరబలలంచు వచించు మహాకవీంద్రు లు
ద్ధత విపరీతవాదు లిదిదబ్బఱ గాదు విలాసినీ సమం
చిత తరళాక్షిపాతములచే గెలువంబడి రింద్రముఖ్యులున్
ధృతినటువంటివా రబలలే? గతిసైరి తలంచిచూడఁగన్. —శృంగారశతకము.

చ. కడు వెఱపించుచున్నదిమి గడ్డతిజెబ్బులిమాడ్కి నున్న దె
క్కడు పగదాయలంబలెఁ దెగుళ్లు శరీరము నొంచుచున్న వె
ప్పుడొ చను భిన్నకుంభజలముంబలె నాయువు నిట్టులయ్యుఁ దా
రుడుగక మానవుల్దురిత మోలి నొనర్చుచునున్నవార హా! — వైరాగ్యశతకము.

రామవిలాసము.

ఉ. వాసవనీలనీలము లవారిత విభ్రమశీలముల్ మరం
దాసవలోలముల్ యువభయానకసూనకదంబ పుండ్రకాం
డాసనముక్తలోహ గుళికాళికరాళము లంజనప్రభా
భాసుర భృంగజాలములు బంధురవృత్తిఁ జరించెఁ గాననన్. — ఆ. ౧.

శా. రామా రాజలలామ యోగిహృదయారామా మహాభోగ సు
త్రామా నాకొక ముద్దుపెట్టుమవు రా రాయంచుఁ గౌసల్య సు
ప్రేమం బిల్చిన మువ్వలందియలు గంభీరంబుగా మ్రోయఁగా
శ్రీమంతుండటు రావిరేక మెఱయం జేరంగవచ్చున్ గృపన్. — ఆ. ౨.

చ. కటుభటఘోషగర్జితము ఖాడ్గికపాణి నటత్కృపాణరు
క్తటిదుదయంబు చిత్రఘటిత ధ్వజపంక్తిసురేంద్రచాపము
ద్భటదివిషత్ప్రతాప రవిబాధక ముగ్రనిశాటవాహినీ
పటుఘనబృందమయ్యెడ నభంబునఁ బర్వెను స్పృక్ప్రవర్షియై. — ఆ. ౩.

ఉ. చంపకపుష్పవాసనల సారమెఱింగిన షట్పదంబులీ
సొంపగు కన్నె పెన్నెరులు చూచితిరే చెలులారయంచు భా
షింపుచుఁ గింకిణీవలయ శింజితమొప్పఁ దలంచె వేడుకన్
సంపఁగినూనెచేత నొకశారదచంద్రనిభాస్య సీతకున్. — ఆ. ౪.

ఉ. ఇందుమెలంగు భృంగములు నిచ్చటికీరమయూరశారికా
బృందము లిందుఁ గల్గు సురభిప్రసవంబులు సాధనంబులై
ముందలఘించినన్ హరునిఁ బూనిజయింపఁడె మారుఁ డంచు నె
న్నందగి రాముకేళి భవనప్రమదావన వాటివాటిలున్. — ఆ. ౫.

ఆడిదము సూరకవి.

ఈకవి నియోగిబ్రాహ్మణుఁడు; ఆడిదము బాలభాస్కరుని పుత్రుఁడు. ఈ యడిదము బాలభాస్కరుఁడు శుద్ధాంధ్ర రామాయణమును రచించినట్లు కవిజనరంజనములో సూరకవి వేసికొన్న

"శుద్ధాంధ్రరామాయణ ఘటనావైపక్షి ధురంధరాడిడము
బాలభాస్కరతనూభవ"

అను గద్యమువలనను, కవిసంశయవిచ్ఛేదములో బాలభాస్కరుని శుద్ధాంధ్ర రామాయణములోనిదని యుదాహరించిన

"నిగిడిరువైపుల స్వేదజల నేఁటయునీటుగుపిటికోట"

అను చంపకమాలికాపాదమువలనను దెలియవచ్చుచున్నదిగాని యీ శుద్ధాంధ్ర రామాయణ మిప్పు డెచ్చటను గానరాదు. ఈ సూరకవితాను జేసిన గ్రంథములనన్నిటిని రామచంద్రపుర రామలింగేశ్వరుని కంకితము చేసెను. ఇతఁడు చేసిన గ్రంథములలో నెల్లఁ జంద్రమతీపరిణయమను నామాంతరముగల కవి జనరంజనము మిక్కిలి మనోహరమైనది. ఇది మూఁడాశ్వాసములుగల చిన్న ప్రబంధమైనను, దీనియందలి గుణసంపదను బట్టి పండితులు దీనిని పిల్ల వసుచరిత్రమని వాడుచున్నారు. ఇతఁడు చేసిన యితర గ్రంథములు రామలింగేశ శతకము, కవిసంశయవిచ్ఛేదము, ఆంధ్రనామశేషము, అనునవి. కవిసంశయవిచ్ఛేద మనునది మూఁడాశ్వాసముల చిన్న లక్షణగ్రంథము. ఆంధ్రనామశేషము పైఁడిపాటి లక్ష్మణకవికృతమైన యాంధ్రనామ సంగ్రహములో లేని యచ్చతెలుఁగు పదముల నేర్చి కూర్చిన పద్యరూపమగు చిన్న నిఘంటువు. కవి తన గ్రంథములనన్నిటిని దేవాంకితములు చేయుటచేత వానినిబట్టి కవికాలమును నిర్ణయించుట శక్యము కాదు. ఇతనిచే రచియింపఁబడిన గ్రంథములనుబట్టి కవి గోదావరి మండలములోనివాఁడయినట్టు కనఁబడుచున్నాఁడుగాని యితఁడు విజయనగర సంస్థానములో శ్రీపూసపాటి విజయరామరాజుగారి కాలములో నుండినట్టు తద్రచితములయిన చాటుపద్యములు మొదలయినవానివలనఁ దెలియవచ్చుచున్నది. విజయనగర సంస్థాన ప్రభువులలో విజయరామరాజు లిద్దఱున్నందున నితఁడే విజయరామరాజు కాలములో నుండినవాఁడో నిశ్చయింప శక్యము కాకున్నది. పెద్దాపురములో వత్సవాయ తిమ్మజగపతి మహారాజుగారు రాజ్యము చేయుచున్న కాలములో నీ కవి తన ప్రభువు వెంట పెద్దాపురపుసంస్థానమునకువచ్చి రాజులందఱును సభ చేసి కూరుచుండియుండఁగా

ఉ. రాజకళంకమూర్తి రతిరాజు శరీరవిహీనుఁ డంబికా
రాజు దిగంబరుండు మృగరాజు గుహాంతరసీమవర్తి వి
భ్రాజిత పూసపాడ్విజయ రామనృపాలుఁడె రాజుగాక యీ
రాజులు రాజులే పెనుతరాజులుగాక ధరాతలంబునన్.

అను పద్యమును సభలో నాసీనులయియున్న రాజులవంకఁ జూచుచు లేచి చదివె ననియు, అందుమీఁద నిందలి కడపటివాక్యము తమ్ముద్దేశించి పలికినట్లు భావించి రాజు

లందఱును కవిని గోపదృష్టితోఁ జూచుచు లేవఁబోఁగా నతఁడు జంకక పద్యార్థమును జెప్పి "యీరాజులనఁగాఁ" బై చరణములయందుఁ జెప్పఁబడిన రాజు మొదలయిన వారని స్పష్టపఱిచి రోషముడిపి వారిని శాంతచిత్తులను జేసెననియు, చెప్పుచున్నారు. ఏనుఁగు లక్ష్మణకవిగారి నాదరించిన యీ వత్సవాయ తిమ్మజగపతి మహారాజుగారు ౧౭౫౯ వ సంవత్సరము మొదలుకొని ౧౭౯౭ వ సంవత్సరము వఱకును రాజ్యము చేసిరి. ఈయన కాలములో నుండినవారు రెండవ విజయ రామరాజుగారే. ఈయన విజయనగర రాజ్యమునకు వచ్చినదియు తిమ్మజగపతి మహారాజుగారు పెద్దాపుర రాజ్యమునకు వచ్చిన సంవత్సరములోనే. ఈ విజయరామరాజుగారు ౧౭౫౯ వ సంవత్సరము మొదలుకొని ౧౭౯౪ వ సంవత్సరము వఱకును రాజ్యపాలనము చేసిరి. ఈరాజు లిద్దఱును సింహాసన మెక్కునప్పటికి యుక్తవయస్సురాని బాలురు. వీరిలో తిమ్మజగపతి మహారాజులుగా రప్పటి కేఁడుసంవత్సరముల ప్రాయమువారు; విజయరామరాజుగారు పండ్రెండుసంవత్సరముల ప్రాయమువారు. నిజాము ౧౭౬౦ వ సంవత్సరమున రాజమహేంద్రవరము వచ్చినప్పుడు వీరినిద్దఱిని గొనిపోయి దర్శనముచేయింపఁగా నతఁడు వీరినిద్దఱిని వారివారి సంస్థానములకు రాజులనుగా నంగీకరించెను. మొదటివిజయ రామరాజుగారు బొబ్బిలియుద్ధమున ౧౭౫౭ వ సంవత్సరముననే మృతులయినందున, తిమ్మజగపతి మహారాజుగారి కాలములోనుండినయతఁ డతఁడయి యుండఁడు. సింహాసనమునకు వచ్చునప్పటికి వీరిద్దఱును బాలురయినందున వీరు తమ యాస్థానకవులతోఁ గలిసి పెద్దాపురమున సమావేశమగుట తరువాత నిరువదిసంవత్సరముల కనఁగా ౧౭౭౭ వ సంవత్సరప్రాంతమందయియుండును. అందుచేత సూరకవి ౧౭౩౦ వ సంవత్సరమువఱకైనను జీవించియుండవచ్చును. ఇతఁడు పెద్ద విజయరామరాజుగారి కాలములోఁగూడ బాల్యావస్థలో నుండియుండును. కవికాశ్రయుఁడైన విజయరామరాజుగారిని గూర్చియు వారి సంస్థానమునుగూర్చియు నింకఁ గొంత వివరించుట యనుచితము కానేరదు.

ఓరుగంటియందుండిన కాకతీయరాజులు చెప్పుకొనునట్టుగానే యీపూసపాటి వారును తాము సూర్యవంశజుఁడైన మాధవవర్మ సంతతివారమని చెప్పుకొందురు. కొండపల్లి సర్కారులోని పూసపాడను గ్రామనివాసముచేత వీరికి పూసపాటివారని యింటిపేరుగలిగినది. ఓరుగంటి సంస్థానము ప్రతాపరుద్రునితో నశించిన వెనుక వత్సవాయవారు పూసపాటివారు మొదలయినవారు మహమ్మదీయులకు లోఁబడిరి. రఘునాథరాజను మాఱుపేరుగల పూసపాటి తమ్మిరాజుగారు గోలకొండలో సరదారుగానుండి శ్రీకాకుళమునకువచ్చి, శ్రీకాకుళమునకు ఫౌఁజుదారుగానుండిన;

షేర్ మహమ్మదుఖాఁ వలన ౧౬౫౨వ సంవత్సరమున కూలిమి భోగాపురపు తాలూకాలను గుత్తకుపుచ్చుకొని పాలనముచేయ నారంభించెను. ఈయన పుత్రుఁడయిన సీతారామచంద్ర రాజుగారు మఱికొన్ని తాలూకాలనుకూడ కవులునకు పుచ్చుకొని, పర్లాకిమిడి సంస్థానాధిపతియైన గజపతిదేవుతో మైత్రిసంపాదించి, ౧౨౫ గుఱ్ఱపు రౌతులతోను ౪౫౦ కాల్బలముతోను పోట్నూరుజయించి కళింగరాజని పేరువడసి యాయూరు నివాసమేర్పఱుచుకొని ప్రబలుఁడయియుండెను. ఈయన యనంతరమున నానందరాజుగారు పరిపాలనమునకు వచ్చిరి. ఈయనపుత్రులు విజయరామరాజుగారు బహు ప్రసిద్ధపురుషులు. ఈయన మన్నెదొరలనుగెలిచి వారి దేశములాక్రమించుకొని మన్నెసుల్తాను బిరుదుంది, పోట్నూరునుండి తనపేరట విజయనగరమనుపేరఁబరగిన యూరికి రాజధానిని మార్చుకొని, ౧౭౧౨వ సంవత్సరమునకు సరియైన విజయసంవత్సర విజయదశమీ జయవారమునాఁడు కోటకట్టుటకు శంకుస్థాపనము చేసెను. ౧౭౫౩ వ సంవత్సరమున నిజాము కొండపల్లి యేలూరు రాజమహేంద్రవరము శ్రీకాకుళము సర్కారులను ఫ్రెంచివారికిచ్చెను. అప్పుడు విజయరామరాజుగారు శ్రీకాకుళమునకు నాయిబయిన జాఫరల్లీతోఁ జేరి దేశము ఫ్రెంచివారికి స్వాధీనము కాకుండునట్లు చేయుటకయి ప్రయత్నించెనుగాని, వారు రాజమహేంద్రవరము శ్రీకాకుళపు సర్కారులను తక్కువకిస్తుకు కవులునకిచ్చెదమన్నందున జాఫరల్లీ విడిచి ఫ్రెంచివారితోఁ జేరెను. తరువాత సర్కారులలోని రాజులందఱును ఫ్రెంచివారికిలోఁబడక తిరుగఁబడినప్పుడు సహితమీయన వారియెడల విశ్వాసముగలవాఁడయియుండి ౧౭౫౫వ సంవత్సరమున ఫ్రెంచి సేనానాయకుఁడయిన బుస్సీకి కావలసిన ధనమును రహస్యముగాఁ బంపెను. తరువాత బుస్సీ సేనలతో దేశమును స్వాధీనము చేసికొనుటకు కళింగదేశమునకు వచ్చినప్పుడీయన బొబ్బిలివారితోడి తన పూర్వవైరమును సాధించుకొనుటకయి బుస్సీని పురికొల్పి యుద్ధముచేయునట్లుచేసి తానుగూడ సేనలతోఁబోయి ౧౭౫౭వ సంవత్సరము జనేవరునెల ౨౪వ తేదిని తాండ్ర పాపయ్యచే పొడువఁబడి పరమపదము నొందెను. తరువాత విజయరామరాజుగారి పితృవ్య పుత్రుఁడయిన యానంద గజపతిరాజుగారు సింహాసనమునకువచ్చి, బుస్సీ విజయరామరాజుగారి యెడలఁ జూపిన యాదరమున తనయెడలఁ జూపకపోవుటచేత మనసులో ద్వేషము పెట్టుకొని బుస్సీ విశాఖపట్టణము మొదలయిన స్థానముల నన్నిటిని స్వాధీనముచేసికొని పైయధికారుల యుత్తరువు ననుసరించి యీదేశమును విడిచి కర్ణాటకమునకు వెడలిపోఁగానే సేనలను గూర్చుకొనిపోయి విశాఖపట్టణమును పట్టుకొని దాని నింగ్లీషువారికి వశపఱిచెదనని యుత్తరములు వ్రాసి ౧౭౫౮వ సంవత్సరమున వారితో స్నేహము

చేసికొనెను. తరువాత నతఁడు ఫ్రెంచివారి నుత్తరపుసర్కారులనుండి తఱిమివేయు ప్రయత్నములో నింగ్లీషువారితోఁ జేరి, దొరకినకొల్లలోఁ దనకు భాగమిచ్చునట్లును జయించినదేశములలో నదీసముద్రతీరపట్టణములును వాని చుట్టుపట్లఁగల దేశమును దక్క మిగిలిన భాగమును దన పాలనములో నుంచునట్లును యుద్ధవ్యయములక్రింద తాను నెల కేఁబదివేలరూపాయలచొప్పున నిచ్చునట్లును ఏర్పఱుచుకొని, కర్నల్ ఫోర్డుగారిచే నడపఁబడుచుండిన యింగ్లీషుసేనతోఁ దనసేనను జేర్చి దండయాత్ర వెడలెను. అదివఱకే ఫ్రెంచిసేనానాయకుఁడయిన కన్‌ఫ్లాన్సుగా రానందగజపతి రాజుగారిని శిక్షించుటకయి దండయాత్ర వెడలి యింగ్లీషుసేన యాయనతోఁ జేరినదని విని రాజమహేంద్రవరమున నిలిచిపోయెను. కర్నల్ ఫోర్డుగా రానందరాజుగారు వెంటరాఁగా రాజమహేంద్రవరమునకువచ్చి ఫ్రెంచి సేనాధిపతియైన కన్‌ఫ్లాన్సుగారి నక్కడనుండి పాఱఁద్రోలి, మచిలీబందరువఱకుఁబోయి దానిని స్వాధీనపఱుచుకొనెను. దండువెడలియున్న యింగ్లీషువారిని జయించుటకై నిజాము సలాబత్‌జంగు మచిలీబందరుకు ౧౫ మైళ్ళదూరమువఱకునువచ్చి వారిని జయించుట సాధ్యముకాదని తెలిసికొని ౧౭౫౯వ సంవత్సరము మెయినెల ౧౪వ తేదిని సంధిచేసికొని మచిలీబందరు సర్కారును కొండవీడు నైజాముపట్టణము సర్కారులును ఇంగ్లీషువారి కిచ్చివేసి, ఆనందగజపతి రాజుగారు ఫ్రెంచివారి కియ్యఁబడిన దేశమునుండి గ్రహించిన సొమ్మువిషయమయి తగవుపెట్టక విడిచిపెట్టి వారి తండ్రి తాతలనుండి వారనుభవించుచుండిన దేశమును వారనుభవించుట కంగీకరించెను. ఈ యొడంబడిక యయినతరువాత స్వదేశమునకు వచ్చుచు త్రోవలో రాజమహేంద్రవరమున నానందగజపతిరాజుగారు స్ఫోటకముచేత కాలధర్మమునొందిరి. అప్పుడాయనభార్య లిద్దఱును సహగమనము చేసిరఁట! తర్వాత బొబ్బిలిలో మృతులయిన విజయరామరాజుగారి భార్య చంద్రయ్యమ్మగారు సన్నిహితజ్ఞాతియైన పూసపాటి రామభద్రరాజుగారి ద్వితీయభార్య పుత్రుఁడయిన పండ్రెండు సంవత్సరముల ప్రాయముగల వేంకటపతిరాజును చిన్నవానిని పెంచుకొని, ఆ చిన్నవాని పేరు విజయరామరాజుగా మార్చి యాయనను పట్టాభిషిక్తునిజేసెను. ఈ విజయరామరాజు బాలుఁడయినందున రాజ్యాధికారము నంతను సవతియన్నగారగు సీతారామరాజుగారువహించి, తమ్మునకుయుక్తవయస్సువచ్చినతరువాతసహిత మధికారమునంతను తానే చెల్లించుచువచ్చెను. ఈ విజయరామరాజుగారి కాలములోనే మనకవియుండినది. ఆకాలమునందు విజయనగరమువారు నిజామునకు కట్టు పన్ను రెండులక్షల తొంబదివేల యేఁబదితొమ్మిదిరూపాయలు అయినను దేశమస్వస్థస్థితిలో నున్నందున నిజాము తనకు రావలసిన కప్పమును సన్నఁగాఁ గైకొన శక్తుఁడు గాక పెక్కేండ్లూరకుండుచువచ్చెను.

(సశేషము) కం. వీరేశలింగము.

రామాభ్యుదయము. (౫౧౬-పుట శేషము.)

గీ. అనియె నంగదుఁ డిదికొండ యనలకొలఁకు । లరయ నారగల్లు ప్రత్యక్షమయ్యె నిచటఁ
బిల్లమెఱుఁగులఁ బోదు కప్పించరాదు । దీని నేలాగునఁ దరింపఁ దీఱు మనకు.

వ. అని కడలికడ నిలిచి మఱియును.

క. జంభారి విసవైచిన । దంభోళికి తెక్కయిచ్చ తలఁగకమును సం
రంభించి చనిరొఁదాన । య్యంభోనిధి దాఁటు నే విహంగమవిభుఁడున్.

చ. అదియటులుండె నింకొక మహాజవసత్వసమర్థుఁ డెవ్వఁడే
ని వితరియించి రావణుని యిల్లు చొరంబడి సీతయున్న చో
టిది యని చూచివచ్చి మన యిందఱ యాఁదల మాఁపుడించి యా
పద యను వారిరాశి కొకపారముఁ జూపునొకో తటాలునన్.

క. ఒడయని పని యూఁడేఱచి । యడియాలము చూపనోపకుంటి మనమేలా
యడవుల ఫలమూలాదులు । చెడఁ దిననా నిలుగఁ ద్రొక్కి చెట్లు చెఱచనా.

వ. అని పలికి నిరుత్తరులైన వానరవీరులం జేఱిచూచి వెండియు.

చ. అనుకొనుఁ గాక తావలసిన ట్లిరియున్నతలంపు లీనులన్
వినరో బళా బలాబల వివేకమొనర్పుమి యెల్లఁ జేతఁ గా
దనుటగదా యెఱింగి తెనవైన నిఁకన్ ననుఁ జూపఁ దద్ధిరం
ఘనమన నెంతనాఁ నినఁ గ్రక్కున భల్లుకవల్లభుం డనున్.

క. దొరకఁ బని చెప్పి కలిగిన । పరివారము చూచుచుండఁ బాల్పడు నే యె
వ్వరు నేల యెంతపనికిన్ । ధురంధరుఁ డవు పవనసుతుఁడు తోడై యుండన్.

చ. అని హనుమంతు దిక్కు మొగమై పవమానతనూజ యేమ యూ
నిసుఁగపి మాత్రుఁ జేసికొని నీపని మాపయిఁ బెట్టి యుండె దిం
తని తన యానవాలు రఘునాయకుఁ డెవ్వరిచేతికిచ్చెనో
మన తెగలోఁ దలంచికొనుమా యపుడన్నియుఁ గాన నయ్యెడున్.

క. నీసత్తువ నీవెఱుఁగవు । వాసరపతి పొడమి పండువలె నుండ గఁ జే
రాసం బిన్నప్పడనా । యోసత యోజన శతత్రయం బెగరవచ్చే.

గీ. అనుచుఁ దను నింత గుఱిచేసి యనుసరించి । ప్రార్థనా గౌరవముతోడి పలుకు పలుక
వినిసముత్సాహ సంరంభ వివశుఁడగుచు । గాడ్పు దేవర గారాపుఁ గన్నకొడుకు.

క. తన ప్రాపునచ్చి వచ్చిన । పెనుగపులకు సంతసంబు పెంపుగఁ బెరిఁగెన్
వినుముట్టఁ గట్టి బిగియం । దన కాసియ వారిరాశి దాఁటెడు తెగువన్.

క. ఇటు నిశ్చయించి యపుడటు । నిటుఁ జూచి మహేంద్రశైలమెక్కిన లంకా
పుట భేదనంబు మీఁదికిఁ । బటుమెగయును వాయుసూతి పొమ్మరికదలెన్.

వ. కదలి యచ్చేరువనుండు కొండదండకుం బోయి యారోహణంబునకుం బ్రారంభించి.

చ. ఒకయెడ నుగ్గొక్కచక్కినిడి యూఁదినఁ దచ్చరణంబు నిర్ఝరో
దకములు ముంపునం దడియఁ దద్గిరిగోడి రడంగ లేచి యొం
డొక యెడ నగవ్వలన్ నిలువనుండి యథాస్థితి నర్ఘ్యపాద్య పూ
ర్వకముగ రాఘవాప్తునకు వచ్చి యొనర్చెనిపో యనోయనన్.

వ. తదనంతరంబు.

సీ. అడుగులొత్తినపట్లఁ బిడుగు మొత్తినయట్లు బహుమహోపలములు పగిలిపడఁగఁ
దోఁకద్రిప్పినపట్లు మూఁకవిప్పినయట్లు బలుగానలిలఁగూలి బయలుగాఁగఁ
గేలఁదట్టినపట్లఁ గోలఁగొట్టినయట్లఁ గరికేసరాదులు గలఁగిపఱవ
రంతుచూపినపట్లు వంతుమోపినయట్లు గుహలు ప్రతిధ్వనుల్ గ్రుమ్మరింపఁ
గంపిత ధరాధరాధిత్యకారుహ ద్రీత | గంగఘటు చెల్లెడల నుప్పరంబు లెగసి
పడితడిప్ప కార్య్యదాహ విభ్రాంతకప్రల | యుల్లములతో దవాగ్నులఁ జల్లఁ జేయ.

గీ. ఒడలువడసిన తమతండ్రి వడువు దోఁప | రయమునకుఁ గూటకోటులన్ని యుఁజలింపఁ
బెరిఁగి గిరిగాద్పుకొడు కెక్కి తిరిగితిరిగి | యొక్కచో నిల్చి దక్షిణదిక్కుఁ జూచి.

క. కట్టకటుధరణీ కటితట | పటమనిపించుకొనఁగన్న పారావారం
బిటువచ్చి కుటిలదానవ | పుటభేదన వప్రపరిఘుపో యనఁదగెఁగా.

క. తగుఁగాక తాను దనలో | నిగురొత్తిన కీడు దాని నేలినవాఁడున్
జగదేకపతికి రఘుపతి | కగపడ కెటుపోఁగవచ్చు ననియున్ముఖుఁడై.

గీ. గాడ్పు వేల్పుపట్టి గట్టెక్కి యుక్కునఁ | జూచె నూటి నేటిజోటిమగని
భావి సేతువచ్చు పడ లంక కడకును | సూత్రపట్టుమాడ్కిఁ జూడ్కి వెలుఁగ.

మ. తనచూపంబుధిమీఁదఁ బాఁచి శ్రవణద్వంద్వంబు రిక్కించి వం
చిన చంచద్భుజముల్ సముత్కటకటీ సీమంబులన్ బూంచి తోఁ
క నభోవీధికిఁ బెంచి యంఘ్రిలిఱియంగాఁ బెట్టి బిట్టూఁది గ్ర
క్కున నక్కొండయడంగఁ ద్రొక్కి పయికిం గుప్పించి లంఘించుచోన్.

క. గిరి గ్రుంగఁ ద్రొక్కి చెంగున | హరినింగికి దాఁటుగొనిన హరిహరియపుడా
హరి యెగసి నట్లు దోఁచక | గిరి యెగసిన యట్లు తోఁచెఁ గెళవులకెల్లన్.

క. గిరికార్ముక నిర్గతమై | హరిశరమపు డసుర పురవరాభిముఖుండై
సురగరుడ దురవలోక | త్వరతోఁ జనె నాక మహారవంబుదయింపన్.

క. వాలంబుఁ దానుఁ గరువలి | వేలుపుకొడుకరుగఁ జూచి విపరీతగతిన్
దోలదొరఁకొనెనా రవియిటు | దేలంబెను గాడితోడి తేరని రమరుల్.

క. పవనజజంఘాసంభవ । పవనము వడిఁ గడలిఁ బోయి వడవడఁ జను హో
వివరమునకుం జొరంబడి । పవనాశనకోటి నాశపఱిచి గమించెన్.

వ. అప్పుడు.

సీ. నగశిఖాశిల లెగసి గుభేలురనఁ గూలి యాగామిసింధు బంధా?నయము
సమధురప్రసవగుచ్ఛము లుచ్ఛలితములై సతమకుమార నక్షత్రశంకఁ
బొడవంటుకొనఁ గొట్టువడి గొంతవడి హారుల్ శరదభ్రజాత సంజాతబుద్ధి
నుప్పరంబున లేచి యుదధివీచీపఙ్క్తు లజలమేఘములకు సజలగుణముఁ
జూపజంఝూసమీరంబు కోపు నెఱప । నిక్కుఁ దనకుక్కు దక్షిణదిక్కుఁ జూడఁ
గిలిశిఖలోలెఁ జాఁచిన కేలు లుకఁ । జంకసడఁ జూచు పొంకంబు సంతరించె.

వ. మఱియు.

సీ. రఘువరేణ్యక్రోధ రసములంకకుముట్టఁ గ్రొవ్వారు కాలువ ద్రవ్వెననఁగ
నాగామిసేతు బంధానురూపంబుగాఁ జేయు గుణావర్త మోయనంగ
నవయశోవసనంబు లవనికర్పించి యచ్చెల్వ నల్లని వల్వదించెననఁగ
దనుఁ జూడ శేషుండు తలుపులు దెఱచిన బలిమందిరంబు వాకిలియొయనఁగ
నొకనిమిషమాత్ర మప్పుడయ్యుదధినడుమ । నఱకువడి తోఁచె నదరంటఁ జఱిపెఱచు
నలఘుజంఘా ప్రభంజనంబులఁ దనర్చి । యతఁడు ద్రావెఁ ద్రికూటకూటాగ్రవీధి.

వ. ఇవ్విధంబున నంబునిధిని స్తరించి.

సీ. అగరుధూపపుఁ బొగల్ పొగరారు కురులుగా నవగవాక్షము లీక్షణములుగాఁగఁ
జికిలిపటంకముల్ చెక్కుటద్దములుగా నగరిహజారంబు మొగముగాఁగ
నతులవీధిక లలంకృతభుజాలతలుగాఁ బ్రమదశైలము లురోజములుగాఁగ
దృశ్యశృంగాటక దీర్ఘికనాభిగాఁ బృథువప్రచక్రంబు పిఱుఁదుగాఁగఁ
బికశుకీకేకి మధుకర ప్రకరముఖర । వనవలయరేఖ బెళబెళ వలువగాఁగ
రావణుని చెట్టవట్టిన రాజ్యలక్ష్మి । కైపుఁ దోఁపించు లంకపొంకంబు గాంచి.

సీ. అదరుమంటలు గ్రక్కు నట్లున్నయది గదా వజ్రరత్నప్రభావళులచేత
నట్టహాసము చేయు నట్లున్నయది గదా పటహాదికార్భటీ పటిమచేత
నదటు మైగర్జించు నట్లున్నయది గదా ప్రతిపతాకాంశుకాహతులచేత
నాహవగతి గాంచు నట్లున్నయది గదా నగశిఖరారోహణంబుచేత
దీనిఁ గనుఁగొన్న వేగంటి దేవరకును । వెచ్చనిట్టూర్పు పుక్కిట వెడలకున్నె
ముకుటకంపంబు తడవుగా ముసరకున్నె । పిడుగుటడిదంబు చేనిడి పనకయున్నె.

వ. అనుచు నయ్యసుర పరివృఢపురవర సౌభాగ్యంబు నగ్గించి జనకతనయాన్వేషణ

మనీషాయత్తచిత్తుండై కరువలికొడుకు నిరపాయంబుగాఁ దగినయుపాయంబులెల్ల
నుల్లంబున వల్లించి.

క. ఇదివేళ గాదుచొరఁబడి । వెదకఁగ ననియున్న యతనివెరవు త్రిలోకా
భ్యుదయాంకురార్పణం బీ । కదలిక యాపేర్తునన్నగతి రవి గ్రుంకెన్.

గీ. అంతఁబడమట నెఱసంజయామ కవిసె । నలి కనుమూసెఁ దుమ్మెద కలువకరిగెఁ
బులుఁగిరవుచేరె మెఱుఁగుడుఁబురువు వెలిఁగెఁ జెంటనెడఁబాసిజక్కవయొంటిఁదిరిగె.

ఉత్సాహ. చుక్కత్రొక్కఁడెక్కుడైన సుడివడంగఁ దొడఁగె న
మ్మక్కనింగిపొడి యనంగనప్పుడిరులు నెఱసెఁబో
యెక్కడెక్కడను వియోగి హృదయతాపదవహవి
ర్భుక్కలానుమాన జనకరూపమై దురాపమై.

క. అంత హనుమంతుఁడంతట । సంతమసముముదీఱె నిదియెచాటనియొకచో
గంతున లంకానగరా । భ్యంతరమున వ్రాలి యుచితమగు వేషమునన్.

లయగ్రాహి.

వీధులను గన్మొఱవువేదుల మరుత్తరుల షాపల సరోవర తటాకముల మణి ప్రా
సాదములఁ గేలి గిరిపాదములఁ దద్గతపయోదముల బంధుగృహభేదములఁ గాంచెన్
మోదములతోఁ గలహఖేదములతో సరసవాదములతో హితవినోదములతో నా
నాదనుజదంపతుల క్రీడనుకుపట్టఁ బికనాద నుడుగెంచఁ గనరాదనుచుఁ బొంచెన్.

వ. తదనంతరంబ.

క. బలురక్కసులెత్తిన క । త్తులతోదీవియలు బలియ దుందుభులులియం
బొలిఁబ్రహరి దిరుగునెల్లరఁ । జులకగఁ గికురించి నగరుచొచ్చి కడంకన్.

క. పులియున్న పొదనెపన్నగ । బిలమయ్యెను రారిపడక పెనుమేడచొరన్
దలఁకకచని యొల్లెడన్ । వెలఁదులు మధువానిపొరలు వెతఁగనుఁగొనుచున్.

సీ. మణిమయస్తంభ శుంభద్దీపకళికలు వేనవేలిరువంక వెలుఁగుచుండఁ
జెఱలఁజేపడిన జేజే రాణివాసంబు లలఁతి నిద్దురలతో నడుగులొత్తఁ
గడిఁదితొమ్మనఁ గాయకాచినచౌదంతి కొమ్ముదాఁకినజీర యుమ్మెనెఱపఁ
బదిచెంపకొప్పులఁ బారిజాతంపుఁ గ్రొవ్విరిదండ నెత్తావి సిరులనీన
నొక్కమహనీయ శయ్యపై నొడలుమఱచి । నిదురవోయెడు దైతేయ భీమరపాణిఁ
జూచితలఁయాఁగియూ రాజ్యసుఖమితండు । చెఱుచుకొనెఁ గాకమనమున నెఱుకలేక.

చ. సమదపురందర ద్విపనిశాతవిషాణ ముఖక్షతవ్రణాం
కములిగురొత్తు పేరురపుఁ గండువయన్యవధూకుచాగ్ర కుం

కుమ రసరక్తమై మెఱయఁ గూర్కఁగ ట్లనైతో మ్ముపోటులన్
సమయు నిఁకన్నిశాచర నికాయము రాముని చే రణంబునన్.

క. భావి దశాననుహానికి । లోవగచుచుఁ గుంది యిందులోనుండుదె య
ద్దేవి గుణాభరణ జగ । త్పావనచారిత్ర యనుచుఁ బావని మఱియున్.

క. మెచ్చగ నంబుధి దాఁటితిఁ । జొచ్చితి నీస్వేచ్ఛ గలయ శోధించితి నిం
దిచ్చో టచ్చో టనకిపు । డెచ్చోటుం జెలువఁ గాన నిది యేమియొకో.

ఉ. భూమిజఁ గానకే మగుడిపోయిన నేమని చూచువాఁడ నా
రాముని నెమ్మొగంబు మదిఁ బ్రత్యుపకారము సేయఁ గోరు నా
ఖామృగ భర్తృప్రాణకయిఁకం బుది నేమగు సీతయున్కి మా
న్నాముది ఫల్గు చెప్పుట నిరర్థకమే విధ నేమనంగలన్.

సీ. అందఱు వినంగ సంపాతి యాడి నట్టి । మాట ప్రామాణికము గాని మాయ గాదు
చేరి రఘువీరుఁ గొల్చిన వారి కెచటఁ । జేటు లేదింక నాకపని సేయవలయు.

ఉ. చూచుటలే దశోకవనిఁ జొచ్చి యటుం జని చూడఁ గాఁగ దా
యూ చపలాక్షి నజ్జనని యచ్చట నుండిన యేని లెస్స లే
దా చతురాననుం డపు మొదలైన సుపర్వులెఱుంగఁ జిచ్చులో
నై చెడఁ గాక యీ మొఱలు వానరవీరుల ప్రేమలవైతునే.

క. ఆవేళ నైన వచ్చి ద । యావతి జానకి ప్రసన్న యై కోఁచి ననుం
బావకశిఖలకుఁ గడగా । దీపించు గాకయని మదిన్ నిశ్చలుఁడై.

క. అనగరు వెడలి యొక కే । ళీనగ కూటాగ్ర మెక్కి లీలాగతి సం
ధానముగఁ జొకళించెన్ । వానరవీరుం డశోక వనిలోపలికిన్.

వ. అంత.

చ. కుముదవనంబు కోరిక చకోరిక పండుగ భోగిభాగధే
యము సనవిల్తు కాఁక కడియాలము చీఁకటి ముట్టుకొల్పు పు
న్నమ కొకవన్నె చేకఱి వానర్చినే యొప్పులకుప్ప యామినీ
రమణుఁ డుదోఁ చెనా య్యనఁ గరంబులు చాఁచి దిశాముఖంబులన్.

క. వెన్నెలలు గానె జక్కవ । కన్నులఁ జెన్నీరు వెడలఁ గా నెలరాఁ గ
న్నీరు వెడలఁ గా తెక్ । గన్నియకున్ జలకమాడఁ గలిగెననంగన్.

వ. అప్పు డయ్యనిల తనయుం డశోకవనిం గలయం గనుంగొను తలంపున.

చ. భుగభుగ తావు లుప్పతిలఁ బూచిన తీవలు చక్కనొత్తి క్రొం
బగడపుఁ బట్టుఁగడకుఁ బన్నినకన్నుఁ దళ్కుఁ గెంపు బా

బాగడవెలుంగులం బొలిచిపోవఁగఁ ద్రోవఁ గనంగఁ జేయఁగా
నిగనిగలీను కుందనపు నేలల వీథులు చొచ్చి చూచుచున్.

సీ. నలువంకశోభనంబులతోడ మిన్నందికొమరారు నీలంపు తమగమ్మైన
నాలుగువాకిళ్ల నలువంకవేడుకల్ సవరించుముత్యాల చవికలైనఁ
బొడవెన్నెలనంచ పచ్చతిజీరుకవారు బదనొందు నెలఱాల బావులైన
మాయావిరచితమై మణిమయంబై తోఁచు గోడకంబము లేని మేడలైనఁ
గలిగియె వెలుంగు శృంగాటకములఁ గాంచి । గారుడోపలములనొప్పు కప్పురంపు
టిసుకతిప్పలఁ బన్నీటి యేటిపాయ । నెసఁగు సౌభాగ్యములఁ జూచి యెగువఁ జనుచు.

వ. ఒక్క విమలప్రదేశంబున.

సీ. ఘూకకుటుంబినీ కోటిలో నడిరేయి జక్కవ జవరాలు చిక్కినట్లు
జరఠబిడాలికా జాలంబులోపలఁ జిలుకముత్తైదువ మెలఁగినట్లు
మత్తశిఖండినీ మాలికలోపలఁ బాఁపకన్నియ దగుల్పడినయట్లు
కితవమృగాదన గృహిణీగణంబులో లేడియిల్లాలు న్ముల్లించినట్లు
వేషభీషణదానవవితతిలోనఁ । దల్లడంబునఁ జెవులు దడపుచున్న
సాధ్వి రఘువీరగేహినిఁ జక్కఁ జూచి । యవునొ కాదొ కదా యని యనిలసుతుఁడు.

క. పలుకులవేలనం జేష్టిత । ములవలనన్ నిశ్చయంబుపట్ట సమీప
స్థలిఁ బొంచి తెలియఁదగునని । తలఁపుచు నొకచక్కి నున్నతఱి జానకియున్.

చ. వెతవెడలంగఁ బోసిరాన వేఁజొక నెచ్చెలిఁ గానమిన్ దిశా
సతులకు నంతయుం దెలియఁజాటుటకై గమకించునో సుమీ
యనివయనన్ గళంబునకు నానినయేడ్పునఁ గెంపుమోవి గం
పితముగ నాల్గువంకలును జగ్గిలిచూచుచునుండి వెండియున్.

గీ. వల్లభుండు రాక కెల్లస్పదము దన । యుల్లమెదురు చూచుచుండుకతన
గాలిఁ గసవు కట్టగదలినఁ గనువిచ్చి । దీనవీక్షణములఁ దేఱిచూచు.

వ. వెండియు.

చ. పొలుపునలంగి పువ్వులుడివోయిన తీవయుఁబోలియున్న మే
నలయ భరింపలేక తనప్రాణములన్ వెడలించురీతి నూ
ర్పులు వెలిదార్చుచుం బలలభుక్పరిశయావహ ధూమకేతువుం
బలె జడకట్టినట్టి కచభారము వెన్నునవ్రేల నందురున్.

గీ. వాలుఁగన్నుఁగవయు వలిచన్నుఁగవయు జే । కానియొండురూపు గానరాక
యుగురుఁబోఁడియుండె నీకఁ జిక్కినయవస్థ । చెప్పనేల విధిని దెప్పనేల.

వ. ఇత్తెఱంగున నుత్తలపడుచున్న సమయంబున.

చ. మొగములురాఁజఁగా ముడుత ముక్కుల గోరపుఁ గోఱలఁ బొగల్
దగులఁగఁ బల్లజుంజురుదలల్ గదలింపుచు నావులింతతో
సగముసగంబు హుంకృతిఁగఁ జూఁపుచు నొక్కొకమాటవెంట నా
లుగునయి దున్ వికారపు టెలుంగులు పుట్టఁగ నాఁడుదయ్యముల్.

చ. పలుకఁదొడంగి రప్పుడమిపట్టిఁ గనుంగొని నీకిదేటికిం
జలమునఁ జావ నీమగని సత్తువ యీపొలిమేరఁ జొచ్చి రాఁ
గలదని చూచితో ఖరుఁడుగాఁ దటుగూలఁబడంగ శంకరో
జ్జ్వల రజతాచలోత్థనన శాతశిఖోన్నఖరుండు మానినీ.

క. ఓ వెఱ్ఱిరాచమూఁతుర । యూవన్నెల మెకము ద్రిప్పి యటుమరవెసనున్
దావలచి కాదె యికర । క్షోవల్లభుమనసు చెఱిచికొని చెడనేలా.

క. అవివేకముడిగి దైత్య । ప్రవరుని యంతిపురమునకుఁ బదమనుచున్ దా
నవురాండ్రు పలుకుపలుకుల్ । చెవిఁదాఁకి చుఱుక్కుమనినఁ జిత్తంబొఱలన్.

క. అడలు నిలుపలేక ధూయమ్మ వాయెత్తి । దుఃఖపడఁదొడంగెఁ దోఁటలోన
యేడ్పు వెలుఁగు చెంత కెలయించికోయిల । కొదమ తలిరుఁబోఁడ్లఁ గూడఁబెట్టె.

ఉ. అప్పుడు నిశ్చయించి జనకాత్మజయౌనని వాయునందనుం
డిప్పుడుగా ఫలించెఁ బని యెల్లసనున్ ఫలపుష్పశీధువుల్
చిప్పిలఁ జెట్టుచెట్టునకుఁ జివ్వనఁ జివ్వన దాఁటు వాలముం
ద్రిప్పుచు నాడుఁ జేరెములు ద్రిమ్మరుఁ గొమ్మల ద్రేలుఁ గ్రమ్మఱన్.

చ. మనువంశప్రభుదేవిపాటు సహింపఁడాయనుం జూడఁ గ
ల్గిన సంతోసమె కాని యీగతి నిజక్రీడల్ ప్రచారింపుచో
దనుజాధీశుఁడు వేయిదీవియలతో ధర్మేతరప్రీతితో
వనితల్ వట్టిన పైఁడి పల్లకి పయిన్ వచ్చెన్ నిశీథంబునన్.

వ. అంత.

క. హనుమంతుం డితఁడేమని । వనితారత్నంబుతోడ వదరునొ నేనున్
వినియెదఁగాకని యొకమఱుఁ । గున నుండెన్ దనుజనాయకుఁడు నాలోనన్.

ఉ. వెల్లదహూనినాదములు వేత్రధరావిసరంబొసంగఁ గాఁ
బల్లకిడిగ్గి దివ్యమణిపాదుకలంఘ్రిల మెట్టి యప్సరః
పల్లవపాణులిర్వురిరుపార్శ్వములం దనయూఁతగా జగ
ద్వల్లభుదేవిముందల నిలువంబడి పల్కెఁ బ్రమత్తచిత్తుఁడై.

క. ఎలనవ్వులతో జంకెన । మొలకలతోఁ జూపుఁగోనలు మొనయఁగ నీవే
నెలఁతా నాపయిఁ బడకుము । బలుచూపులఁ దునుముఁ గాని ప్రతిబాణములై.

చ. వెడవిలుకాఁడు నన్ను మను వేమరు గేదఁగిరేకు వంకిణిన్
బొడువఁగ మేను పాయుపునఁ బొందక నిన్న భయప్రదానమే
నడిగెదనంచుఁ గాఁ గరినహై యిటు వెన్నెలవేఁడి వెన్కనన్
గొడుగులవేఁడ వచ్చితిఁ జకోరవిలోచన యేమి చెప్పుదున్.

గీ. చలము దనకుఁ జెల్లి జాబిల్లి యంచునం । బెట్టి మిగుల వాఁడి ప్రట్టు నూతి
నల్లగలువ తూపు నామైఁ బ్రయోగించి । చించె మరుఁడు ధైర్య కంచుకంబు.

క. ఎంతటి పౌరుషవంతులు । నింతులకుం బంతమీఁగి యెగ్గొనమతులం
జింతింపరగుట నోయలి । కుంతల నిన్నింత వేఁడుకొనఁగావలసెన్.

క. జడలు ధరియించి యడవుల । నిడుమలఁ బడి కాయగసరులే మెసవెదు పెన్
బెంగుగుని యఁగవయఁ దగునా । విడువిదు నీకేలపట్టె రెట్టింతాఁగీ.

ఉ. అక్కట యనోఁపసీవ తనియాదలకేలు ననంటి యాజడల్
చిక్కులు వాయ నువ్వి కయి చేసెద వే యటు సేయఁబోయినన్
మొక్కలువోవె నీ చిబుకము క్కులవంటి నఖాంకురంబులా
దిక్కున నేవినోదములఁ దేలెదనంచుఁ దలంచితే చెలీ

వ. అదియును గాక యతండు బ్రతుక నెవ్వరుపూఁటు పాటలగంధీ యాకర్ణింపుము.

క. చక్కెరవిలుకాఁ కొకఁ డే । నొక్కఁడఁ దద్వైరులను వియోగవ్యథచే
నక్కడ నపాలియఁ బొలియక । యిక్కడకని వచ్చె నేని యిక్కడఁ బొలియున్.

సీ. మగువ నీవిఁక రాముని మాటమఱవు । తీవ్రమివియేల నీకుఁ బతివ్రతంబు
వచ్చి మండోదరీచంద్రవదన చేతఁ । బనులు సేయించుకొన నీకు మనసు రాదె.


క. పదపద దశముఖు దేవీ । పదవికి నింద్రాది దివిజపాలకులిఁక నీ
ముదలన్నిజరాజ్యరమా । పదవుల మనఁదలఁచినారు పల్లవపాణీ.

పంచచామరము. బలారిదంతిదంతకుంత భంగకారి నాయుర
స్థలంబలంకరించవే యచంచలాంచలస్థితిన్
కులాచలోజ్జ్వలత్తటంబుగూర్చి కల్పవల్లియున్
బలెన్ జెలియటంచుఁ గించుఁ బల్కులాడఁ జొచ్చినన్.

క. సీతాపురంధ్రి తృణమొక । చేత బట్టుకొని పల్కె శిరమెత్తక శో
కాతిశయము డిపి రఘుపతిఁ । జేతోగతి నిలుపుకొని వశీకృత ధృతియై.

జ్యోతిశ్శాస్త్రసంగ్రహము. (౫౯౭-పుట శేషము.)


రెండుస్థానములనుండియు గుఱుతిడిన బిందువుతో నేర్పడెడు రేఖల నడిమికోణము సన్నదయినకొలఁదిని వస్తువుయొక్క దూర మధికమగుచుండును. ఈప్రకారముగా కోణమేర్పఱుచుకొని సూర్యునిదూరము కొలుచుట సాధ్యముకాదు. భూమియొక్క యొక కొననుండి సూర్యునిలోని యొక బిందువును గుఱుతిడుకొని తరువాత భూమి యొక్క రెండవకొనకుఁబోయి యాబిందువును గుఱుతిడి రేఖల నూహించినను దూరము యొక్క యాధిక్యమునుబట్టి కోణమేర్పడక రేఖలునడుమనే కలిసికొని పోవుచుండును. అందుచేత సూర్యుని దూరమును కనుఁగొనవలెనన్న పక్షమున, కోణమునుబట్టి కాక లంబమునుబట్టి మాత్రమే తెలిసికొనవలసియున్నది. వస్తువుల దూరమును తెలిసికొనుట కిది మఱియొకమార్గము. మనము దూరనిర్ణయము చేయఁ దలఁచుకొన్న వస్తువునకును మనకును నడుముగా మఱియొకవస్తువు నుంచుకొని, మనమున్నస్థానము నుండి యా నడిమివస్తువుమీఁదుగా సూటిగా చూచునప్పుడు చూడఁ దలఁచుకొన్న వస్తువుమీఁద మనదృష్టిపడు బిందువును గుఱుతిడుకొని, మరల మనము మఱియొకస్థానము నకుఁబోయి యక్కడనుండి యా నడిమివస్తువుమీఁదుగాఁ జూచి మన దృష్టిపడు బిందువును గుఱుతిడుకొని, ఆ రెండుబిందువులకును నడుమనుండు దూరమునుబట్టి గణిత శాస్త్రప్రకారముగా వస్తువుయొక్క దూరనిర్ణయము చేయవచ్చును. ఇట్లు గుఱుతిడఁబడిన రెండుబిందువులకును నడుమఁగల దూరమే లంబము. ఆ లంబ మెంతవెడల్పయిన వస్తువంతదూరముగానుండును. శుక్రక్రాంతియందు సూర్యునికిని మనకును నడుమ శుక్రబింబమువచ్చి, సూర్యునిలో లంబ మేర్పఱుచుకొనుటకుఁ దగినట్లుగా కొన్నిగంటల కాలమాస్థానమునందుండును. ఈ క్రిందిపటమువలన సూర్యునిలో లంబ మేర్పఱుచుకొను విధము తేటపడును—



ఇందు మొదటి (N. S) బింబము భూమి; నడిమి (V) బింబము శుక్రుఁడు; చివరనున్న పెద్దబింబము సూర్యుఁడు; సూర్యునిలో నడ్డముగానున్న రెండుచుక్కల గీతలును శుక్రుఁడు నడుచునట్లు కనఁబడు మార్గము. భూమిమీఁద నుత్తరపుకొన (N) నుండి శుక్రునిమీఁదుగాఁ జూచువారికి శుక్రుఁడు దక్షిణపు (N) చుక్కల గీతమార్గమున నడుచునట్లు కనఁబడును; దక్షిణపుకొన (S) నుండి శుక్రునిమీఁదుగాఁ జూచువారికి శుక్రుఁ డుత్తరపు (S) చుక్కల గీతమార్గమున నడుచునట్లు కనఁబడును. ఈ రెండు

మార్గములకు నడుమనుండు దూరమే లంబము. గణితశాస్త్రజ్ఞులయిన జ్యోతిశ్శాస్త్ర పండితులు భూమియొక్కయు శుక్రునియొక్కయు గతులు తెలిసినవారయి శుక్రక్రాంతి సమయమున గ్రహవేధయం దేర్పడిన సూర్యునిలోని లంబమును గణనచేసి తెలిసికొని సూర్యునికిని భూమికినిగల దూరమును నిర్ణయింతురు.

భూకక్ష్యయు శుక్రకక్ష్యయు సమక్షేత్రమునందుండక యొకదానికొకటి కొంచెము వంపుగానున్నందున, సంపాతసమయములయందెల్లను క్రాంతులు కలుగక తటుచుగా శుక్రబింబము సూర్యబింబమునకుఁ గొంచెము క్రిందుగానో మీఁదుగానో పోవుచుండును. కాఁబట్టి యెప్పుడో భూశుక్రసూర్యులు సమకళయందు వచ్చినప్పుడు తప్ప శుక్రక్రాంతులు కలుగవు ఎనిమిది సంవత్సరములలోపల రెండు శుక్రక్రాంతులు వచ్చినతరువాత మరల నవి నూటుసంవత్సరములలోపల రాకుండును. మొదటి రెండుక్రాంతులును మార్గశిరమాసములో వచ్చినపక్షమున, తరువాతవి రెండును జ్యేష్ఠ మాసములో వచ్చును. భూకక్ష్యయొక్కయు శుక్రకక్ష్యయొక్కయు క్రమమును జూపెడి యీ క్రిందిపటమునుబట్టి శుక్రక్రాంతులు జ్యేష్ఠ మార్గశిరమాసములలోఁ దక్క నితరసమయములయం దేలరావో తెలిసికోవచ్చును—



ఈ పటమునందు లోపల నల్లగానున్న వలయము భూకక్ష్య; లోపల తెల్లగానున్న వలయము శుక్రకక్ష్య; ఉభయకక్ష్యల లోపలను మధ్యగానున్న బింబము (S) సూర్యుఁడు. భూమియు శుక్రుఁడును సూర్యునిచుట్టును తమ కక్ష్యలలో బాణముఖములు చూపు వైపునకనఁగా యెడమనుండి కుడికిఁ దిరుగుచుండును. భూకక్ష్యలో భూమియున్నట్టు చూపఁబడిన నాలుగుస్థానములలోను పయివైపుననున్న స్థానమున జ్యేష్ఠమాసము లోను, ఎడమవైపుననున్న స్థానమున భాద్రపదమాసములోను, క్రిందివైపుననున్న స్థానమున మార్గశిరమాసములోను, కుడివైపుననున్న స్థానమున ఫాల్గుణమాసములోను,


భూమియుండును. భూమి జ్యేష్ఠ మార్గశిర మాసములలో నున్నట్లు చూపబడిన స్థానములనుండి సూర్యునిమీఁదుగా క్రిందినుండి మీఁదికి గీయఁబడిన చుక్కల రేఖలో మాత్రమే భూశుక్రకక్ష్యలు సంపాతమగును. మార్గశిర మాసములోఁ గాని జ్యేష్ఠ మాసములోఁ గాని సంభవించెడు సంపాత సమయమునందు శుక్రుఁడు భూసూర్యులతో సమకళయందుండుట సంభవించెనా, అప్పుడుమాత్రమే శుక్రక్రాంతి కలుగును. ఈపటమున మార్గశిరమాసమున భూమి కెదురుగా సూర్యశుక్రసంగమము కలిగినట్లు చూపఁబడియున్నది. భూమి ౩౬౫ దినముల ౬ గంటలలోను, శుక్రుఁడు ౨౨౪ దినముల ౧౬ గంటలలోను, ఒక యావృత్తి తిరుగుచుండుటచేత భూమి యెనిమిదావృత్తులు తిరుగునప్పటికి శుక్రుఁడు పదుమూడావృత్తులు తిరుగును. భూసూర్యశుక్రు లొక్కసారి సమకళయందుండుట సంభవించినపక్షమున, భూమి యెనిమిదావృత్తులును శుక్రుఁడు పదుమూడావృత్తులును తిరిగినతరువాతఁగాని యవి మరల సమకళలోనికిరావు. ఒక గ్రహ మొక్క యావృత్తి తన కక్ష్యలో తిరుగుట యనఁగా నొక్కసంవత్సరమగుటచేత, ఒకసారి శుక్రక్రాంతి గలిగినతరువాత నెనిమిది సంవత్సరములకుఁగాని మరల శుక్రక్రాంతి గలుగదు. ఈప్రకారముగా నెనిమిది సంవత్సరములలో రెండు శుక్రక్రాంతులు కలిగినమీఁదట పండ్రెండుసారులు శుక్రబింబము సూర్యునితో సమకళయందురాక క్రిందినుండిగాని మీఁదినుండిగాని పోవుచు పదుమూడవసారి మరల వచ్చును. పదుమూడుసారులనఁగా పదుమూడెనుమదులు నూటనాలుగు సంవత్సరములని యర్థము. ఎనిమిది సంవత్సరములలో రెండుశుక్రక్రాంతులు వచ్చినతరువాత నూటనాలుగుసంవత్సరములదాఁక రాక యప్పు డెనిమిదిసంవత్సరములలో మరల రెండు వచ్చుటయు, శుక్రక్రాంతులు జ్యేష్ఠ మార్గశిరమాసములలోనేకాని యితర మాసములలో రాకుండుటయు, రెండుసారులు జ్యేష్ఠమాసములో వచ్చినపక్షమున మరల రెండుసారులు మార్గశిరమాసములో వచ్చుటయు, ఈ హేతువుచేతనే. ఈ శుక్రక్రాంతులు కడపటిసారి ౧౮౭౪ వ సంవత్సరము డిసెంబరు ౮ వ తేదిని, ౧౮౮౨ వ సంవత్సరము డిసెంబరు ౬ వ తేదిని, కలిగినవి

శుక్రుని గతివేగము భూమికంటె సెకనుకు (విలిప్తకు) మూడుమైళ్లధికము. శుక్రుని గతి గంటకు ౮౦౦౦౦ ల మైళ్లు; భూమిగతి గంటకు ౬౭౦౦౦ ల మైళ్లు. మనభూమికి చంద్రుఁడున్నట్లుగా శుక్రుని కుపగ్రహమేదియు లేదు. శుక్రబింబము మన భూమిలో నూఱుభాగములలో నెనుబదియెనిమిదిభాగములుండును. శుక్రుని వ్యాసము ౭౮౧౪ మైళ్లు; దినప్రమాణము ౨౩ గంటల ౧౬ నిమిషములు. శుక్రునికి సూర్యుని నుండి గల దూరము ౬౭౦౦౦౦౦౦ ల మైళ్లు; సమీపమునకు వచ్చినప్పుడు భూమి

నుండి ౨౫౦౦౦౦౦౦౦ ల మైళ్లును, దూరమైనపుడు బోయినప్పుడు ౧౫౭౦౦౦౦౦౦ మైళ్లును, దూరముండును. ఈశుక్రుఁడు భృగుమహర్షికొడుకనియు, రాక్షసులకు గురువనియు, మన పౌరాణికులు వింతలైన కథలను గల్పించియున్నారు.

౩. భూమి.

బుధశుక్రగ్రహములకు తరువాతనున్నది భూమి. బుధశుక్రగ్రహకక్ష్యలు మాత్రము భూకక్ష్యకులోపలను, తక్కిన గ్రహకక్ష్యలన్నియు భూకక్ష్యకు వెలుపలను, ఉండుట చేత బుధశుక్రులు తక్క తక్కిన గ్రహములన్నియు సూర్యునికి భూమికంటె దూరములోనున్నవి. బుధశుక్రులకువలెఁ గాక మన భూమికి చంద్రుఁడనెడి యుపగ్రహమొకటికూడఁ గలదు. ఈ చంద్రునిగూర్చియు, భూమియొక్క స్వరూప స్వభావాదులనుగూర్చియు, వెనుకటిప్రకరణములలోనే వివరింపఁబడియున్నది.




భూమి.

ఇప్పుడు భూమియొక్క గతివిశేషములనుగూర్చి మాత్రము కొంచెము చెప్పవలసియున్నది. భూమి బొంగరమువలె గిఱ్ఱునఁ దిరుగుచు నంతరాళమున బాణవేగమునఁ బరుగెత్తుచున్నదనియు మన మిదివఱకే తెలిసికొనియున్నాము. ఈ తెలిసికొన్నదానిని బట్టి భూమికి రెండువిధములయిన గతులున్నవని స్పష్టమగుచున్నది. అందొకటి తన యక్షముమీఁద చక్రమువలె భూమి యాత్మప్రదక్షిణములు చేయుట; రెండవది తనకక్ష్యలో సూర్యునిచుట్టును ప్రదక్షిణములుచేయుట. మొదటఁ జెప్పినట్లు భూమి గుండ్రముగా గిఱ్ఱునఁ దిరుగుచుండుటచేత మాఱిమాఱి భూమియొక్క ప్రతిభాగమునకును పర్యాయమున సూర్యకాంతి కలుగుచుండును. సూర్యకాంతి కలుగుకాలము పగలనియు కలుగని

కాలము రాత్రియనియు చెప్పఁబడును. ఒకపగలును రాత్రియుఁ గలిసిన కాలము దినమనఁబడును. ఒక్కసారి భూమి యాత్మప్రదక్షిణము ముగించునప్పటికి పగలును రాత్రియుఁ గల దినము పూర్తియగుచుండుటనుబట్టి దినదినమును గలిగెడి యీగతికి దైనందినగతి యని పేరు. భూమి తనకక్ష్యయందొక్కసారి సూర్యునిచుట్టును దిరిగి యొక్కప్రదక్షిణము పూర్తిచేయుటకు మున్నూటయఱువదియైదు దినముల యాఱుగంటలకాలము పట్టును. ఈకాలము సంవత్సరమనఁబడును. సంవత్సరములు కలుగుటకుఁ గారణమయిన యీ గతికి సాంవత్సరిక గతియని పేరు. ఈ సాంవత్సరిక గతివలననే భూమిమీఁద ఋతుభేదములు కలుగుచున్నవి.


ఒక కొండచుట్టును వలయాకారముగా నొకమార్గ మేర్పఱిచి యామార్గమున కొండకు ప్రదక్షిణముగా నొకబండిని నడిపించిచూచిన పక్షమున, ఇప్పుడు చెప్పిన రెండుగతులును దెలియవచ్చును. కొండనుచుట్టి బండి యొక్కసారి నడుచునప్పటికి బండిచక్ర మెన్నోసారులు తన యిరుసుమీఁద గుండ్రముగా తిరుగునుగదా? భూమి యొక్క దైనందినగతి సరిగా నిరుసుమీఁద చక్రము తిరుగుచుండుట వంటిది; సాంవత్సరికగతి చక్ర మిరుసుమీఁద తిరుగుచు కొండనుచుట్టుటవంటిది. భూమి తన కక్ష్యలో ముందుకు జరగినకొలఁదిని సూర్యుఁడాకాశమున నొకస్థానమునుండి యొక స్థానమునకు జరగుచున్నట్లు కనఁబడుచుండును. ఆకాశమున స్థిరముగానుండు నక్షత్రములనుబట్టి యాయాస్థానభేదములను దెలిసికోవచ్చును. భూమి తిరుగుచుండుట చేత భూమిలోనుండు మన దృష్టికి భూమి కెదుటివైపున సూర్యుఁడు తిరుగుచున్నట్టు కనఁబడెడి యాకాశమును నక్షత్రముల గుఱుతులనుబట్టి మన పూర్వులు పండ్రెండు భాగములనుగా భాగించి వానికి రాసులని పేరుపెట్టియున్నారు. పగలు సూర్యుఁడు ప్రకాశించునప్పుడు నక్షత్రము లేవియు మన కగపడకపోయినను సూర్యోదయమునకు ముందును సూర్యాస్తమానమునకుఁ దరువాతను కనఁబడుచుండుటచేతను, అట్లు కనఁబడెడు నక్షత్రముల గుంపులలో మొదట నొకదాని సమీపమునను దరువాత నింకొకదాని సమీపమునను బిమ్మట వేఱొకదాని సమీపమునను గొంతకొంతకాలము కనఁబడుచు సూర్యుఁడు క్రమక్రమముగా నిట్లు పండ్రెండురాసులను గడచి సంవత్సరకాలములో మొదట బైలుదేఱిన రాశి సమీపముననే మరలఁ గనఁబడుచుండుటచేతను, సూర్యుఁడాయా రాసులలోనున్నట్టు మనము నిశ్చయముగాఁ జెప్పఁగలము. ఈ పండ్రెండు రాసులకును వరుసగా మేషము (మేఁక), వృషభము (ఎద్దు), మిథునము (దంపతులు), కర్కటము (ఎండ్రి), సింహము (సింగము), కన్య (పడుచు), తుల (త్రాసు), వృశ్చికము (తేలు), ధనుస్సు (విల్లు), మకరము (మొసలి), కుంభము (కడవ), మీనము (చేఁప),

అని నామములు. సూర్యుఁ డేయే రాశిలోనుండు కాలమేయే సౌరమాసమయి యారాశి నామమును పొందును. ఎట్లనఁగా. సూర్యుఁడు మేషములో నుండు కాలము మేషమాసమనియు, సింహములోనుండు కాలము సింహమాసమనియు, ధనుస్సులోనుండు కాలము ధనుర్మాసమనియు, చెప్పఁబడును. ఆకాశమున భూమి చుట్టును సూర్యుఁడు తిరుగునట్లు కనఁబడెడి యీ మార్గమునకు క్రాంతిమండలమని పేరు. రాసులనఁబడెడు పండ్రెండు భాగములుగా భాగింపఁబడి భూమిచుట్టును గల యాకాశ చక్ర మీ క్రిందిపటమునఁ జూపఁబడినది—



ఇందు మధ్యనున్నది భూమి; మేషములు మొదలయిన విగ్రహములతో భూమిచుట్టును వేఱువేఱుగా విభజింపఁబడిన యాకాశభాగములు పండ్రెండును రాసులు. చంద్రుఁడు నెలదినములలో భూమిచుట్టును తిరిగివచ్చుననియు, ఆకాలము చాంద్రమాసమనియు, చంద్రునిగూర్చి వ్రాయఁబడినప్పుడు చెప్పఁబడినది. ఆ నెలదినములలోనే చంద్రుఁడు క్రాంతిమండలమనఁబడెడి యాకాశచక్రమునంతను తిరిగిరావలెను. చంద్రునియొక్క గతినిబట్టి మనవారాకాశమును నిరువదియేడుభాగములుగా భాగించి, వానికి నక్షత్రములని పేరుపెట్టియున్నారు. మనవారిచే నక్షత్రము లనఁబడెడు నవి యాకాశములో నిరువది యేడవ యంశములే కాని నిజమయిన చుక్కలు కావు. మనవారు ప్రతి నక్షత్రమును మరల పాదములనఁబడెడు నాలుగేసి యంతర్భాగములుగా భాగించియున్నారు. ఈ యేర్పాటునుబట్టి యాకాశమంతయు నూటయెనిమిది విభాగములుగా భాగింపఁబడినది. నక్షత్రములనఁబడెడి యాకాశభాగము లిరువదియేడును వరుసగా, అశ్విని, భరణి, కృత్తిక, రోహిణి, మృగశిరము, ఆర్ద్ర, పునర్వసు, పుష్యము, ఆశ్రేష, మఖ, పుబ్బ, ఉత్తర, హస్త, చిత్ర, స్వాతి, విశాఖ, అనూరాధ, జ్యేష్ఠ, మూలము, పూర్వాషాఢ,

ఉత్తరాషాఢ, శ్రవణము, ధనిష్ఠ, శతభిషము, పూర్వభాద్ర, ఉత్తరభాద్ర, రేవతి, అనఁబడును. పండ్రెండు రాసులుగా విభజింపబడిన యాకాశమే నక్షత్రములనఁబడెడి యిరువదియేడు ఉపభాగములుగాను నక్షత్రమునకు నాలుగేసిపాదములుచొప్పున పాదములనఁబడెడి నూటయెనిమిది [illegible]ములుగాను భాగింపఁబడినందున, ఒక్కొక్కరాశికి రెండునక్షత్రములు నొకపాదమునఁగా తొమ్మిదేసిపాదములచొప్పున లెక్కయగును. ఎట్లనఁగా మేషమునకు నశ్వినియు భరణియు కృత్తికలోని మొదటి పాదమును, వృషభమునకు కృత్తికలోని మిగిలిన మూఁడుపాదములును రోహిణియు మృగశిరములోని మొదటి రెండుపాదములును, మిథునమునకు మృగశిరములోని కడపటి రెండుపాదములును ఆర్ద్రయు పునర్వసులోని మొదటిమూఁడుపాదములును, కర్కటకమునకు పునర్వసులోని కడపటిపాదమును పుష్యమును ఆశ్రేషమును, ఈప్రకారముగా కడవఱకు నగును. ఆయాభాగములయందలి నక్షత్రసముదాయముయొక్క యాకారమునుబట్టి నక్షత్రములు అశ్విన్యాదినామములు కలిగినవి. గుఱ్ఱపుమూతివలెఁ దోఁచెడి మూఁడుచుక్కలనుబట్టి యశ్వినియనియు, త్రికోణమువలెఁ దోఁచెడి మూఁడుచుక్కలను బట్టి భరణియనియు, మంగలికత్తివలెఁ దోఁచెడి యాఱుచుక్కలనుబట్టి కృత్తికయనియు, ఈవిధముగా నన్నిటి కరణములు చేయఁబడినవి. మనదృష్టికిఁ గనఁబడునట్లు నక్షత్రాదులన్నియు ఖ సమదూరములో లేకపోయినను, నక్షత్రాదుల గుఱుతుచే విభజింపఁబడిన యాకాశభాగమునకు సమసూత్రముగానుండు దూరసమీపప్రదేశములన్నియు నాయానక్షత్రములనఁబడి, తత్కాలమున నీగ్రహ మీనక్షత్రమున నున్నదని చెప్పఁబడును. చంద్రుఁ డెప్పుడేనక్షత్రమునకువచ్చునో యాదినమున నానక్షత్రమనఁబడును.



సూర్యునిచుట్టును భూమి తిరిగెడు భూకక్ష్య తక్కిన గ్రహకక్ష్యలవలెనే దీర్ఘవృత్తముగా నుండునని యిదివఱకే యెఱిఁగియున్నాము. పయిపటములో మధ్య తెల్లగా నున్నది సూర్యబింబము; దానిచుట్టుచు దీర్ఘవృత్తముగానున్న నల్లనిరేఖ భూకక్ష్య; ఆకక్ష్యమీఁదనుండు నాలుగుగోళములలో (A) జ్యేష్ఠమాసములోను, (B) ఫాల్గునమాసములోను, (C) మార్గశిరమాసములోను, (D) భాద్రపదమాసములోను, ఉండు స్థానములు. తనకక్ష్యలో భూమి పుష్యమాసములో మకరసంక్రాంతి మొదలుకొని యుత్తరమునుండి దక్షిణమునకును, ఆషాఢమాసములో కర్కటక సంక్రాంతి మొదలుకొని దక్షిణమునుండి యుత్తరమునకును, నడువనారంభించును. వీనిలో మొదటి యాఱుమాసములలోను మనదృష్టికి సూర్యుఁ డుత్తరపువైపునకుఁ బోవుచున్నట్టు కనఁబడుచుండుటచేత నాకాలము నుత్తరాయణమనియు, తరువాతి యాఱుమాసముల లోను సూర్యుఁడు దక్షిణపువైపునకుఁ బోవుచున్నట్టు కనఁబడుచుండుటచేత నాకాలమును దక్షిణాయనమనియు, మనవారు వాడుచున్నారు. సూర్యునిచుట్టును తిరుగుచున్నప్పుడు భూమి తనకక్ష్యలోనేభాగమునందున్నను దాని ధ్రువములుమాత్రము కొంచెము వంపుగా సమానాంతరములుగల సరళరేఖలలోనే సదా యుండుచుండుట వలన నొక ధ్రువసమీపమున కొన్నిమాసములు సదా ప్రకాశము కానవచ్చుచుండుట మఱి కొన్నిమాసములు సదా సూర్యప్రకాశ ములుగకుండుటయు సంభవించుచున్నది. ఆప్రకారముగానే యొక ధ్రువము సూర్యునివైపునకుండి కాంతిని పొందుచున్నకాలములో రెండవధ్రువము సూర్యునికి మఱుఁగయియుండి కాంతిని పొందకుండును. అట్టి సమయములయందు ధ్రువసమీపముల సూర్యోదయాస్తమానములు లేక సూర్యుఁడు వలయాకారముగా ప్రదక్షిణములు చేయుచున్నట్లు కనఁబడుచు నంతకంతకు క్రిందికివచ్చి దిఙ్మండలమునందు క్రమముగా ముప్పాతిక, సగము, పాతిక రూపములతో చుట్టును దిరుగుచు కట్టకడపట నదృశ్యుఁడై కొన్నిమాసములవఱకును మరలఁ గానరాకుండును. ధ్రువసమీపమునందు సూర్యకిరణములు ప్రక్కలనుండి పడుటయే కాని సరిగా పయినుండి నెత్తిమీఁది కెప్పుడును పడవుగనుక, నక్కడ వేఁడిమి యంతగానుండక యతిశీతలమయి యుండును. ధ్రువములనంటి తన యక్ష మెప్పుడును సమానాంతర సరళరేఖలయందుండునట్లుగానే భూమి తనకక్ష్యలో సూర్యునిచుట్టును తిరుగుచుండుటనుబట్టియే సూర్యకిరణము లెల్లప్పుడును భూమిమీఁద నేకరీతిగాఁ బడక యహోరాత్ర పరిమాణభేదములును ఋతుభేదములును గలుగుచున్నవి. సంవత్సరమునకు రెండుదినములయందుఁ దక్క మిగిలిన దినములలో సూర్యకిరణములు సరిగా భూమధ్యరేఖమీఁద సమరేఖగా పడవు.

588 (సశేషము) కం. వీరేశలింగము.

రామచంద్రవిజయము, (౫౭౮-పుట శేషము)

బ్రాహ్మ—అయ్యా! మేము వైదికులము. నేను మిక్కిలి బీదవాఁడను. నాభార్య యీవేళకు తొమ్మిది దినములక్రిందట ప్రసవమై, మగపిల్లవాఁడు కలిగినాఁడు. లేక లేక కలిగిన యీ మగపిల్లవాఁ డీదినమున సంధుకొట్టి చనిపోయినాఁడు. నా భార్యకు ప్రాణముమీఁదికి వచ్చినది చచ్చినపిల్లవానిని తీసికొనిపోవుటకైనను, మాజాతివారును, మా బంధువులును, రాలేరు. కడుపు దుఃఖముతో నేనే యీ పసికూనను పాతిపెట్ట వలసివచ్చెను. (అని యేడ్చుచుండెను)

రామ— అయ్యా! దుఃఖపడకండి తమరు పెద్దలు. అన్నియు దెలిసినవారు. నావలెనే మీరును దురదృష్టవంతులు.

బ్రాహ్మ — నాయనా! నీకేమికష్టములు కలిగినవి. ఇక్కడ కెందుకువచ్చినావు.

అని బ్రాహ్మణుఁ డడుగగా రామచంద్రుఁడు తన వృత్తాంతమంతయుఁ జెప్పి తనమీఁదికివచ్చిన యీ యపనిందయు, శరభరాజుగారు తన్ను లేవగొట్టుటయు, శోభనాచలాదుల వైరమును, తెలియఁజేయ బ్రాహ్మణుఁ డాశ్చర్యపడి, యితనికొరకు విచారింప నారంభించెను. తరువాత వారిట్లు మాటాడిరి.

బ్రాహ్మ— పూర్వజన్మకృతమెవరు తప్పించగలరు? నీవు మాయింటికివచ్చి రేపు మాయింటనుండి వెళ్లు [illegible]పొడిగుడ్డలనిచ్చి యీపూటకొంచెము చలిమంటవేస్తాను, రా.

రామ— అయ[illegible] నాకొఱకు నాశత్రువులు వచ్చుచుందురు ముందు మీరు నడవండి వెనుక నేను వస్తున్నాను. ఎవరయిన వచ్చి నాజాడ లడిగినపక్షమున వెనుక నున్నానని చెప్పవద్దు. నాకేదో సంజ్ఞ చేయండి. రామానుజాచార్యులు అని నన్ను పిలిచిన నేను పారిపోగలను.

బ్రాహ్మ— నాప్రాణము నీప్రాణమున కడ్డము వేసి రక్షించెదను.

ఇట్లిద్దరునుపోవుచు గోదావరి గట్టుమీఁది కెక్కునప్పటికి జాముప్రొద్దుమాత్రమే యున్నది. అప్పుడు తాటియాకుగొడుగు వేసికొని యొక పురుషుఁడు పెండిమురుగులుపెట్టుకొనియున్న చాకలివానిని వెంటఁబెట్టుకొనివచ్చుచు తనయెదుట వచ్చుచున్న బ్రాహ్మణునిజూడక చీఁకటిచేత నా ముసలిబ్రాహ్మణున కెదురుగా బోయినందున గొడుగుకామ గ్రుచ్చుకొనెను. బ్రాహ్మణుఁడును దెబ్బతగిలినందున అబ్బా యెవరురా నీవు? చంపివేసినావు. కన్నులు కనఁబడవా?" అని యరచెను. రామచంద్రుఁ డదివిని యెవరో వచ్చినారని దిగఁబడి దాఁకయ్యెను.

పురు— అయ్యా? చూడలేదు. క్షమించవలెను.

బ్రాహ్మ— నీదేవూరు? నీవెవరవు?

పురు— మాదమలాపురము. మీ కిరువదేండ్ల కుర్రవాఁ డగుపడినాడా?

బ్రాహ్మ— నేనెఱుఁగను. మీపిల్లవాఁడెవరో నీవెవరో నాకు తెలియదు. చేతిలో నాకఱ్ఱలు! మీరెవరికొంప త్రవ్వుటకు వచ్చినారు? బుఱ్ఱలు పగలగొట్టుటకువచ్చినారా? దిక్కుమాలిన్నాళ్ళల్లారా?

పురు— అయ్యా తిట్టకండి. మేమెవరినికొట్టుటకు రాలేదు. వేరేపనియుండి వచ్చినాము. మీరాపిల్లగాని జూచినపక్షమును జెప్పండి.

బ్రాహ్మ— నేను జెప్పను. ఇప్పుడు మాగ్రామమునందు మా తల్లిదగ్గిరనున్న వాళ్ళను కేకవేసి మీకు తగినట్టు బుద్ధిచెప్పిస్తాను.

చాక—(కోపముతో) నోరుమూయి బాపనయ్యా. తెగనీలుగుతావేమి.

పురు— ఓరీ. ఆయనజోలికిపోకురా. మనకు కావలసిన మనుష్యుఁడు దొరక లేదు. మధ్యనా ముసలిబ్రాహ్మణునిజోలికి వెళ్ళడమెందుకు.

బ్రాహ్మ— అయ్యో దుర్మార్గుఁడా. నీకు కావలసినవాఁడు దొరకలేదా? దొరికితే చంపివేస్తావా? నీకింత షాయ్యకాలమేమిరా? అని మాటాడుచున్న బ్రాహ్మణునిదాటి యా క్రొత్తపురుషు లిద్దఱును ముందుకుఁ బోవుచుండఁగాఁ జూచి బ్రాహ్మణుఁడు "అలాగు వెళ్ళడమెందుకు? అక్కడ వాఁడు లేడు. ఆలా వెళ్ళవద్దు వద్దంటే మానవేమయ్యా?" అని చెప్పెను. అతని మాటంకముజూ మాపురుషులు రామచంద్రుఁ డక్కడున్నాఁడని నిశ్చయించి యటుపోవుచుండఁ రామచంద్రుఁడు వారి బారిబడకుండ గబగబ పరుగెత్తసాగెను. ఈ పురుషునివెంట తరుముచు నెట్లయిన వానిని రామచంద్రునిగా నిశ్చయించి పట్టదలచిరి. కొంతదూరము పరుగెత్తి ఆ క్రొత్త వారిలో నొకఁడు "రామచంద్రుఁడూ నేను రాజగోపాలమును, పరుగెత్తకు. నిలిచిలాగునరా. భయములేదు. అని ఆపురుషుఁడు చెప్పఁగా రామచంద్రుఁడు ధైర్యము తెచ్చుకొని తనశత్రువులు రాజగోపాలముయొక్క పేరుపెట్టుకొనినా రనుకొని రాక మరల నాతని కేకనువినిదగ్గరకువచ్చి రాజగోపాలమునుచూచి సంతోషించిఇట్లుపలికెను.

రామ— రాజగోపాలము. నీవెందుకు యీరాత్రివేళ వచ్చినావు. నాకు సహాయముచేసినందులకు మీ బాబయ్యగారు నిన్నుకూడా లేవకొట్టినారా ఏమి?

రాజ— లేదు. చాకలివాని చేతమూట మీకు బంపినపుడు నీకు లెక్కనేమయిన పంపడము మరచిపోయినాను. పెట్టెలోనుంచి నాలుగురూపాయీలు తీసి యివతల పెట్టి చాకలివానిచేత నిచ్చుట మరచినాను. ఇదిగో నాలుగురూపాయీలు పుచ్చుకో. నీవు సురక్షితముగా వచ్చినావా?

రామ— ఏమిసురక్షితము? చావుతప్పి కన్నులొట్టపోయినట్టున్నది. నేను నీ యుత్తరమును చూడగానే కొంతసేపు చెరువుగట్టుమీఁద నాగి కపటియయిన యా

సహాధ్యాయునిజోలికి పోక మఱి నాలుగుజాములకు బయలుదేరినాను. అప్పటికి శోభనాచలము నుండుగానే బయలుదేరి త్రోవలో—

రాజ— మాటకడ్డమువచ్చి, ఆసోదిచెప్పక నాకు ప్రొద్దుపోతుంది. మాయింట నందఱు నిద్రబోవుట గనిపెట్టి నేనిప్పుడు బయలుదేరినాను. నావరుపుమీఁద నేను పరున్నట్టుగానె యొకదిండుబెట్టి మీఁద బట్టకప్పి ఇంటి దొడ్డితలుపు తీసియుంచి వచ్చినాను. మా బాబయ్య లేవకమునుపే నే వెళ్లవలెను.

రామ— అయ్యో! నాకొఱకు నీవిట్లు, శ్రమపడవలసివచ్చినదిగదా?

అని రామచంద్రుఁడు పోకముందే రాజగోపాలమును చాకలివాఁడును బయలుదేరిరి. రామచంద్రుఁడు రాజగోపాలముయొక్క సద్గుణముల స్తోత్రముజేసి బ్రాహ్మణునితో చెప్పుచు బ్రాహ్మణునియింటికిఁబోయి పాడిబట్టఁ కట్టుకొని సుఖముగా నిద్రఁబోయెను. మఱునాఁడు రామచంద్రుఁ డుదయమున గోదావరిలో స్నానముఁజేసి ముక్తేశ్వరస్వామి వారిదర్శనమునుఁజేసి, యాదినమాబ్రాహ్మణునియింటఁ వండుకొని భోజనముఁజేసి, కోటిపల్లిపోవుటకు సిద్ధముగానుండగా, బ్రాహ్మణునిభార్యకు బాలింత రోగమువచ్చి మరణమునకు సిద్ధముగానుండెను. వరహానిచ్చినను గాని వైద్యుఁ డామె కొక్కమాత్రయైన [illegible]ండుటఁజూచి, నవనీతమువంటి హృదయముగల రామచంద్రుఁడు కనికరించి [illegible] రాజగోపాలమిచ్చిన నాలుగురూపాయలును వైద్యునకిచ్చి యాబ్రాహ్మణునిభార్యకు మందువేయించెను. రామచంద్రునిచేతి ధనము వదలగానే బ్రాహ్మణునిభార్యకు రోగముకూడ వదలెను. బ్రాహ్మణుఁడు రామచంద్రుని సహాయమున తన ప్రియాపదయను, నదిని, దాటెనుగాని, రామచంద్రుఁడు గోదావరినది దాటుట కెట్టియేగానియైన లేదు. ధనములేక యోచించుచున్న రామచంద్రున కొక మంచి యాలోచనదోచెను. పూర్వ మొకనాఁడు తాను రాజవోలు వెళ్లుచుండఁగా పడవ మునిగిపోయినపుడు ముక్తేశ్వర బ్రాహ్మణుని తాను రక్షించెను. అతననేక బహుమానములు తనకప్పుడిత్తుననియును, ముక్తేశ్వర మొక్క పర్యాయము రమ్మని తన్ను బ్రతిమాలినసంగతియు, రామచంద్రునకు జ్ఞాపకమువచ్చి యాబ్రాహ్మణునిపేరు లింగరాజని తెలిసికొని, యట్టి స్నేహితుఁడుండఁగాఁ దనకిఁక భయమక్కఱలేదనుకొని లింగరాజు దగ్గఱకు బోయెను. లింగరాజు రామచంద్రునిజూచి యప్పటికి రమారమి యేనిమిది మాసము లైనందున, వెంటనే యతని యానవాలు పట్టజాలక గాఁబోలును, లింగరాజతనిని బలుకరింపడయ్యెను. అవసరము రామచంద్రునిదేగనుక తుదకతఁడు మౌనము విడిచి మాట్లాడెను.

రామ— లింగరాజుగారు! నన్నెక్కడనైన జూచినట్లు జ్ఞాపకమున్నదా?

లింగ— మొగముఁ జూచినట్లు జ్ఞాపకమున్నదిగాని యెవరో చెప్పజాలను. మీ దేయూరు?

రామ— మాదమలాపురం కాపురము. నాఁడు పడవ మునిగిపోయినపుడు—

లింగ—(మాటకడ్డమువచ్చి) ఓహోహో! నీవుటయ్యా? నాఁడు పడవ మునిగిపోయినపుడు నీవుకూడ పడవలోనున్నావుకావు? నాకాసంగతిజ్ఞాపకమా అది యేమాత్రపు గొప్పసంగతి? నూరువ్యవహారములలో మాకది జ్ఞాపకము రాదు. అయితే నీవిప్పుడీగ్రామమెందుకొచ్చినావు?

రామ— నిన్న నొకబ్రాహ్మణుని యింట వంటఁజేసికొని భోజనముఁజేసినాను. తమ దర్శనముఁ జేయవలెనని వచ్చినాను. తమరొకసహాయముఁ జేయవలయును.

లింగ— ఏమిపనిమీఁదవచ్చినావు? అదియేదో చెప్పు నాసాధ్యమైనపక్షమునఁ జూస్తాను.

రామ—నేనుకార్యాంతరమున కోటిపల్లి వెళ్లుచున్నాను. నాకు తమరునాలుగు రూపాయిల బదులిప్పించవలయును. నాలుగుమాసములలో తిరిగి యిచ్చివేయగలను.

లింగ—అయ్యో! ఇప్పుడే మీరు రాకముందు నూఱురూపాయిలుండఁగా నొక పెద్దమనుష్యునకిచ్చినాను. ఒకఘడియ క్రిందవచ్చినపక్షమును ఏసి నన్ని రూపాయిల నిత్తును. నాలుగుకాకపోతే మఱి నాల్గు పుచ్చుకొనవచ్చును. మీరెక్కడకుపోతారు? నేనెక్కడికిపోతాను? అయ్యయ్యో! రాకరాక మీరువచ్చి యడగడను నాదగ్గఱ సమయమునకు లేకపోవడను సిగ్గుగనున్నది.

రామ— సరిసరి. తమరికి సిగ్గెందుకు. అది నాయదృష్టము. మీరేమిచేయగలరు? పోనీ. రేపేమైన సద్దినమంటే యీగ్రామములో యుంటాను.

లింగ— ఉండు. ఏమైన లెక్కదొరకినపక్షమునఁ జూచి యిస్తాను.

ఈప్రకారముగా లింగరాజుదగ్గఱ నాలుగువేలరూపాయిలున్నను తనకు మహోపకారముఁజేసిన రామచంద్రునకు నాలుగురూపాయిల బదులిచ్చుటకుగూడ నతనిమనసు సమ్మతింపదయ్యెను. ధనమీయకున్నను మర్యాదార్థము రామచంద్రుని భోజనమున కుండమనియైన చెప్పఁడయ్యెను. ఆమరునాఁడు శరభరాజుగారి యింటినుండి రామచంద్రుఁడు వచ్చుటకు కారణమేమని లింగరాజడుగగా, రామచంద్రుఁడు సత్యకాలపుమనిషి గనుక యున్నదున్నట్టు మాయమర్మములు లేకుండా జెప్పెను. మూఁడవ నాఁడు రామచంద్రుఁ డేదో యొకటి నిశ్చయముగాఁ జేసికొని లింగరాజునొద్ద సెలవుపుచ్చుకొని పోవలెనని యింటికివచ్చునప్పటికి లింగరాజొక సంచిరూపాయిల ముందువేసికొని పేరూరునుండి భూమి తాకట్టుపెట్టుటకు వచ్చిన యొక యరవబ్రాహ్మ

ణునితో వడ్డీనిగుఱించి ముచ్చటించుచుండెను. రామచంద్రుని జూడగానె యతఁడా ధనమును చూచుటచేత నడుగునేమోయని భయపడి మహాకోపమువచ్చి దగ్గఱనున్న కుమారునిఁ జూచి "వెధవా! తలుపువేయుమని యెన్నిమాఱులు జెప్పినను వేయవుగదా" అని వానినొక చరుపుచఱచి లోపల నణుగుకొనుచుండెను. అప్పుడు రామచంద్రుఁడు వారిని బలుకరింపఁగా వారిట్లు మాట్లాడిరి.

రామ—అయ్యా లింగరాజుగారు! తమకీవేళ సొమ్మందినదిగాబోలును. నేను నాలుగుదినములనుండి తమకొఱకు నిరీక్షించియున్నాను. ఏమైన దయచేయించినపక్షమున సెలవుపుచ్చుకొని వెళ్లిపోయెదను.

లింగ— (అసూయతో) నానిమిత్తమెవరు నిన్ను నిరీక్షించుమన్నారు. నీపని మీఁద నీవుండి నాకొఱకున్నాననియెదవేమి? నీకు రూపాయిలెవరు పోగుపోసుకొని కూర్చున్నారు? ఈరూపాయ లెవరిసొమ్మని నీకివ్వను? ఊళ్లోవాళ్లసొమ్మిచ్చినపక్షమున వాళ్లూరుకుంటారా?

రామ— తమదగ్గఱ లేకపోయినపక్షమున మరెక్కడనైన బదులిప్పించండి తమరు చెప్పినయెడల నాకెవరుబడితే వారేయిస్తారు రెండునెలలలో తీర్చగలను.

లింగ—నాకె [illegible]రు? నీవేలాటివాఁడవో నేను నాలాటివాఁడనే. ఏలినాటిశని లాగున పట్టుకొని వదలకుండ నున్నావేమి? దీనికి వేళాపాళా లేదు? నీయవసరమే నీదా?

రామ— ఆదినము పడవమునిగినప్పుడు మిమ్మునే బ్రతికించగా నాకు బహుమానము చేయుదుమని ముక్తేశ్వరము రమ్మనుమన్నారుగదా? నాలుగురూపాయలు బదులైన నివ్వలేరండి?

లింగ—నీవు నన్ను బ్రతికించినావా? శరీరమంతా కాల్లకుక్కవలె తెగఁగఱచి వదలిపెట్టినావు ఆపుండ్లు నాలుగుమాసములవరకు మాననేలేదు. వకనివొకడు బ్రతికించగలఁడా? చంపగలఁడా? దైవానుగ్రహమున్నదిగనుక నేను బ్రతికినాను నీకు బహుమానమియ్యడం నాకు విధిగాదు దయాధర్మభిక్షం. ఇస్తేయిస్తాను లేకపోతేలేదు.

రామ— ఆసంగతి నిదివరకే చెప్పినపక్షమున నేను వెళ్లిపోదునే. ఇన్నిదినములు నన్ను తేపుమాపని తిప్పుటయెందుకు.

లింగ— నోటికి శుద్ధిబద్ధము లేదేమి? నేను నిన్నుండుమన్నానా? సొమ్ములేదని మొదటేచెప్పినాను. అమలాపురంలో దొంగవస్తువులమ్మి మాయూరు పాడుచెయ్యవలెనని వచ్చినావా? నిన్ను గుమ్మములోనికి రానియ్యఁగూడదు. ఇంతంత బుద్ధులు నీకుండుటచేతనే ధర్మరాజువంటి శరభరాజుగారు నిన్ను లేవగొట్టినారు నేనొక

దమ్మిడినైన నివ్వను. నాయింటికి నీవు రావలసినపని లేదు. నడునడు.

అని లింగరాజుగారు చెప్పగానే గంపంత యాస పెట్టుకొన్న రామచంద్రునకు కోపవిచారము లొక్కసమయమునందే పుట్టెను; కాని కోపమును గనఁబఱచుటకది సమయము గాదుగనుక తన స్వాధీనములోనున్న విచారమును మఱి యొక్కమాఱు దెచ్చుకొనెను. లింగరాజువంటి పరమవిశ్వాసఘాతుకు డెక్కడైననుండునా? పడవ మునుఁగుటకు సిద్ధముగానున్నప్పుడు తాను రామచంద్రు నెన్నివిధములఁ గాళ్లు కడుపులు పట్టుకొని వేడుకొనెనో నేఁడన్నివిధముల దయదాక్షిణ్యములు లేక కసరికొట్టెను. అతని కేప్రకారముగ మనసు తాళెనో తెలియదు. రామచంద్రుఁడు తన కగుపడగానే యతనిని జ్ఞాపకము దెచ్చుకొనియు, లింగరాజెఱుఁగనివానివలెను జ్ఞాపకములేనివానివలెను నటింప నారంభించెను. తన ప్రాణసంరక్షణచేసిన రామచంద్రునకు తాను బహుమానములిత్తుననియు తన యావదాస్తి నిచ్చినను ఋణముతీరదనియు చెప్పి వానిని ముక్తేశ్వరమురమ్మని చెప్పిన లింగరాజు నాలుగురూపాయ లతనికి బదులైన నియ్యలేక, నతి దీనముగనున్న యా పిల్లవాని ననరానిమాటలని దరికిఁజేరకుండఁ గొట్టెను. లోకములో నిట్టి లింగరాజు లనేకులున్నారు. ఆశ్చర్యమేల?

ఇట్లు నిర్విణ్ణమనస్కుఁడై యాశాభంగముచేత నా దుఃఖమునుగలిగి పడవ దాటుటకొకడబ్బైనను లేక గోదావరిదగ్గరఁగూర్చుండి రామచంద్రుఁడిట్లువిచారించెను.

“హా! దైవమా! మా బిరాజు శ్రీరాములుగారి గర్భమునబుట్టి యాగర్భశ్రీమంతుఁడనైన నాకు రేవుపడవ దాటుటకొక కానియైన లేకుండ జేసితివి. నే నెక్కడ పాదముపెట్టిన నక్కడ నిర్ధూమధామ మగుచున్నది. నాకు మరణమైన నేల కలుగఁజేయవు. ఎన్నిదినము లన్నవస్త్రములు లేకుండ బాధపడగలను. మాతండ్రిగారు పోయినదిమొదలుకొని యీనాటివఱకు కష్టమేగాని సుఖమెఱుఁగను. నావంటి దిక్కుమాలినవాఁడు ప్రపంచమునం దెవ్వరును లేరు. కడుపులోనున్న దుఃఖము నంతె చెప్పుకొందమన్నను, యిరుపార్శ్వముల బంధువులన్నమాట లేరుగద. ఈశ్వరా! ఇప్పటికైన నీకు నామీఁద కసిదీరలేదుగాబోలును, అని కన్నీళ్లు కాలువలుగట్టి నేడ్చుచు, తుదకింత పాడుబ్రతుకు బ్రతుకుటకంటె ప్రాణత్యాగము చేసికొనుట మంచిదని తన కష్టము లంతము చేసికొనదలఁచి, దుఃఖతాపముచేత గల్గినబాధ చల్లని యా నదీగర్భమునందుఁ బ్రవేశించి దీర్చుకొన నిశ్చయించెను. అప్పుడు ప్రదోషకాలమగుటచేత ముక్తేశ్వరస్వామివారి యాలయమునకుఁబోయి ఈశ్వరదర్శనముఁజేసి కడపటిసారి యా దేవునకు మనసుదీర మ్రొక్కి తనకు వచ్చిన స్తవములన్నియు బఠించి దేవునకెదురుగా గూర్చుని తాను కవిత్వము చెప్పఁగలవాఁడేగనుక తన దీనావస్థను దెలుపుకొనుచు

నీ క్రిందిపద్యములతో నీశ్వరుని స్తుతించెను.

చ. గడపితినింతకాలమునుఁ గష్టచయంబుల నొంచుచుండి యీ
పుడమినిమాతృగర్భమునఁ బుట్టినదాది సుఖింపలేను నీ
యడుగుల నాశ్రయించి యిఁకనైన సుఖింపఁగఁ గోరుచుంటి నా
యెడఁగరుణించి వేగముగనీయవె మోక్షసుఖంబునీశ్వరా.

చ. జనకుడుదీరెనాకు నతిశైశవమందె గతించెతల్లియుఁ
మనమునన్నుఁగూర్చి యణుమాత్రము పొక్కెడువారులేరు నే
ననయము చేయిఁజాపుకొని యన్యులపంచల నుండజాలనో
యనఘకటాక్షముంచి వడినంతము జేయవె కష్టజాలముల్.

ఆ. వె. అడుగరానివారి నడిగితిద్రవ్యంబు । చేయరానిపనులఁ జేసినాడ
నన్నవస్త్రములకు ననఘునఁ క్షమియించి । ముక్తినీయవయ్య భక్తవరద.

ఈశ్వరా! నేనిదివఱకనేకపాపములనుఁ జేసినాను. నన్నేగతికంపినను భారము నీదె. ఈ దిక్కుమాలిన ప్రాణసంరక్షణకొఱకు అనేకులకు బాధనిచ్చినాను. నేటితో నాకష్టములన్నియు గట్టెక్కగలవు కరుణించి నీసాన్నిధ్యమును మాత్రము ను జేర్పుము. ఇదిగో నాచివరనమస్కారమందుకో: అని చేతులుజోడించి మ్రొక్కి మరల "నాకష్టములన్నియు సత్ప్రవర్తనమువల్ల గలిగినను నాకెన్నిజన్మములకైన సత్ప్రవర్తనమే దయచేయుము. నాకనేకోపకారములనుఁ జేసిన రాజగోపాలమును రక్షింపుము. అని గుడి వదలి గౌతమీనది యొడ్డునకుఁబోయి, బలవన్మరణము పాపహేతువనియెఱిఁగియు దుఃఖములచేత నామాట మఱచిపోయి వంశమునకు తానొక్కడేగనుక తలిదండ్రులకు కడసారను తర్పణమువదలి బట్ట బిగియగట్టుకొని నడుమున నుత్తరీయమునుఁ జుట్టి జందెమును మెడకుజుట్టి నదికి నమస్కారముఁజేసి కంఠము లోతునీళ్ళవఱకునుఁ బోయెను. పోయి యక్కడ నిలుచుండి, యక్కడనో తాటిపాకలోబుట్టి యతిసుకుమారముగా బెఱిగి రాజవోలులో మేనమామయొద్దను కొన్నాళ్లుండి, యమలాపురమున చదువుకొనుటకు వచ్చి యపనిందపాలై ముక్తేశ్వరమువచ్చి గోదావరిలో బలవంతముగా జచ్చుచున్న తన్నుగుఱించి విచారించి, రాజగోపాలమును దలఁచుకొని యొకమాఱును మేనమామను దలఁచుకొని యొకమాఱు నేడ్చి, చూచిచూచి యింత నిండు ప్రాణము నెట్లు బోగొట్టుకొందునా యని భయపడి నాలుగడుగులె వెనుకకువచ్చి, చచ్చెడువానికి భయమెందుకని మఱలలోతునకుఁబోయి, యెవరును లేరుగదాయని నాలుగుమూలల బారఁజూచి కన్నులుమూసికొని "మహాదేవా" యని గుభాలున లోతు నీళ్ళలో చేతులజోడించుకొని మునిఁగిపోయెను.

అతఁడొకమాఱు మునిఁగి యాతవచ్చినవాఁడుగనుక వెంటనే నీళ్లు త్రాగక తేలెను. అప్పుడొకమనుష్యుఁడు తడిగోచితోవచ్చి రామచంద్రుని జుట్టుపట్టుకొని మొలలోతు నీళ్లవఱకును దీసికొనివచ్చి యక్కడ వానిని నిలువఁబెట్టి తానును నిలుచుండెను. అతనినిఁ జూచి రామచంద్రుఁడు నిర్ఘాంతపడి కొంతసేపటికి "నీవెవ్వఁడవని" యడుగగా నామనుష్యుఁ డిట్లు చెప్పెను. అయ్యా! నేను పల్లెవాళ్ల చిన్నవాఁడను. నేనును, మావాళ్లుకొందఱును, భద్రాచలమునుండి కలపతెప్పలుగట్టి నీలపల్లి కీసికొనిపోవుచున్నాము. ఘడియప్రొద్దువేళ మాపిల్లవాఁడు తేవులో నీతలాడుచు చేతనున్న వెండి మురుగును పారవేసినాడు. రెండుఘడియలక్రిందట నేను నీళ్లలోమునిఁగి యావస్తువు నిమిత్తము యడుగునగూర్చుండి వెదకుచున్నాను. ఇదిగో వస్తువదొరకినది. నేను నీటిలోనుంచి బయటికి వచ్చునప్పటికి తమరు తేలి మునుగుచున్నారు. తక్షణమే నేను వచ్చి జుట్టుపట్టుకొన్నాను. నావస్తువేగాకుండ బ్రాహ్మణునిబ్రతికించిన పుణ్యముకూడ దక్కినది. బాబూ! నేను శెలవుతీసికొని తెప్పమీఁదకు వెళ్లుతాను.

అని పల్లెవాఁడుచెప్పగా తాను బలవంతముగా దిగినట్లు వానితోచెప్పక 'నీవు మంచివాఁడవు నాప్రాణ మీదినమున రక్షించినావు' అని వానినిపంపి తానును మెల్ల మెల్లఁగా బట్టలారవేసికొని బ్రాహ్మణునియింటికిఁ బోవుచు నిట్లాలోచించుకొనెను. నేను చచ్చిపోవుట దేవునకిష్టములేదు. నేనేదో గొప్పయదృష్టమునకే బ్రతికినాను. ఇకనేచావను. నామీఁద దైవమునకు సంపూర్ణముగా ననుగ్రహముగలదు అని వితర్కించుకొని, బ్రాహ్మణునియింటికిబోయి పురుడు వెళ్లిపోయినదిగనుక యాతనితో కలసి భోజనముచేసి తేవు దాటుటకు సొమ్ములేదని యాతనితోచెప్పి కొంచెముసొమ్ము గలదేమోయని సిగ్గుపడుచు నడిగెను. భూలోకమునం దవతరించిన కుచేలుడగు నా బ్రాహ్మణుడు గర్భదరిద్రుఁడగుటచేత సొమ్ములేక నొక ప్రాతబిందె నొకకోమటియొద్ద తాకట్టుపెట్టి పదునాలుగణాలుతెచ్చి రామచంద్రునకిచ్చి క్షమింపుమని వేడుకొనెను. ఉదయమునలేచి రామచంద్రుఁడు తేవుదాటి కోటిపల్లి వెళ్లెను. గోదావరిలోబడి తేలుటచేత తనకష్టములోనుండి తానును తేలినట్లు రామచంద్రునకుఁ దోచెను. కోటిపల్లివెళ్లి రామచంద్రుఁడు మహారాజుగారియొద్ద నేదైన యుద్యోగమును దెచ్చుకోవలెనని యోచించెను. కోటిపల్లి శ్రీమద్విజయనగరపు మహారాజుగారిది. మహారాజుగారు రాజధానియగు విజయనగరమునుండి యుద్యోగస్థులమూలమున కోటిపల్లిసంగతి నంతయు తెలిసికొనుచు నప్పుడప్పుడా గ్రామమువత్తురు.

---

596 (సశేషము) చిలకమర్తి-లక్ష్మీనరసింహము.

వివేకవిజయము. (౫౫౮-పుటశేషము.)

ప్రొద్దుగ్రుంకినది. ఉడుకు శమించలేదు. చంద్రశేఖరుని యాశ వదలుకోవలసినదేయని గోపాలము చెప్పినమాటలు మనస్సున బాధించుచుండఁబట్టి, మాణిక్యాంబకు రెండుయామములయినను కంటికి కునుకురాలేదు. గోపాలమును భార్యయుఁగూడ నిదురపోక గుసగుసలాడుకొనుచుండిరి.

‘మాణిక్యం మరొకణ్ని పెళ్లాడనంటో మూర్ఖపుపట్టుపట్టింది. చంద్రశేఖరం రావడం పెళ్లాడ్డంమాటకల్ల. దీనిపట్టు నెగ్గించుకుంటుంది. ఆలా అయితే మనకు నలభైయొకరాలు రావడమూ అంతా వట్టిదే. ఇందుకేమిటాలోచన?”

‘దీనిపట్టెక్కడ నెగ్గుతుంది? తండ్రో అన్నో వింటే తీసుకుపోయి తలమీద బలువు కాస్తా తగ్గిస్తేసరి జలుబువదుల్తుంది. మనింట్లో పెట్టుకున్నామని మనకెందుకు నింద పొమ్మనక?’

‘అయ్యో! ఆలా కాదే! యేవిధంగానైనా నలభైయకరాలుస్వాధీనంచేసుకోవాలి.’

‘దక్షిణామూర్తిని పిలిపించి చెప్పించండి కార్యముంటుందేమో’

‘వాడో చాపుపీనుగ. దీనిపట్టు రక్కసిపట్టు. వాడివల్ల పడదు వదలించడానికి.’

‘అతడికింతకుముందు టెల్లిగ్రాపిచ్చారుగాదూ. వాడొచ్చి తీసుకుపోతాడు.’

‘ఊ! ఉత్తకాగితంమీఁద నాలుగేవోగోకి ఆలానటించాను. నిజంగా యిచ్చాననుకున్నావూ? ఇది చచ్చిందీ బతికిందీ బెజవాడలో వాళ్ళకీతెలియదు రాజమండ్రంలో దక్షిగాడికీ తెలియదు. చంద్రశేఖరంగాడు యీగొడవేయెరగడు.’

‘అందుకు దీన్నేదైనా మందెట్టి కాజేద్దామంటూరాయేమిటి?’

‘ఇది బ్రదికున్నసంగతి మనంతప్ప యెవ్వరూ యెరగరు. గుటుక్కుమనిపిస్తిమా నలభైయెకరాలు సునాయాసంగా దక్కుతాయి.’

లఘుశంకకుఁబోవలెనని దొడ్డితలుపుదీయఁబోవుచుండఁగా, నీకడపటిమాటలు, మాణిక్యము చెవినిబడెను. భగవంతుఁడు సజ్జన పక్షపాతిగదా!

‘హా! యేమీ దుర్మార్గము! మిత్రుఁడనుకొని శత్రువుచేతిలోఁ బడితిని! ఇఁక నిట నుండఁగూడదు. నగలుకూడ నీకిరాతునిచేతిలోఁ జిక్కినవి! మొదటిసారివలె శాస్త్రిగారైన వద్దనుంచుకోక బరువెక్కినదని సవారిలో నిందునకే కాఁబోలు పడవైచినారు! పోమ్ముపోఁగాక! ప్రాణములు దక్కినఁజాలు. చీఁకటిలో నొంటిగా నెక్కడికిఁ బోను. దైవమే శరణ్యము.’

సతీపతుల గుసగుసలుడిగిన యరగంటవఱకు ముండ్లమీఁద నిలిచియున్నట్లుండి మెల్లఁగా వీధితలుపు తెఱచి. దారితెలియకపోయినను అఱకాలకన్నువచ్చినట్లొక వీధి దాటి యొకవీధి జేరుచుఁబోవుచుండఁగా, ఆమె గమనాతిశయమునుజూచి నలుగురు

పురుషులు వెంటఁబడి చేతులమీఁద నెత్తికొనివచ్చి యొకయిల్లుజేర్చి చెఱబెట్ట వంతులాడుచుండిరి. పాపమా దుష్టులమధ్య యసహాయయైన యాయబల యేమిచేయఁగలదు?

హా! దైవమా! ఆర్తిహరా! మానభంగమువచ్చినది! నీవే రక్షణము. లోకసామాన్యమైన యెన్ని పాపహేతువులనైన నీబలమువలన జయించితిని. దీనరక్షకా! లోకాతీతమయిన యీ కష్టమునుండి విడిపింపు. హా! హా! తలుపుదీయుచున్నారు!

'కోమలాంగీ! లే. మేము నిన్నిక్కడకుఁ దెచ్చినదెందుకో నీవెఱుగుదువు. మారు చెప్పితివా నోట్లో యీగుడ్డలు కుక్కుతాను'

'హా! దైవమా! దైవమా! దైవమా!'

'చూస్తేవేమోయి! నేపట్టుకుంటాను గుడ్డలు కుక్కవోయి!'

'ఆఁగు. ఆఁగు. ఎవఁడ్రా లోపల?' అని యొక యారక్షకభటుఁడు గొల్లెమూడు నట్లు తలుపుదన్నెను. మఱి యిద్దరును ఆతఁడును దొడ్డిదారినిఁ బారిపోవుచున్న విటులను వెంబడించి పట్టుకొనిరి. అచ్చట నిలిచిన యొకమనుష్యుఁడు నోటిలోని గుడ్డలు దీసి, చెమటలు తుడుచుకో అమ్మా! యెవరవమ్మా యీ ముండాకొడుకుల చేతుల్లో బడ్డావు? ఈనిశిరాత్రాల వొంటరిగా మీవంటోరు బయల్దేరొచ్చా?' అని యామె నూరడించెను.

మాటపోలికనుబట్టి యతని నానవాలుపట్టి,

'మొన్న తాడేపల్లిగూడెమునుండి నన్నిక్కడకుఁ దీసికొనివచ్చిన కుమ్మరిగాపు నాయినా!'

'మీరంటమ్మా! మా దొడ్డతల్లినమ్మా! ఈచీకట్లో యీలా యెందుకొచ్చారమ్మా!'

జరిగిన వృత్తాంతమును జెప్పి 'ఈలాగు జరిగినది నాయనా' దైవము నాపాలిటుండి నిన్ను బంపించినాఁడు. నీ ఋణమెన్నటికిని దీర్చుకోలేను నీ కేలా తెలిసినది నాయనా యీసంగతి?'

'తాపంసేత మేవేళికీ నిద్రట్టకపోతే ఉచ్చబోస్కోవాలని యీధిగుమ్మం దగ్గిరకొచ్చేటప్పటికి యీధిలో సందడ్పెరుగులూ యినపడ్తే సూద్దామని యీతే లొక్కొచ్చేటప్పటిక, మీ కేకల్నిబట్టి యెవర్నో ఆడగూతుర్ని దుర్మార్గంముండోళ్లు లేస్కుపోతున్నారని మావోళ్లింటి కెదురుగా కంస్టేబులు పడుకుంటే లేపి తీస్కొచ్చాను.'

'మొన్ననే వెళ్ళవలెనన్నావు గాదూ?'

'మావోళ్లెల్ల నిచ్చారుగారండి మఱి. యీ తెల్లారగట్ల బయల్దేర్తానండి.'

'బాబూ! నాసంగతి చెప్పినానుగదా! నేనిక్కడ నొకనిమిషమైన నిలువఁ గూడదు. ఇప్పుడు దగ్గిరదగ్గిరగా రెండుగంటలైనది. ఇఁక రెండుగంటలకు కాకులు

కూయ మొదలుపెట్టును. ఇప్పుడే యములుదేరి నన్నుగూడ దీసికొనిపోదూ. వెన్నెలవచ్చు వేళకూడ నయినది.'

పదునేనిమిదవ ప్రకరణము.

'ఓహోయి! యేమండో! ఓయబ్బా! కుంభకర్ణుండి నిద్రయిపోయెను.'

'ఎందుకే? అబ్బా! చంపుతావుగద! వో కునుకోనిద్దూ.'

'మనమనుకున్నపనేమిటి? మీకీనిద్రేమిటి?' (అని లేవదీసి కూరుచుండ బెట్టినది)

'చూద్దాంలే. వక్కమాటు వళ్లోకూర్చో!'

'ఇంకేం! ఏప్రయోజకత్వం లేకపోయినా యిదోటుంది. (కూరుచుండి, చెవిలో) జంగం బసవయ్యతోట్లోకెళ్ళేవేళయింది. అతనివద్దరకెళ్లి నాభిముక్క తేరూ?'

అంగవస్త్రము బిగియగట్టుకొని కండువా పైనివైచికొని,

'వీధితలుపు తీనుందేమేవు?'

'వక్క వట్టిదిగావుంది. రాత్రనుకున్నమాటలు విని దారట్టిందిగామోల్సు!'

'దక్షిగాడిచ్చిన టెలిగ్రాపుమాట చెప్పడంవచ్చింది నాబుద్ధితక్కువ.'

'ఎందుకుచెప్పాలి? ఏంజూద్దామన్నా అవకతవక లేగదా.' అని పళ్లుకొరికెను.

'నామీద పళ్లుకొరుకుతావేమే? దక్షిగాడు చచ్చేదుస్తావుంటే యెవణ్ని పెళ్లాడతావంటో చంపుతావేమిటంటుందేమో అని యిట్టే చెప్పారుతున్నాను'

'చేశావుగనుక అనుభవించండి. ఎన్నాళ్లుగడిస్తేరాను? నలభైయెకరాలు. (నెటికవిటిచి) మనమొగానికే అంతదశ? మహారాజు బావగారు చచ్చేలోకంలోవున్నారో! ఆయనపుణ్యమా అని గడించారు, మీరు గుణించండి. వ్యాజ్యంల్లో అప్పోసప్పో తెచ్చి మునసబు ముండాకొడుకు మొగాన్ని మొద్దులెట్టమని మొత్తుకుంటే వాళ్లేసినయేర జూచి విభక్తసోదరులని రాశాడు. హైకోర్టుకెళ్లినా తిరిగిందిగాదా ముక్క. ఎందుకూ నానోరే కనపడుతుందిగాని కార్యమేమన్నా ఉంటేనా?'

'అబ్బ! వక్కవరసనే సాధింపూ! ముష్టిసాధింపూ. నగలు మనచేతిలోనే చిక్కాయిలే!'

'అవిమాత్రం వుంచేమచ్చేమీది? నాపాలిటికెక్కడ దాపరమైందోగాని బోగం నాసైతి మొన్న పదెకరాలు రాయించుకున్నట్టే యిప్పుడివికూడా వళ్లోవేసుకుంటుంది'

'నీపోరుమానిపోను. దక్షిగాడూ మాణిక్యమూ రాజమండ్రంల్లో నీకోసం కని

పెట్టుకున్నారని చంద్రశేఖరానికి టెలిగ్రాఫివ్వాలని నే జూస్తూవుంటే ఆలోచనా తోచనియ్యవు యేమీ లేదూ.'

'నాపోరు మానీపోతే, సుఖంగా రమామణితో వుందురుగానిలేండి'

'లమిడీకే! ఇందాకటినుంచిపోనీ అని వూరుకుంటూవుంటే,' అని కఱ్ఱదెబ్బలు గొట్టెను. పాపము! ఆలోచన తెగనీలేదని మిషపెట్టి భార్యను ఉడుకుబోతుతనము కొలఁది కఱ్ఱదెబ్బలు కొట్టుటే కాని, ఆలోచన తెగి తంతివార్త పంపినప్పటికిని, ఖయిదీవలె గదిలో తాళముపెట్టఁబడి యయోమయములోనున్న చంద్రశేఖరశాస్త్రి దానిని జూచుకొనుటెట్లు తటస్థించును? ఈవార్తతో వ్యాఘ్రావధానులుగారేమి చేసిరో కాని, మఱునాఁడు శేషగిరిరావుగారు చంద్రశేఖరశాస్త్రితో వాదను మొదలుపెట్టిరి.

శేషగిరిరావుగారు కుబ్జవిగ్రహులు; బహునిష్ఠాపరులు. వీరిమెడ నెల్లప్పుడునున్న బంగారు చిక్కములు తులసితావళమే కాక, వీరికొక బంగరుమొలతాడును, తమ్మంట్లునుకూడ గలవుగాని అవి బంధువులయిండ్లకు వెళ్లినప్పుడును, పెద్దమనుష్యులు జూడవచ్చినప్పుడును తప్ప నితరకాలములందు ధరింపరు. చిన్నతనమున దారిద్ర్యమనుభవించినవారగుటచే కొంచెము పరోపకారము చేయవలెనని మనస్సునన్నున్నను, ఉపకారము కోరినవారు దీనులై పాదాక్రాంతులై స్తోత్రపాఠములవల్ల తృప్తిపఱచువఱకును నాయుపకారబుద్ధిని మేలుకొలుపరు. సాధారణముగా శాంతశీలము వారిమొగమున మూర్తీభవించి యుండునుగాని అప్పుడప్పుడు నొడలు తెలియని తామసమును గలదు. వీరికంతరాత్మ లేకపోలేదుగాని, అది చేష్టలయందుకంటె మాటలయందెక్కుడుగాఁ గనుపట్టును.

'నీవు చెప్పినట్లు వితంతువివాహములు ముఖ్యముగా ప్రోత్సాహపఱుపఁదగినవే. కాని కనిపెంచి నీపయిపుట్టెడు నాశను బెట్టుకొని నిన్నే నమ్ముకొనియున్న వృద్ధులైన నీ తల్లిదండ్రుల యభిమతము చెల్లించి పూర్వసంబంధమును మార్చి యిప్పుడు వారు మాట్లాడిన పిల్లను పెండ్లియాడి, ఆపయిని ధనమూలముగాను, మఱి యితరవిధములను వితంతువివాహములకు ప్రోత్సాహపెట్టు తల్లిదండ్రుల సంరక్షణముకంటె నుత్తమధర్మమేమున్నది?'

'లేకేమి? దానికంటెను, అన్నిటికంటెను, మహోత్కృష్టధర్మమొకటియున్నది.'

'ఏమిటది?'

'మనస్సాక్షి చెప్పినదానిని నెఱవేర్చుట.'

'నీమనస్సాక్షి వితంతువివాహములను బ్రోత్సాహపెట్టుమనుచున్నది గనుక నేఁజెప్పిన విధాన నావిధిని నెఱవేర్చి నీ తల్లిదండ్రులకోరిక జెల్లించు.'

'మర్యాదమనుష్యులు చేయవలసినవిధమేనా యిది? మనస్సా యొకటి మంచిదనుకొనుచు, కన్నవారికొఱకు మఱొకలాగు జేయుటకంటె మోసమును అధర్మ్యమును వేరున్నదా?'

'నామాటలలో తప్పేమున్నదో నాకుఁ గనఁబడదు ఇతరులను మోసపుచ్చుమని నేఁ జెప్పలేదు.—కన్నవారిమనస్సు నొప్పింపఁగూడదనియే నా యభిప్రాయము.'

'మీకు నచ్చఁజెప్పెదను వినుఁడు. మీది ద్వైతమతముగదా. మీకొమారునికిఁ గూడ నదియే పట్టుపడవలెనని మీకుండుట సహజమేగదా?'

'సహజమే.'

'కాఁబట్టి అద్వైతమతము వానికి పట్టుపడకుండ జాగ్రతపుచ్చుకొందురు?'

'ముఖ్యముగా'

'అద్వైతసిద్ధాంతము లాతనికి బోధింపనియ్యరు?'

'ఔను.'

'మీకొక యద్వైతి స్నేహితుఁడనుకొనుఁడు, ఆస్నేహమునుబట్టి మీపిల్లవానికాతనిచే పాఠములను జెప్పింతురనుకొనుఁడు. అతనిమతమును మీమతమును భేదించును గనుక, మీదయఁగోరి అతఁడు మీవద్ద అద్వైతమును ఖండించి ద్వైతమునే పొగడుచు, స్వమతాభిమానముచే లోలోన మీకొమారుని కద్వైతముబోధించి యాతని నామతమునకు దింపుననుకొనండి. ఇది మోసముగాదూ?'

'ఇది మోసమేగాని నేఁ జెప్పినదానికిని దీనికిని చాలతేడాయున్నది.'

'రెండింటికిని గీసయు వ్యత్యాసములేదు. ఇట్టి సంస్కరణములనుజేసి దేశమునకుపకారము జేసినవారిట్టి కపటవర్తనమువల్ల జెయ్యలేదు. వితంతువివాహములందు మీకును ఇష్టమున్నట్లు చెప్పినారుగాని మీరిచ్చిన సలహానుబట్టి మీకు లోపల నిజమైన యభిమానము లేనట్లూహించుట కవకాశము గలుగుచున్నది. నిజమైన సంస్కరణదీక్షగలవారు ప్రతిబంధము తొలఁగించుకొని కార్యమును సాధింతురుగాని. దొరికినదే చాలునని యే స్వల్పకష్టము గనుపట్టినను కార్యమును మానలేరు. బుద్ధుఁడు సంసారమును విడిచిపోయి పండ్రెండుసంవత్సరములవఱకును తల్లికి కనఁబడనప్పుడామె యడవికిఁబోయి, మాంసము శుష్కించి యస్థిపంజరమువలెనయి యొక చెట్టునీడను తపస్సుజేసికొనుచున్న కొమారునిజూచి, "బిడ్డా! నీమీదిప్రేమ పట్టఁజాలక నీకొఱకంత కష్టపడివచ్చిన నీతల్లిని కన్నెత్తియైనఁ జూడవేమిరా? నీ ముద్దుపెదవులు తెఱచి యొకమారు 'అమ్మా' పిలువకున్న ప్రాణములు నిలువవునాయనా!" యని కన్నీరు మున్నీరుగా నేడ్చినప్పుడు బుద్ధుఁడు తనపూనికను విడువలేదు; "పో. పో.

అభీష్టము సిద్ధించువఱకును, వింధ్యపర్వతములు చలించినను చలించుసుగాని, సిద్ధార్థుఁడీచోటనుండి కదలువాఁడు గాఁడు', అని పంపివేసెను. ఆమహనీయుఁడు తన యభీష్టము సిద్ధించి మతబోధ కారంభించినప్పుడయినను తల్లిదండ్రులకని తనపూనికను విడువలేదు. ఒకతఁడొకనాఁడు తండ్రి గృహమునకు భిక్షమునకుఁ బోయినప్పుడు సకలైశ్వర్యసంపన్నుఁడైన తండ్రివచ్చి పాదములమీఁదఁబడి, 'నాయనా! ఈ యైశ్వర్యములన్నియు నీవేయైనప్పుడు, నే నెప్పుడును నీకు బిచ్చము పెట్టుటకు? మన పూర్వుల గౌరవము నాలోచించియైన భిక్షాటనము మాని, రాజ్యము వహించి, నీ మతబోధచేయుమ'ని ప్రార్థించినను బుద్ధుఁడు తన నిశ్చయమును విడువలేదు. 'సిద్ధోదనా! నీపూర్వులు నాపూర్వులు కారు. నీపూర్వులు మహారాజభోగము ననుభవించిన లోకసామాన్యులు. నాపూర్వులు గోచిపాతయైన లేక భిక్షాటనము జేసి లోకము నుద్ధరించిన లోకాతీతుల'ని యాతనిని 'తండ్రీ!' యనియైన పిలువఁజాలినవాఁడు గాఁడు. నిజమైన పౌరుషమున్నవారిట్టివారే కాని మనబోటి పురుషనామకులు గారు. నాతల్లియుఁ దండ్రియు భగవంతుఁడును నాతోటిమానవులునే కాని మీరు జెప్పినవారు గారు.'

'నాకు పనియున్నది. పోయివచ్చెదనా?'

'చిత్తము'

ఈ సంభాషణమునుగూర్చి శేషగిరిరావుగారేమనుకొనిరో కాని, తమతో వెంటఁబడిన వ్యాఘ్రావధానులుగారితో నిట్లు జెప్పిరి.

'మీవాఁడు వాదనలకును యుక్తులకును లొంగువాఁడు గాఁడు. మొదలే పునర్వివాహములు మాడవన్నయెడల, ఇదివఱలో పండితులకాతఁడు చేసినమర్యాదయే నాకును జేసి విడుచునని నేను మఱియొకవిధముగా ఆ వివాహాలకు ప్రోత్సాహముచేసి నీ తల్లిదండ్రులను సుఖపెట్టుట నీధర్మమోయి యని చెప్పఁజూచేటప్పటికి, నామాట వినిపించుకొనుటా? యేమైనానా? మనస్సాక్షఁట! దేశక్షేమమఁట! విధఁట! వల్లకాఁడఁట! పెద్దపంచాంగము విప్పితే! ఈపద్ధతి కార్యము లేదు. నేఁజెప్పినదే దీనికుపాయము. పాపము పెద్దలు మీకువచ్చినదీ కష్టము!'

పంధొమ్మిదవ ప్రకరణము.

దక్షిణామూర్తి తంతివార్తకు జాబులేదు. మాణిక్యము జీవించియున్నదన్న యడియాశయెందుకు? చేసిన వివాహప్రయత్నములకు మొదటికే విఘ్నమువచ్చెను. దేహదుర్బలతవల్ల నీ సంవత్సరారంభమున దక్షిణామూర్తి మాసము దినములవఱకును కళా

శాలకుఁ బోవుట కభ్యంతరము గలిగినందున, రామారావు లెక్కప్రకార మాసమయమున రెండుదినములుకంటె మానుటకు వీలులేదు. అట్టిచో నేలూరునుండి తిరిగి వచ్చుటకు నాలుగుదినములుపట్టెను. పరీక్ష కంగీకరింపఁబడువారు కళాశాలలో హాజరుకావలసిన దినములని యమితికి లోటుపడెను. ఆ సంవత్సరము పరీక్షకుఁ బోవుటకు వీలుతప్పెను. ఆందోళనము పట్టఁజాల కప్పుడు రామారావునైన వెళ్ల నియ్యకపోయెను. మాణిక్యము కష్టములు గట్టెక్కినయెడల, ఒకసంవత్సరము చదువాటంకమైననేమి? అదియు లేకపోయెను. తుదకు మొదటికే మోసమువచ్చి మాణిక్యమే పోయెను. పాపము! దక్షిణామూర్తికీ విచారముచేనన్న హితవుతప్పి పిచ్చియెత్తినవానివలె నయిపోయెను!

౧౬వ యేప్రిల్ సాయంకాలము పడినది. అప్పుడు, సంతోషము! మహాసంతోషము!! మాణిక్యాంబవచ్చి దక్షిణామూర్తిని గౌఁగలించుకొనెను!!! కొంతసేపటి కాకస్మిక సమావేశమువలని భావనోద్రేక ముపశమించి కుశలప్రశ్నోత్తర పరివర్తనకు మారెను,

'మాయమ్మా! మాతల్లీ! బ్రతికియుంటివే! ఎలాబ్రతికి బయలపడినావమ్మా?'

'అన్నయ్యా! నేను పడవమునుఁగకముందు గదివెలుపలనున్నాను గనుక, పడవ బోరగిలఁబడినప్పుడు ముందుకుపడి యొడ్డునకు రావలెనని కొట్టుకొనుచు కేకలువేయుచుండఁగా, మనపాలిటి దైవములాగీతఁడు ఒడ్డునకుఁజేర్చి యాయువుపోసినాఁడు. కొంతసేపు నీకొఱకు వెదకి నీవును పడవతో మునిఁగిపోయినావని నిశ్చయించుకొని యీతనితో నేలూరు మఱిఁదిగారింటికిఁ జేరుకొన్నాను.'

'అయితే మేమిచ్చిన టిలిగ్రాపుకు జాబేలలేదు.'

'ఆసంగతి పెద్దగొడవున్నది. నీవేలాబ్రతికినావు? నాకు కనపడనేలేదు. పయిగా నేలూరులో నలుగురుకోమట్లు ముగ్గురుశూద్రులు మాత్రము బ్రదికినారని చెప్పినారు.'

'పడవ ముందుకు బోరగిలఁబడి తరువాత మరలి యింకొకగాలి విసరువల్ల తిన్నఁగ తిరిగినదని చెప్పినారు. నాకు నేడలే తెలియలేదు. ఆవలియొడ్డునున్న యొక డింగివాండ్రు సాయపడి నీళ్లలో కొట్టుకొనుచున్న నన్నును మఱి ముగ్గురిని బ్రతికించినారు. ఏలూరుసమాచారమేమిటి! తిన్నఁగా రాజమహేంద్రవరము రాక, అక్కడికెందుకువెళ్లినావు?'

'నాన్నో అన్నయ్యో యెప్పుడువచ్చి తీసికొనిపోయెదరో అను భయముచేత, మఱిఁదిగారు మనపక్షమున నున్నారుగదాయని అక్కడకుఁ బోవునప్పటి కాయనకు చేటుకాలపుబుద్ధి పుట్టినది.'

ఒండొరుల కష్టకథనములైనవి. చంద్రశేఖరునిమాట తెలియదయ్యెను. మరునాఁడు రామారావు చంద్రశేఖరశాస్త్రినిగూర్చి కనుఁగొని తంతివార్త బంపెదనని బెజవాడకువెళ్ళెను, అతఁడు ప్రయాణమైన మఱునాఁడు కృష్ణమూర్తివద్దనుండి యుత్తరమువచ్చెను. అందు స్వవిషయములైనవెనుక నిట్లుండెను.

‘చంద్రశేఖరం యేలూరులో నాడు పళ్లుఫలములకొఱకు బజారులో ఆగినప్పుడు చటాలున తండ్రి కనపడి గొల్లున గోలపెట్టి, కొడుకీలాచేశాడని తల్లి నూతులోదిగి చచ్చిందనిన్నీ, దహనంకానిచ్చి, కర్మచేయించడాని కతనికోసం వెతుకుతున్నాననిన్నీ యొక బూటకంపన్ని పదిమందినీ పోగుచేసి గల్లంతు చేశాడట. తండ్రిమాటలు నమ్మడానికి సంశయించి, పడవ్వగ్గిరున్న రాజగోపాలాన్నడిగి నిజం గనుక్కొన్నమీదట బెజవాడొస్తానని చంద్రం చాలాసేపు పట్టుపట్టినాడట. తప్పించుకు-పారిపోవడానికి సందుకోసం ఆలోచిస్తున్నాడనుకొని మాతృద్రోహి అని అక్కడున్న పదిమందీ పడతిట్టి తండ్రికంటె పరాయివాడిమాట నీకు పాటయిందా అని బళ్లదొడ్డిదగ్గిరకు పడగెంటు కెళ్లారట. తల్లిపోయిందన్న దుఃఖమేనా లేదు కటికిముండాకొడుకని వాళ్లన్నమాటలు పడలేక, మనస్సు స్థిమితంలేక నిజంగా తల్లిపోయిందే అనుకొని, కర్మ అనంతరం తనిష్టంవచ్చినట్టు చేసుకోనిస్తానని తండ్రిచేత చేతులో చెయ్యేయించుకొన్నాడట. వక్కమాటు పడవల్దగ్గిరకొచ్చి మాణిక్యంతో యీమాట చెప్పిపోదామంటే మేమెళ్లి చెప్తామని అక్కడివాళ్లు కదలనిచ్చారుగారట. బెజవాడలో బండి దిగీదిగడంలో గదిలోపెట్టి అతన్ని తాళంవెయ్యడంవల్ల మీకుత్తరంవ్రాయడానికి వీలులేక నన్నీఉత్తరం వ్రాయమన్నాడు. వ్యాఘ్రావధాన్లు నామీదకూడా అనుమానపడ్డాడు. నేనిక అతన్ని చూడ్డం పడదు. దైవం మనపాలిటుండును గాక!’

చంద్రశేఖరుని వర్తమానావస్థ వారికిఁ దరగని విచారము పుట్టించెను. మీనాక్షికిని కృష్ణమూర్తికి నేర్పడిన సంబంధము వారికి సంతోషావహముగానుండెను. చంద్రశేఖరుఁడు పూర్ణముగాఁ దండ్రి స్వాధీనములోఁ జిక్కెను. రామారావు బెజవాడ జేరుకొనునప్పటికి స్థితిగతు లెట్లుండునో. అతని తంతివార్త ౨౧ వ యేప్రిల్ తేదీని రావలెను. అంతట పదిగంటల టపాలో చంద్రశేఖరశాస్త్రివద్ద నుండియే యుత్తరము వచ్చెను.

‘వార్థక్యములోనున్న తల్లిదండ్రులకోర్కె చెల్లించి వారిని సంరక్షించుటకంటె నుత్తమధర్మ మింకొకటి లేదుగనుక, పూర్వపు సంబంధమునువదార్చి నాయనగారిప్పుడు గుదర్చిన పండ్రెండేండ్ల పిల్లను వివాహమాడఁబోవుచున్నాను. మాణిక్యాంబకు వివాహమయినదని విని మిక్కిలి సంతోషించినాను.

(సశేషము) గోటేటి-కనకరాజు.

భామినీవిలాసమున శాంతవిలాసము. (౫౩౬-శేషము)

చ. నరతరుణాతపంబు కరుణన్ హరియించుచు నష్టానర్చినన్
స్మరణశుభంగురాంగ రుచిమంగళమైన మెఱుంగుసోనల
న్బరిస్ఫుటమైయొకళిందగిరి పట్టితటంబున పెల్పు చెట్లప్రో
విరవగు నారిముగ్ధతతి యేదో పదీయమనంబు దాఁకెడిన్. ౩.

చ. యమునా తీరవనాంతరమ్ము నిజకాయాభన్ వెలింగించు, చ
ధ్వముల ద్రాణుల రాకపోకలయలంతల్మాన్చు చెల్లప్పుడు,
న్గమయమనియుస్వతి హృద్యలల్లికొనదీఁగ ల్పెన్కనూర్లెల్లెడ
ప్రసణీయంబదో యొక్కకానుగడఁచు న్నావంతలత్యంతమున్. ౪.

మ. నవచంద్రాతపమేదురామృతముల న్వైశద్యమందించుచు
న్భవసన్తోమ, మడంచుచష్టు త్రివిధమ్మన్ భాషిశితాపమ్ము, బృం
దవనంబుం బువసించి, యింద్రముఖులానందమ్మునన్ మ్రొక్కమే
ల్నవనీలాంబుధరమ్ము మామకహృదంతర్ధ్వాంతమున్మాపెడిన్. ౫.

తే. గీ. గ్రీష్మచండాంశుమండల భీష్మకీల । సంసగణతాపితాంగు న న్సాత్రివణాంబు
వాహభూతిని వసుదేవ వంశమణిని । మామకీనము వేదన మాన్చుఁగాక. ౬.

ఉ॥ పారము లేనిసంసరణ వారిధి నింద్రియగోచరోగ్ర కాం
తారప్రదారి సారె కను నావనమూకయకాచరించి వే
సారిన నన్ను, సూరతను జన్మసమీపనివాసి నూత్నమీ
శౌరితమాలభూరుహము శాంతసుదారుణతాపుఁజేయుతన్. ౭.

ఆ. గీ. త్రేకనంపుఁదీఁగ పెనఁగుతమాలము । వోలెఁ బాలకడలి బాలలీలఁ
గౌఁగిలించువేల్పు కంజనాభుఁడు మేని । తుదియదనను నాదు మదినిదోఁచు. ౮.

క. ఎలమికలిమిబలిపింప । న్గలదికసుంగవకు నేదొ కాదంబిని ని
చ్చలుగొలుచు నాదు తాపమ్ములవైశమె పొలియఁజేయ మొనయుంగాతన్. ౯.

మ. కలనేనంటను నాథ? నీవాసఁగు శిక్షన్ద్వైతతాహారము
న్గెలువంజాలిన యచ్చవుంబలుకున న్గర్విష్ఠ? యహంభావమ
గ్గలమైసిగ్గిడి; నిట్టి నేరములు లక్షన్బెంచు న న్వేండి శ్రీ
యులలోఁజేర్చు దయాబ్ధి నీవా కఁడ; వే నొక్కండ నేమత్తుఁడన్. ౧౦.

మ. ఘనపాతాళ సుపర్వలోకములకు; న్స్వర్ణశైలాగ్ర మె
క్కు; నదీనావలి దాఁటు; పట్టియున నీకుం దృష్ణ శాంతించునే;
కనుటుం జిత్తశరీరతాపములు, సౌఖ్యంబుం దనిత్యమ్ము, గో
రిన శ్రీకృష్ణరసాయనమ్ము గొను; మోరీ; నీ వృథాయాసముల్. ౧౧.

తే. గీ. అరయవే గణికాజామిళాదుల, నటు ! నేనునీకైద భవమనునగ్గలంపుఁ
గోఁత;హరి? కరుణామూర్తి?కూడదెట్లు ! నీవుపేక్షించుట నపేక్ష తేతగునను.

శా. దాకత్మక్కిత్తి; తింటిచక్కెర; నవిస్తారమ్ము పాల్గోలి;తిం
ద్రాక్షమ్మందమృతమ్ము ద్రావితివి; రంభోష్ఠంబు ఖండించితీ
వాకాంక్షుంబలుమారు; పల్కుమమదీయా?జీవ? సత్యమ్ము; కం
జేఁ! కృష్ణాయను నక్కరమ్ముల చవిన్నేళమ్ము నైద్దాననేఁ. ౧౩.

మ. పవి పాపాద్రుల,కెచ్చు, నౌషధము దివ్యంబిద్దియుద్రిక్తమహా
భవరోగమ్మున, కభ్యుదంచ దినబింబంబప్రమాణిట్టమో
నివహవ్యాప్తి;కుదగ్రకేల నికరోన్నృత్తుండు సప్తార్చిష్ణ
శవిటప్యాళికి, ద్వారమింపు బసకిచ్చన్గృష్ణయన్జంటద్రాల్. ౧౪.

చ. తెలిసితారిదుష్టములు దృశ్యములీయవి,లోనిరోధ మ
తులకొదవించి, యాక్షణమె గోచరముల్వరువెత్తు,లోనిరు
ల్వాలియఁగఁజేసి, పూర్ణసుఖమున్నవభాద్రపదాంబుదాభమై
వెలసెడునేదొ తేజన నశిన్నత నెప్పుడు మాన్గఁగాంతునో. ౧౫.

శా. అందున్నీకు హితంబిదోరి హృదయా?యాలింపు; గోబృందమూ
న్బృందారణ్యమునందు మేపునెతఁడో కీనన్గాన ద్రాదు సూ,
విందు;న్సుందరమందహాసముల నావేశమ్ము నొందించి ని
న్నిందున్నీకనువైన భోగములమాయించుం ద్రుటిన్నాయురే. ౧౬.

చ. ఏదివివరింపరాని ముదమిచ్చు మనోగతమై; గళస్థమై
యెదిదొలఁగించులో నిరులయేడ్తఱి; దాకఁ ద్రోవులున్సవా
స్పదమొనరించుతీపి నలు చక్కనిమిక్కుటపర్చుచున్న య
య్యది భుజియింపు కృష్ణయనునాఖ్యనుజిహ్వా? రసజ్ఞవౌదువేఁ. ౧౭.

చ. కలవ,జగమ్మునందు విహగములు పెక్కులురమ్యమూర్తు; లా
పులుఁగులలో, సమాదరముపొల్చెడు నామది నేమొ చాతక
మ్ములపయి పీనిగానఁ బాడమున్నిజమిత్రపయోదబుద్ధి; త
ద్విలసితనూను గృష్ణుఁడనుపేరువహించిన బ్రహ్మమెయ్యదో. ౧౮.

ఉ. ఏనివెలుంగున న్భువనమెల్లవెలుంగు; నెతండుగూఢ మి
మ్మేననుసర్వబుద్ధుల; కధీశ్వరు కృష్ణుని నాత్మహృద్గతు
న్గానక,తెల్పమంవాదుల కాళ్ళకుమ్రొక్కెద; రయ్యయో! తరం
బౌనె యనీతిమానవులదంతయు వర్ణనసేయనేనికేఁ. ౧౯.

శా. సేవింపందలఁతేన్ని లచ్చిమగనిస్సేవింపుమోరి? చెలి
భావింపన్వలతే సుదర్శనధరున్భావింపు మీయష్టు; గా
ధావాదంబునుగోరెదే, నుడువుకందర్పారిచర్యాళ్ళినిజా
త్మా? వాంఛించెదవేనికూర్కు, నహతంబౌనింపునంగూర్కుమీ. ౨౦.

మ. భవనైదాఘ మహాతపంబు తనువేర్పం, గ్రాంపి బల్మిన్వివే
కవిహీనత్వము పేరి సంకెలవడి, న్గాంక్షావ్యపాయాతి శీ
తవిశుద్ధాత్మతటాకమందిట సువిధ్వస్తాఘుజాలు ర్యనకృ
త్యవతంసంబులు క్రీడసేయుదురు శాంతాత్మాతి సంతృప్తులై. ౨౧.

మ. ఒనరింత్రధ్వర ముఖ్యకర్మములు ద్రాళ్ళోఁదస్వమోక్షంబు; బల
ధనిరాసంబున నంతరంగశమమందం, గాంత్రుమఖాసీట్సుతో
పనిబద్ధస్మృతి చింతయెంతో; దమితోభవ్యేతరాంభోధివే
లను జేర, న్నదులన్మంగుదు; రిదెల్ల న్సంస్మృతిన్బాసెంతనే. ౨౨.

తే. గీ. మొదలఁబదముల ముద్దిడి పిదపఁ జీలుదొ
డలను మోకాళ్ళఁదొడలఁబొక్కిలి హృదయముఁ
గవుఁగలించిన నాభావన విహరించుఁ
గాతశ్రీకృష్ణువదనాంబుజాతరుచిని. ౨౩.

క. మలయానిలహాలాహల । ములఁ, దరుణీచికుర భోగిభోగములందు
న్వెలివాంద్రయందు నేఁ దను । జులపయి నేసరిగ నీశుచూపువలచెదన్. ౨౪.

క. సకలము జగమేనశ్వర । ము; కళేబరములన నిందుబుద్బుదముల పో
లిక; దీనిఁగావమానవ । నికరము పడునట్టి దెంత నెంజెలియరా. ౨౫.

మిత్రివాతఁ బ్రతినిమేషము జొచ్చెదు । జనులనెల్లవారిఁ గనియుఁజిత్త
మేమియక్కటకట యిప్పుడునద్ది రా। యుడుగ దఖిల భోగయోగకాంక్ష.

క. అడఁగుతమిప్పుడు రాసిరి; । పడుఁ గావుత నొండెవాఁడి పట్టెంబులుపై;
నెడలించునాండెఁ దల జముఁ । డెడనాయది పాడియించు కే విడకుండున్. ౨౬.

క. పలునిప్పులకుప్పలు నా । తలనొప్పనివాఁడ నారతముసుజ్జ్వలి త
మ్ములు సేయనిమ్ము; నేఁ జెడు । పలుకురవంతేని నాల్కపయిఁ జొరనియ్యన్.

క. కానకతరణోపాయము । మానుము విన్నందనంబు మామకజీవా?
మానసపుదారినిట రాఁ । డే! నందునిసూనుఁ డెన్నఁడే ... ౨౮.

మ. మదవత్కుంజరయూథగండ మధుసంమాద్యద్విరేఫోత్సవా
స్పదఝుంకారమనోజ్ఞ యాస్థిరి నిమేషంబేనిమాకాస గా

ల్పదు; తన్మగున్నలు విత్తశీఘపరి విభ్రాన్తి తాపసులౌ వారి కా
రదు హర్యంఘ్రిపయోరుహద్వయ సపర్యాకృత్య సౌకర్యమే. ౩౦.

క. నిదురించె దేమిపాయము । తుదనిశ్శంక ముగ మిత్త్రి మనుకుచున చ్చెన్;
నిదురింపు మొండెసుగము; । న్నది మేల్కని జనని జహ్ను నందన చెంతన్. ౩౧.

క. ధరణీతలమున సాటెకుఁ । బరువిడిగొనెద యేలతాప పటుతృనిపుణునా
శిరమువనందకుమారుఁడు । పరమవిభుం డెల్లయపుడు వాసము సేయున్. ౩౨.

మ. మనసా? నన్నుమనోజశాసి పదపద్మద్వంద్వనిత్యాభి వం
దనదీక్షాపరున్ రారి, కినుకన్సంసార దుర్గాంతర
మ్మునఁ గూలింతువె? హంత్రుదాసజనుల న్బ్రోదించినంగీములం
తనెనీపుత్రవియోగ దుఃఖభవసంతాపంబు చల్లారునే. ౩౩.

క. మరకతమణిపర్వతమో, । తరుణతరంబిదితమాల తరువో యని పో
దిరి సందియమందలిమని । వరులు విలోకించి రామభద్రుఁ దవులన్. ౩౪.

క. యమునయొ? యిది; కాదది యుద
కమయిగదా; మరకతమణి కాంతియొ; యదియొ
ట్టుమధుర; యిటు రామతను వి-
భ మొదలఁదమిఁ గాంచి శంకపడి రెల్లజనుల్. ౩౫.

ఆ. గీ. మొగులుడో యఁగు మెఱుఁగొ, నగవరమువిభాయు
నలరుఁదీగెయొయిది యనుచు సంది
యమున మునిగియనుమఁడు మతి నిట్టూర్పుల
నిర్ణయించె విరహిణియనిపిదప. ౩౬.

శా. నీవుండన్నివనింప మాతలఁపుల న్నెమ్మన్యుసిం జేరుట
ల్సేవింపం గనఁబర్చు చర్ధిముదలన్, జెన్నొండఁగా దేవతా
గోత్రవెద్దన్నైనగాళ్ళఁదన్ని తలపెంకున్బిండిగాఁ జేయు చ
క్రీవంతమ్మునుబట్టి పాల్పితుకుఁగోరిక్రం జెంపుట ల్దుర్ఘటీ. ౩౭.

మ. సహజా? డెందమ? యెమ్మ; వే విడుపు సంసారంబసారం, బగు
స్పృహలుళంబుల్విరసంబులింపుఁ బను; లాపైరాము లోకప్రియా
వహసంగ్రామజయాభిరామ దినకృద్వంశాబ్ధిసోమున్సుశో
ద్వాహసంరక్షణకామ దైత్య హరణోద్దాము న్మదిం జేర్పుమా. ౩౮.

చ. విభవము నీచగేహముల, విప్రగృహమ్ముల లేమిసద్దు; మృ
త్యుభయము సజ్జనావళికి, దుర్జనులో చిరజీవు; లిట్లు నీ

ప్రభుతననీతిరీతిగని ప్రౌఢరుషాగ్ని శిఖావృతుండన
య్యె, భువననాథ! నీయెదియోర్తును బేదను జోదవాటచేన్. ౩౯.

శా. వాణీదేవి మదీయవాగమృత సేవాతత్పరశ్రోత్రయై
వీణావాదనకశ్లథాదరకరోత్ప్రీత్యప్రసాదర్థియాఁ;
బ్రాణిశ్రేణిన దేవిసంగని శిరంబాడింపఁ డేన్వాఁడె యా
క్షోణింబాఁబసువౌనా తత్పతియొ; యెచ్చోఁ బండితేశుండనన్. ౪౦.

ఉ. తేనియ ద్రాక్షపండులు ప్రతీతసుధారసమంగనాధరం
బేసరుదెఁ దమేనెపుడు నేనలరింపమియు న్బ్రసిద్ధమే;
యానరులద్ధిరా సరి శవానధికల్మనియు న్జడాత్మకు
ల్వాననివారు మోదభరమున్గవిపండితరాజధోరణిన్. ౪౧.

శా. నావాణీ యొరుపచ్చకోర్వమిని మున్కల్గొన్న డెందంబు వా
రై వేగన్నను గేలిసేయుదురు గాదా దుష్టులంచు న్విషా
దావేశమ్మును మాను; కావ్య కమలప్రాంచద్రసాస్వాదన
ప్రావీణ్యాఢ్యులమోముల న్విలసన ప్రాచుర్యముం జూపవే. ౪౨.

మ. అవనింబండితులన్యవాగ్మితులనా నాఢ్యుల్ద్రారల్స్ఫురుదా
సవఘూర్ణన్నయనుల్స్మరాలస సురస్త్రీణోష్ఠమాధుర్యలా
ఘవదానక్షమ మామకోక్తిరసరంగంబె ఫలోపేత సం
భవు నాస్యంబొనరించు లాస్యము ఘటింపన్నేఁటికాలంబునన్. ౪౩.

క. అరఁదీపులుద్రాక్షలు। క్షీరముఁ జెఱుకులును దేనె జేజేబోనం
బారయఁ బండితరాట్కవి। తారసమిదివంద్యమెయవుఁ దలకట్టగుటన్. ౪౪.

చ. చదివెను శాస్త్రముల్విధులు సల్పెను నిత్యముల్ఢిల్లిరేని చే
యిదలిరునందుఁ గ్రొంబరువమేగనానర్చెను; నేఁడు వాసన
ల్వదలహరిన్భజించు మధుపట్టణమం; దితరుల్పొనర్పలే
నిదెనిఖిలంబు పండిత వినేత జగత్పతి చేసెలీలచేన్. ౪౫.

క. పరనారీజనితులు దు। శ్చరితులు హరియింతురనుచు శంకవొడమి మ
ద్విరచితపద్యమణుల కా। దరమున మందసము నిర్మితమ్మిది నాచేన్. ౪౬.

పంచచామరము. హరాంధరాత్మజా మనోహరా, మృగాంకశేఖరా,
పురాసురాంధకారసూర, భోగిహార, శంకరా,
సురాసురోత్తమాంగరత్న శోభిపద్వసుంధరా,
పరాశరప్రభూతలింగ భాసురా, పరావరా.

భుజంగప్రయాతమ్. సువర్ణాద్రిచాపా, వచోదూరరూపా,
శివా, విష్ణురూపా, విశీర్ణాత్మపాపా,
భవా, వ్యాసపతానీట్కృపాన్యస్తకోపా,
సపాపాయ, మోక్షాప్త్యసామాన్యదీపా.

గద్య. ఇది శ్రీమత్కాశినకర్త్రి వ్యాసేశ్వర కృపాపాత్రాశ్వలాయన సూత్రాత్రేయ సగోత్రాకుండి వేంకటాంతర్వాణిప్రపౌత్ర, వ్యాసమనీషిపౌత్ర, వేంకటపండిత పుత్ర, సీతారామాగ్రజాం, బావ్యాసేశ్వర వేంకటాంబాపర వ్యాసేశ్వరాది కుటుంబి వ్యాసమూర్తిశాస్త్రి, మయూర సూర్యశతక పండితరాజ గంగాలహర్య నంతరాంధ్రీకృత భామినీవిలాసమున శాంతవిలాసము, సర్వము సంపూర్ణము.

ప్రాస్తావికవిలాస పరిశిష్టములు.

ఉ. చేరుదుర్మార్గు మాటలంతఁ జేడ్పడిపొన్నులుసిడ చెట్టుక్రిం;
దారయుమేలుసాను సడయమ్మగు నెమ్మదితోడఁ బొంగుచున్;
గోరుఁబరుండు తత్తరుపు కొమ్మలదూలములం బొనర్పు, ని
ర్ధారణసేయుఁదల్పులకు దాని మొదల్పరుడప్పుగోయగన్.

శా. శ్రీకర్ణాటవసుంధరాధిప సుధాసిక్తమ్ములౌ సూక్తులా
స్తోకమ్ముల్విను చిన్నవోకుమఖుమేల్సల్పన్మదిన్ప్రీతునన్
వాకొంపర్గపులింపు భూధర మహావారాశిదావాగ్ని వ
ల్మీకానోకహవాహినీ ప్రముఖము; ల్మేలేమగున్వానిచేన్.

క. చనుఁజేయ నుచితమింటికిఁ । జనుదెంచిన వైరికేని సత్కృతి? ఛేదిం
చునరునకుఁ బ్రక్కనీడ న । వనిరుహ ముపసంహరింపఁ భావింపదుగా.

విజ్ఞాపనము.

సహృదయులారా! శ్రీ జగన్నాథ విరచితములగు పండితరాజశతక శ్లోకములు శ్రీపరవస్తు వేంకట రంగాచార్యులయ్యవారలుగారు పరిష్కరించి ఆంగీరస సంవత్సరమునందు తమ యార్ష ముద్రాక్షరశాలయం దచ్చుగూర్పించి ప్రకటించిన పుస్తకము ననుసరించి తెనిఁగించితినిగాన వాని సంస్కృతశ్లోకములు కోరిన ౩౩౭

వఱకు వరుసగ నందె చూడందగు; వ్యాసతు సతీ గౌతమతు, మొదలయిన కవిస్తుతి పద్యము ౩౩౮ వది ౫వ, శతకము తుద, వ్యాసుంబోలును గాత, మొదలుగా ౯౭ వదిగాఁ జేర్పఁబడినది. ఆకాలమున బర్బురాదిపదములకు దేశ్యపదములు కనుగొన నిఘంటువులరయ నీశ్లోకము లె యుదాహరించి భామినీవిలాసములోనివనం, గలకత్తా నగరమునందు జీవానంద విద్యాసాగర భట్టాచార్యులు నారాయణయంత్రమున ముద్రించిన పుస్తకముగన నందుఁ బ్రాస్తావికవిలాసమున, 'దిగన్తే శ్రూయన్తే' మొదలు 'ఖండితానేత్ర' తుదగా ౧౭౬ శ్లోకములున్నవి. ముంబాపురమున శాస్త్రాధిపతి ధర్మశాస్త్ర బ్రహ్మాచార్యోపాధి ద్వయధారులు వైద్యవంశ్య రామచంద్ర కుమారులునగు లక్ష్మణసూరులు ౧౮౭౪ వ సం॥ ప్రకటించిన పుస్తకమునంగన నిందు, "మాధుర్య పరమసీమా" మొదలు ౧౨౯ పద్యములు నేతద్విలాస పరిశిష్టములని తుదిపుటను ౩ పద్యములు నున్నవి. ౪ వ శతకమున ౩౮, ౩౯, ౪౦ గా నామూడు పద్యములును ౪౧ మొదలుగా ముంబై పుస్తకమున ౭౬, ౭౭, ౭౮, ౮౬, ౯౧, ౯౩, ౧౦౩, ౧౦౭ మొదలు ౧౨౯ తుదగానున్న క్రొత్తపద్యములు తెలిగించి చేర్పఁగా (పతిగలయన్నపత్ని) తుదకు డెబ్బదిపద్యములైనవి తత్కాలలబ్ధమైన తాళపత్రపుస్తకముననున్న తరువాతి పద్యములకు సంస్కృతపద్యములు ప్రకటించుట యాకాంక్షితమని యిందు జేర్చితిని.

౭౧. అళిరసౌ నలినీకులవల్లభః । కమలినీకృతకేళి మదాలసః
విధివశాత్పరదేశ ముపాగతః । కుటజపుష్పరసం బహుమన్యతే.

౭౨. చాతకస్త్రి చతురాన్పయఃకణా । న్యాచతేజ లధరంపిపాసయా
సోపిపూరయతి విశ్వమంభసా । హంతహంతమహతాముదారతా.

౭౩. యశ్చనింబం పరశునా । యశ్చైనం మధుసర్పిసా
యశ్చైనం గంధమాల్యాభ్యాం । సర్వస్య కటురేవసః.

౭౪. గుణేషుయత్నః క్రియతాం । కినూటోపైః ప్రయోజనం
విక్రీయంతేన ఘంటాభి । ర్గావఃక్షీర వివర్జితాః.

౭౫. గుణైరత్తుం గతాంయాతి నతు జాతి ప్రభేదతః
క్షీరోదధి సముత్పన్నః కాలకూటః కిముత్తమః.

౭౬. నార్ఘంతిరత్నాని సముద్రజాని । పరీక్షకాయత్రనసంతిదేశే
ఆభీరపల్ల్యంచిత పద్మరాగం । త్రిభిర్వరాటైః ప్రపణంతిగోప్యః.

౭౭. ఫలవతిపిచుమందే మందబుద్ధేకిమర్థం
వసనిమధురవాణీం వ్యర్థయన్రాజకీర

అతిపరుషరవాణాంవాయసానాంనివాసే
పరిణతసహకారప్రాంతభోగంవిహాయ.

౪౮. ప్రబంధనం పద్మవనేనిశాయాం । మాతంగదానే మదకర్ణతాళః
స్వప్రాణభంగః ఖలుచంపకేస్మి । న్సర్వత్రసుఃఖం భ్రమరస్యలోకే.

౪౯. ప్రత్యంగణం ప్రతితరు ప్రతివారితీరం। కాకాశ్చరంతు చలచంచు పుటారటంతః
నోయాతి తృప్తిమథమండిత పుండరీక। షండేవసన్నహ హంతుష్యతి రాజహంసః.

౫౦. వనమార్జాలబీజంతు । దేవభోగాయకల్ప్యతే
ఖరస్య వృషణఃస్థూలః । కస్యవాకిం ప్రయోజనం.

౫౧. అయికోకిలపాక? కాకనీడే । వసయావద్భవతోభవన్తిపక్షాః
బహవస్తదనంతరం నివాసాః । పరితస్సంతి రసాధికారసాలాః.

౫౨. జన్మస్థలీ వారణ రాజమూర్ధా । మహీపతీనాం మకుటేనివాసః
అనాదరంచేత్కురుతేనభిజ్ఞో । ముక్తాఫలానా మిహకోపరాధః.

౫౩. గుంజాగంజితకబరీ । భిక్షబరీకిగ్గరీయసీనగరీ
ఇహానసిహ ముక్తావణిజః । కోపినముక్తాగుణజ్ఞోపి.

౫౪. హాహాహుకార పరదుఃఖవిహారదక్ష। కింమాంప్రతాపయసివా రశతానివహన్నా
ఆతాపితే నమమయాతి గుణాతిరేకో । ధూమస్తవైవ వదనేకిలభస్మపాతః.

౫౫. కాసారవర్య కలితాంబురుహావతంస । ముక్తాసమాన జలబిందుతరంగభంగ
కింభూషణం తవబకైర్బహుభిఃకురావై । స్త్వంసైర్వినాకలరవైర్నరదేవపూజ్యః.

౫౬. అబ్ధిరత్నమధోధత్తే । ధత్తేచశిరసాతృణం
అబ్ధేరేవహిదోషోయం । రత్నంరత్నం తృణంతృణమ్.

౫౭. యాతేయం భవతాసహైవరజనీ; ఖావీవికాసోదిశాం
సూర్యేణాపి; చిరంచకోరనికరః స్థేయఃక్వచిత్కాననే
ఉద్యద్దారుణచండభాను కిరణజ్వాలే జగన్మండలే
కస్మైచంద్రసమర్ప్యకైరవకులంవ్యోమాంతమాలంబసే.

౫౮. జానన్నంజనతోయ బుద్బుదకణప్రాయం స్వకంమస్తకం
పశ్యన్నాయ సకూటకోటి ఘటితత్రోటీపుటంవాయసం
నస్థాతుం నపలాయితుం నచలితుంనోన్మీలితుం మీలితుం
నోమర్తుం నచజీవితుం ప్రభవతిత్రాసాకులఃకోకిలః.

౫౯. భోనారికేళ? తవమస్తకభేదకానాం। సాధ్యంభవేత్తవజలం కఠినస్వరూప
నాహంత్వదీయసలిల గ్రహణేసమర్థ । స్త్వత్యంత ఖేదవిముఖ శ్శుకరాజపోతః.

రాజమహేంద్రవరములోని శ్రీవివేకవర్ధనీ కార్యస్థానమున వెలకుదొరకు పుస్తకములు

కందుకూరి- వీరేశలింగము గారిచే రచియింపఁబడినవి.

నాటకములు.	రు-	అ-	పై
౧. అభిజ్ఞానశాకుంతలము. (కాళిదాసునినాటకమునకు తెలుఁగు)	౦	౧౩	౦
౨. రత్నావళి- (శ్రీహర్షదేవవిరచితసంస్కృతనాటకమునకు తెలుఁగు)	౦	౬	౬
౩. మాళవికాగ్నిమిత్రము- (కాళిదాసప్రణీతనాటకమునకు తెలుఁగు)	౦	౬	౬
౪. ప్రబోధచంద్రోదయము- (కృష్ణమిశ్రుని నాటకమునకు తెలుఁగు)	౦	౮	౬
౫. రాగమంజరి- (ఇంగ్లీషు ననుసరించి తెనిఁగింపఁబడిన నాటకము)	౦	౮	౬
౬. కళ్యాణకల్పవల్లి (96 పుటలుగలమిక్కిలిరమ్యమయిననాటకము)	౦	౯	౦
౭. ప్రహ్లాదనాటకము- (భక్తిప్రధానమయిన వచనరూపనాటకము)	౦	౪	౬
౮. చమత్కారరత్నావళినాటకము-	౦	౪	౬
౯. బ్రాహ్మవివాహము.	౦	౩	౬
౧౦. వ్యవహారధర్మబోధిని.	౦	౩	౬
౧౧. వేశ్యాప్రియప్రహసనము	౦	౩	౬
౧౨. కౌతుకవర్ధని- (హాస్యప్రధానమయినచిన్న నాటకము)	౦	౨	౬
౧౩. హాస్యసంజీవని, మొదటిభాగము ...	౦	౪	౬
౧౪. హాస్యసంజీవని, రెండవభాగము- ...	౦	౪	౬
౧౫ తిర్యగ్విద్వన్మహాసభ, మూఢకాసువిజయము. (బొమ్మలతోనున్నది)	౦	౨	౬
౧౬. మహారణ్యపురాధిపత్యము- (బొమ్మలతోనున్నది)	౦	౩	౬
౧౭. వినీసువర్తకచరిత్రము. (షేక్స్‌పియర్ ప్రథమాభినయాంకములు)	౦	౪	౬
౧౮. కలిపురుషశనైశ్చరవిలాసము ...	౦	౨	౦
౧౯. వివేకదీపిక. (స్త్రీ పునర్వివాహ నాటకము మొదటిమూడంకములు)	౦	౪	౬
౨౦. సత్యహరిశ్చంద్ర నాటకము ...	౦	౯	౦
ఇంగ్లీషు ననుసరించిన ప్రహసనములు.			
౨౧. అపూర్వబ్రహ్మచర్యప్రహసనము- ...	౦	౨	౬
౨౨. విచిత్రవివాహప్రహసనము- ...	౦	౨	౬
౨౩. మహారణ్యప్రహసనము- ...	౦	౨	౬

౨౪. పునర్వరణ ప్రహసనము- ...	...౦	౨	౬
౨౫. బలాత్కారగానవినోద ప్రహసనము	...౦	౨	౬
౨౬. కేశవప్రియా ప్రహసనము- ...	...౦	౨	౯
౨౭. మహామహోపాధ్యాయ ప్రహసనము	...౦	౨	౬
౨౮. యోగనిద్రా ప్రహసనము. ...	...౦	౨	౬
౨౯. మహావంచక ప్రహసనము- ...	...౦	౨	౬
౩౦. అసహాయశూర ప్రహసనము- ...	...౦	౨	౬

పద్యకావ్యములు.

౩౧. అభాగ్యోపాఖ్యానము- (పద్యరూపమునున్న హాస్యప్రబంధము)	౦	౨	౬
౩౨. శుద్ధాంధ్ర నిరోష్ఠ్య నిర్వచన నైషధము (అచ్చతెలుఁగు)	...౦	౪	౬
౩౩. రసికజనమనోరంజనము- (అచ్చతెలుఁగు శృంగారప్రబంధము)	...౦	౬	౬
౩౪. శుద్ధాంధ్రభారతసంగ్రహము- ...	...		
౩౫. పథికవిలాసము ...	...౨	౪	౬
౩౬. జార్జిగిఫ్ట్ తేటగీతములు ...	...౦	౧	౬
౩౭. నీతిదీపిక-(బాలురనిమిత్తము చేయఁబడిన నీతిపద్యముల పుస్తకము)	...౧	౨	౬
౩౮. స్త్రీనీతిదీపిక- (బాలికలనిమిత్తము చేయఁబడిన నీతిపద్యములు)	...౦	౨	౬

స్త్రీలకుపయోగపడు పుస్తకములు.

౩౯. చంద్రమతీచరిత్ర (స్త్రీలకు ఉపయుక్తమైన నీతిబోధక పుస్తకము)	...౦	౪	౬
౪౦. సత్యవతీచరిత్ర (స్త్రీలకావశ్యకమైన చరిత్ర)	...౦	౪	౯
౪౧. సత్యసంజీవని. (స్త్రీలకుపయోగించెడు నీతిబోధకమయిన కథ)	...౦	౪	౬
౪౨. సత్యాద్రౌపదీసంవాదము, మాతృపూజ & పితృపూజ-	...౦	౧	౬
౪౩. దేహారోగ్యధర్మబోధిని-(శరీరారోగ్యధర్మములబోధించుపుస్తకము)	౦	౪	౬

షేక్స్పియరు నాటక కథలననుసరించి వ్రాయఁబడిన కథలు.

౪౪. చమత్కారరత్నావళి.	...౦	౨	౬
౪౫. కురంగేశ్వరవర్తకచరిత్రము-	...౦	౨	౬
౪౬. కళావతీపరిణయము	...౦	౨	౦
౪౭. గయ్యాళినిసాధుచేయుట-	...౦	౨	౦
౪౮. రఘుదేవరాజీయము-	...౦	౩	౬
౪౯. చిత్రకేతుచరిత్రము-	...౦	౨	౦
౫౦. సుమిత్రచరిత్రము-	...౦	౨	౦
౫౧. వానకేసరివిలాసము-	...౦	౨	౬

ఉపన్యాసములు.

౭౨. వర్ణము.	... ౦	౨	౬
౭౩. మనుష్యజీవితముయొక్క పరమార్థము, దానినిపొందుమార్గము	... ౦	౨	౬

వివిధ పుస్తకములు.

౭౪. శారీరశాస్త్రసంగ్రహము.			
౭౫. ఆంధ్రకవులచరిత్రము, మొదటిభాగము.	... ౦	౧౧	౦
౭౬. ఆంధ్రకవులచరిత్రము. ద్వితీయభాగము ౧౬౦ ప్రతులుగలది	... ౧	౨	౦
౭౭. ఉపన్యాసమంజరి.	... ౦	౬	౬
౭౮. ఆంధ్రతర్కసంగ్రహము.	... ౦	౧	౬
౭౯. సంగ్రహవ్యాకరణము.	... ౦	౫	౬
౮౦. కావ్యసంగ్రహము.	... ౦	౨	౦
౮౧. నీతికథామంజరి (ప్రథమభాగము ౭౨ పటములతో)	... ౦	౮	౦
౮౨. నీతికథామంజరి ద్వితీయభాగము.	... ౦	౮	౦
౮౩. నీతిచంద్రిక, విగ్రహము.	... ౦	౧౩	౦
౮౪. నీతిచంద్రిక, సంధి.	... ౦	౬	౬
౮౫. రాజశేఖరచరిత్రము.	... ౧	౨	౦
౮౬. సత్యరాజాపూర్వదేశయాత్రలు, మొదటిభాగము.	... ౦	౬	౬
౮౭. సత్యరాజాపూర్వదేశయాత్రలు, రెండవభాగము.	... ౦	౬	౬

పూర్వకవిప్రణీత గ్రంథములు.

౧. కవిరాజమనోరంజనము. (పురూరవశ్చరిత్ర)	... ౦	౮	౦
౨. మొల్లరామాయణము.	... ౦	౧౧	౦
౩. ప్రభావతీప్రద్యుమ్నము.	... ౦	౧౩	౦
౪. పాంచాలీపరిణయము.	... ౦	౬	౬
౫. రామాభ్యుదయము. (మొదటిమూడాశ్వాసములు)	... ౦	౪	౬
౬. యయాతిచరిత్రము.	... ౦	౬	౬
౭. అథర్వణకారికలు.	... ౦	౨	౬

పదిరూపాయలకంటె తక్కువ గాని మొత్తమునకు పుస్తకములు కొన్నపక్షమున నూటికి పదిరూపాయలవంతున పుస్తకములుచితముగా నియ్యబడును. వెలలువేయని పుస్తకములు మరల ముద్రింపబడవలసియున్నవి.

పయిపుస్తకములు కావలసినవారు, గోదావరిజిల్లా, రాజమహేంద్రవరము శ్రీవివేకవర్ధనీ ముద్రాక్షరశాల మేనేజరుగారికి వ్రాసి తెప్పించుకొనవచ్చును.

ACKNOWLEDGMENT.

మ-రా-శ్రీ,	రూ.	అ.	పై.
,, జే- సుందరరామయ్యగారు, రాజమండ్రి.	౧	౦	౦
,, జి- శ్రీనివాసరావుగారు, మదనపల్లి.	౩	౨	౦
,, టి- రామయ్యగారు, చెన్నపురి.	౨	౮	౦
,, యస్- భావరాజుగారు, అల్లవరం.	౩	౨	౦
,, కే- శ్రీనివాసరావుగారు, బళ్లారి.	౩	౦	౦
,, ప్రెసిడెంటు తాలూకాబోర్డు, కంభము.	౪	౧౨	౦
,, యే- అప్పడు పంతులుగారు' పార్వతీపురము.	౮	౨	౦
,, సి- ఇ- వేదాంతచారిగారు, పెనికొండ.	౨	౭	౦
,, యమ్- భీమపరాక్రమరావు నాయుడుగారు, కడప.	౩	౨	౦
,, పి- పానకాలరావు పంతులుగారు, కాకినాడ.	౮	౦	౦
,, సెక్రటరీ రీడింగుక్లబ్బు, అనకాపల్లి.	౩	౦	౦
,, యమ్- రామకృష్ణయ్యగారు, భీమవరం.	౨	౦	౦
,, కే- వేరయ్యగారు, వడ్లమూడి.	౨	౮	౦
,, ఒ- రామయ్యగారు, రమణప్పపాలెము.	౩	౧౪	౦
,, శ్రీ రాజా త్సాడా పూసపాటి వీరపరాజు దక్షిణకవచ దుగరాజు బహద్దరుగారు, సాలూరు.	౩	౦	౦
,, యన్- వీరరాజుగారు, తిరుపతి.	౩	౨	౦
,, శ్రీశ్రీశ్రీయిండిపెండెంటు గణపతి మహారాజా కంపెనీ, వడ్డాది.	౩	౦	౦
,, యస్- వీరభద్రయ్యగారు, గుడివాడ.	౨	౮	౦
,, యమ్- రామయ్యగారు, పసలపూడి.	౨	౮	౦
,, యే- వి- జగ్గారావుగారు, విశాఖపట్టణము.	౩	౨	౦
,, డి- వెంకటనర్సయ్యనాయుడుగారు, డిటో.	౩	౨	౦
,, కోదండరామయ్యగారు, బెజవాడ.	౩	౦	౦
,, డి- వాసుదేవరత్నంగారు, నూజివీడు.	౩	౦	౦
,, జి. జగన్నాథరావుగారు, రాజాము.	౩	౨	౦
,, సి- యచ్- సుబ్బారాయుడుగారు, యేలూరు.	౩	౨	౦
,, యే- పుండరీకాక్షుడుగారు, బందరు.	౩	౦	౦
,, శ్రీ రాజా- కే- ఆర్- కృష్ణారావుగారు, చెన్నపురి.	౧౦	౦	౦
,, సెక్రెటరీ రీడింగురూమ్ లిటరరీసొసైటి, పురిపెండ్ల.	౩	౦	౦

ప్రకటన.

ఏమికావలసినను సప్లయిచేయువారు.

M. T. Co.

ఇండియాదేశము అంతకు పెద్దపట్నమున్న రాజధానియునైన కలకత్తానగరమందు దొరకని వస్త్రములు ప్రపంచమందు లేవనే నమ్మవచ్చును. ఇక్కడ విక్రయించబడు సమస్తము బహు చిత్రముగానుండునని తక్కువ ఖరీదులకు దొరకునని అందరికి తెలియును. గనుక యెవరికి ఏమికావలసినను సరే యీ దిగువవ్రాసిన కంపినివారిపేర దరఖాస్తులు పంపుకున్నట్టయితే న్యాయమైన ఖరీదులకు సప్లయి చేయుచున్నారు. ఏది కావలసినది ఏకిమ్మతుకు కావలసినది. దరఖాస్తుదారునిపేరు. కాపురస్థలము, పోస్టాఫీసు, డిస్ట్రిక్టు స్పష్టముగా వారివారి స్వభాషతో వ్రాయవలెను. కావలసిన వస్తువులుపంపి పిమ్మట పోస్టుప్యాక్ వగైరాలద్వారా సొమ్ము వసూలు చేయుదురు. జవాబులు కావలసినవారు ప్రత్యుత్తరము వ్రాసి జవాబు తెప్పించుకోవచ్చును. ౧ యమ్, టి, అండుకో. ౩ కాశినాథుమల్లికలైను, కలకత్తా అని వ్రాసుకోవలెను.

ప్రకటన.

మదరాసు ప్రెసిడెన్సీ కాలేజి యాంధ్రభాషాభివర్ధనీ సమాజమువారు తేమః గుర ౧౯వ శతాబ్దమునందలి యాంధ్రభాషాభివృద్ధినిగూర్చి శ్రేష్ఠతమమయిన వ్యాసమును వ్రాసినవారికి ౨౫ రూ బహుమానము నీయఁదలంచినారు: ఈవ్యాసము నెల్లరును వ్రాయవచ్చును. వ్యాసములు ౧౮౯౯ సం॥ ౧ ఆగస్టులోఁగాఁ ప్రెసిడెన్సీ కాలేజిలో నసిష్టాంటు ప్రొఫెసరుగానున్న మ-రా-రా-శ్రీ, మల్లాది- వేంకటరత్నము గారికి పంపవలెను.

దాసు - గోవిందరావుపంతులు,

కార్యదర్శి.
